
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapakksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

'పాలమూరు – రంగారెడ్డి' ప్రాజెక్టుకు
**జాతీయ హోదా ఇవ్వాలి**
తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల పట్ల కేంద్రం వివక్షత తగదు
'తుమ్మిడిహెట్టి'పై మహారాష్ట్రను ఒప్పించాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
03

సంపుటి 09, సంచిక: 253 | బుధవారం | 12-08-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## పార్లమెంట్ ఎదుట

# పోటాపోటీ నిరసనలు

అధికార, విపక్ష ఎంపిల నినాదాలతో దద్దరిల్లిన ప్రాంగణం

బారికేడ్లను ఏర్పాటు చేసిన భద్రతా సిబ్బంది

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఆవరణలో మంగళవారం అధికార, ప్రతిపక్ష ఎంపిలు పోటా పోటీగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దీంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల 'క్రూరమైన' చర్య, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీకి సంబంధించిన అంశాలపై నిరసనలు తెలుపుతూ, నినాదాలు, ప్రతినినాదాలు చేసుకుంటూ అధికార ఎన్‌డిఎ, ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపిలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ముఖాముఖి తలపడ్డారు. ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది వారి మధ్య బారికేడ్లు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్‌డిఎ ఎంపిలు ఆరోపించగా, పేపర్ లీక్‌లపై జులై 20న తరువాయి 8లో

07
మా డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గలే
మొదటి నుంచీ స్థిరంగానే ఉన్నాం
పార్లమెంట్‌లో ప్రతిష్టంభనపై మల్లికార్జున ఖర్గే స్పష్టీకరణ

07
'కేరళం బిల్లు', 'జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ)' బిల్లులకు లోక్‌సభ ఆమోదం

## హైదరాబాద్ పాతబస్తీకి

# త్వరగా మెట్రో రైల్

రెండోదశ పనుల్లో వేగం పెంచాలి

వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి

మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలి

సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనులలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) పై సిఎం ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజిబిఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలిపారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు నిత్యం రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి తరువాయి 8లో

బిఆర్‌ఎస్ హయాంలో ఎకరా రూ.90 లక్షలు..
**మేము రూ.1.50 కోట్లకు కేటాయించాం**
పరిశ్రమలు రాకూడదన్న ఉద్దేశంతోనే కెటిఆర్ దుష్ప్రచారం: మంత్రి శ్రీధర్‌బాబు



03

'టెస్సెరాక్ట్' కంపెనీకి ప్రభుత్వ భూమి కేటాయింపుపై
**ప్రభుత్వం సమగ్ర విచారణ**
కెటి.రామారావు డిమాండ్





## నిషేధిత భూములపై

# ఆందోళన వద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- ఈనెల 14లోగా డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- యుద్ధప్రాతిపదికన దరఖాస్తుల పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- సబ్ రిజిస్ట్రార్‌ల విచక్షణాధికారాలకు చెక్

ప్రజాపక్షం/హైదరాబాద్

నిషేధిత ఆస్తుల పిఓబి/22ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములనూ ప్రస్తుత ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి, బాధితులకు ఊరట కలిగిస్తామని మంత్రి తెలిపారు. సచివాలయంలోని తరువాయి 8లో



## కార్మికులు, కర్షకులు రాత్రింబవళ్లు కష్టించినా

# తగిన ప్రతిఫలం లేదు

- దేశ సంపద బడా కార్పొరేట్ చేతుల్లో కేంద్రీకృతం
- బాధితులంతా ఏకమైతే ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదు
- ప్రజాచైతన్య యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటన

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/కోదాడ

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లక్షలాది మంది విద్యార్థులు, యువత సాగించిన ఐక్య ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కష్టపడి చదివిన యువతకు ఉపాధి కల్పించకుండా, వరుస పేపర్ లీకేజీలతో వారి భవిష్యత్తుతో ఆడుకోవడం దారుణమన్నారు. దేశ సంపదంతా కొద్దిమంది బడా కార్పోరేట్ల చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని, రాత్రింబవళ్ళు శ్రమించే కార్మికులు, తరువాయి 12లో








## ఢిల్లీ విద్యార్థుల

# పోరాటమే స్ఫూర్తి

బిజెపి పాలన నుండి ప్రజలకు విముక్తి కలిగించేందుకు ఆ తరహా ఉద్యమం చేయాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/హనుమకొండ

దేశంలోని ప్రజా వ్యతిరేక బిజెపి పాలన నుండి ప్రజలకు విముక్తి కల్పించేందుకే సిపిఐ పోరాటం కొనసాగిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. స్థానిక వెయ్యి స్థంబాల దేవాలయం నుండి ఈ ప్రదర్శన హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్ గార్డెన్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తరువాయి 8లో



## రాంచీలో విద్యార్థులపై హింసకు సిపిఐ ఖండన

**న్యూఢిల్లీ :** జార్ఖండ్ రాజధాని రాంచిలో సోమవారం విద్యార్థుల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా జరిగిన హింసను సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో ఖండించింది. నిరసన చేస్తున్న విద్యార్థులు, జెపిఎస్‌సి–జెఎస్ఎస్‌సి అభ్యర్థులపై బలప్రయోగం చేయడంపై భారత కమ్యూనిస్ట్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. ప్రజాస్వామ్యంలో విభేదాలకు బారికేడ్లు, పోలీసు చర్యలతో సమాధానం చెప్పలేమని, న్యాయం కోరుతున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వం హింసతో కాకుండా, సంప్రదింపులు, చర్చల ద్వారా స్పందించాలని పేర్కొంది. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లు నిజమైనవని, వారి పరీక్షలు, నియామకాలు, భవిష్యత్తుకు సంబంధించినవని, న్యాయం, జవాబుదారీతనం కోరుతూ శాంతియుతంగా సమావేశమైన యువతను శాంతిభద్రతల సమస్యగా పరిగణించకూడదని పేర్కొంది. నిరసన చేస్తున్న విద్యార్థులపై వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్, లాఠీచార్జి ప్రయోగించడం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. ఇది వారి ఆవేదనను మరింత పెంచుతుందని, జార్ఖండ్ ప్రభుత్వం తక్షణమే బలప్రయోగాన్ని ఆపి, నిరసన చేస్తున్న విద్యార్థులతో అర్థవంతమైన సంప్రదింపులకు పరిస్థితులను కల్పించాలని సూచించింది. విద్యార్థి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి, వారి సమస్యలను ఓపికగా విని, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.




## నేడు బారాబంకీలో

# ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాలు

- రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి ముగింపు వేడుకలు
- తొలి రోజు ర్యాలీ, బహిరంగసభకు ఎఐఎస్‌ఎఫ్ మాజీ నేతలు అమర్‌జీత్ కౌర్, అజీజ్‌పాషా, రామకృష్ణ పాండా, సందోష్ కుమార్

**బారాబంకీ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) 90వ వ్యవస్థాపక వార్షికోత్సవ జాతీయ స్థాయి ముగింపు వేడుకలు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నో సమీపంలోని బారాబంకీ పట్టణంలో బుధవారం ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ఎఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు, మాజీ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు,దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు అక్కడకు చేరుకున్నారు. ఈ వేడుకలకు బారాబంకీలోని గాంధీభవన్ వేదిక కానుంది. 90 వ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా ఆగస్టు 12వ తేదీన ఉదయం 11 గంటలకు బారాబంకిలో ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభకు ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ నాయకులు ప్రస్తుత ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, రాజ్యసభ సభ్యులు పి.సందోష్ కుమార్‌తో పాటు పలువురు ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు హాజరవుతారు. మరుసటి రోజు ఆగస్టు 13న 'ప్రజా విద్య పరిరక్షణ: సవాళ్లు, ముందుకు సాగే మార్గం' అనే అంశంపై ఉదయం 10 గంటలకు సెమినార్ నిర్వహిస్తున్నారు. దీనికి లక్నో విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రూప్ రేఖ వర్మ, అఖిల భారత విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ అరుణ్ కుమార్, మాజీ ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి, వై.ఎస్. లోహిత్ ప్రసంగించనున్నారు.

## జినోమ్ వ్యాలీలో 'యామ్జెన్'

# పరిశోధన కేంద్రం

- 200 మందికి ఉద్యోగావకాశాలు
- ప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకున్న యామ్జెన్
- స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో మరో అంతర్జాతీయ బయోటెక్నాలజీ దిగ్గజం భారీ పెట్టుబడికి ముందుకొచ్చింది. గ్లోబల్ బయోటెక్నాలజీ సంస్థ యామ్జెన్ జినోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో తెలంగాణ ప్రభుత్వంతో సంస్థ ఎంఒయు కుదుర్చుకుంది. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు.. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని సంస్థ కార్యకలాపాల తరువాయి 8లో

## డిసెంబర్ నాటికి

# 3 పబ్లిక్ స్కూళ్లు

మంచాల, వంగూరు, పోల్కంపల్లి టిపిఎస్ పనులు వేగవంతం

ప్రజాపక్షం/హైదరాబాద్

అత్యంత ప్రతిష్టాత్మకమైన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'(టిపిఎస్) ప్రయోగాత్మక ప్రాజెక్ట్ పనులలో మరింత వేగాన్ని పెంచాలని, డిసెంబర్ నాటికి 'మంచాల, వంగూరు, పోల్కంపల్లి' టిపిఎస్‌లను పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. మంచాల, వంగూరు, పోల్కంపల్లిలో చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల పనులను తెలంగాణ విద్యా కమిషన్ మంగళవారం సమీక్షించింది. ఈ సమీక్షలో పాఠశాల విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా, శివారెడ్డి, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్, తరువాయి 8లో

# ఝార్ఖండ్‌లో యువతపై పోలీసు జులుం

జులై 20న న్యూఢిల్లీలో – నీట్ తదితర పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజికి కేంద్ర ప్రభుత్వం నుంచి 'జవాబుదారీతనం' డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ పిలుపుకు స్పందించిన విద్యార్థుల 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా మితిమీరిన పోలీసు హింసపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు సహా దేశ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న అభిప్రాయాల తర్వాత అయినా పోలీసు ప్రవర్తనా శైలిలో కొంతమార్పు వస్తుందని ఎవరైనా ఆశిస్తారు. కాని సోమవారం ఝార్ఖండ్ రాజధాని రాంచీలో నిరుద్యోగ యువత 'చలో అసెంబ్లీ' ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్న తీరు ఏ పార్టీ ప్రభుత్వాధినేతగా ఉన్నా పోలీసులు పోలీసులేనని మరోమారు రుజువైంది. తమ ఉద్యోగ ప్రయత్నాలను, భవిష్యత్‌ను దెబ్బతీస్తున్న రిక్రూట్‌మెంట్ ప్రశ్నాపత్రాల లీకేజిపట్ల ఆవేశంతో, బాధతో ఉన్న నిరుద్యోగ యువత కొంత దూకుడుగా వ్యవహరిస్తారని పోలీసులు వారి అనుభవాన్నిబట్టి సునాయాసంగానే ఊహించుకోగలరు. వారుబారికేడ్లు త్రోసుకుని వచ్చారని పోలీసులు అతిగా లాఠీలకు పనిచెబితే, బాష్పవాయువు ప్రయోగిస్తే, వాటర్ జెట్‌లతో నీరు చిమ్మితే – వారికది సహజమైన నిరోధక చర్యగా అనిపించవచ్చు. ఆందోళనకారులను బైఠాయింపునుంచి చెదరగొట్టటానికి పోలీసులు జరిపిన లాఠీచార్జిలో కనీసం ఐదుగురు గాయపడ్డారు. వారిలో ఒకరికి తలపైన బలమైన దెబ్బ తగిలింది. ఢిల్లీలో హోంమంత్రి అమిత్ షా పోలీసుల క్రూరత్వం బిజెపికి తలవంపులు తెచ్చినందున ప్రతీకారం కోసం చూస్తున్న ఆ పార్టీ వారికి ఝార్ఖండ్ నిరుద్యోగుల ఆందోళన మంచి అవకాశంగా లభించింది. యువత ఆందోళనను తమకు తాముగా బలపరుస్తున్న బిజెపివారు వెంటనే పోలీసు చర్యను ఖండించారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సిబిఐ దర్యాప్తు డిమాండ్‌ను బలపరుస్తూ, రాహుల్‌గాంధి వెంటనే జెఎంఎం ప్రభుత్వానికి తోడ్పాటు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఝార్ఖండ్‌లో జెఎంఎం, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఉన్న విషయం తెలిసిందే!

రాహుల్‌గాంధి ఢిల్లీలో పత్రికాగోష్టిలో మాట్లాడుతూ, "ఝార్ఖండ్ విద్యార్థులకు మా సందేశం స్పష్టం. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై హింసను మేము ఖండిస్తున్నాం. అది ఎక్కడ జరిగినా మేము బలపరచం...సంభాషణ మాత్రమే పరిష్కారాలు సాధించగలదు. విద్యార్థులు చెప్పేది విని వారి సమస్యలు తక్షణం పరిష్కరించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను". ఢిల్లీలో జన్ జీ యువతపై పోలీసు హింసపై హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేయాలని రెండు వారాలకు పైగా ప్రతిపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నా సభకు రాని షా మొండివైఖరికన్నా రాహుల్ వైఖరి ఎంతో సానుకూలంగా ఉంది కదా? పోలీసు చర్యను సిపిఐ కేంద్ర కార్యదర్శివర్గం తీవ్రంగా ఖండించింది. లాఠీలు సమస్యలు పరిష్కరించ బోమని, అందువల్ల నిరసనకారులతో తక్షణం చర్చలు జరపాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసింది.

అదలావుంచితే, ఇంతకీ ఝార్ఖండ్ నిరుద్యోగ యువత సోమవారానికి 17 రోజులుగా జైపాల్ ముండా స్టేడియంలో కొనసాగిస్తున్న బైఠాయింపు నిరసన వెనుకనున్న ఆవేదన ఏమిటి? ఝార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికార్ మోర్చా నాయకుడు దేవేంద్రనాథ్ మహతో కొన్ని రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ – కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (జెఎస్ఎస్‌సి–సిజిఎల్) పరీక్షను రద్దు చేయాలని, రిక్రూట్‌మెంట్ క్రమంలో అక్రమాలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలన్నది నిరసనకారుల ముఖ్యమైన డిమాండ్.

హేమంత్ సోరెన్ ప్రభుత్వం మరీ స్పందనారహితంగా లేదు. రాష్ట్ర సిఐడి దర్యాప్తు ఆదేశించింది. జులై 22న రాజీనామా చేసిన జెపిఎస్‌సి చైర్మన్ ఎల్.ఖియాంగ్టే ను సిఐడి అరెస్టు చేసింది. మరో ముగ్గురు జెపిఎస్‌సి సభ్యులు కూడా రాజీనామా చేశారు.

ప్రభుత్వం విద్యార్థులతో ఆదివారం జరిపిన చర్చల్లో 14వ జెపిఎస్‌సి కంబైన్డ్ సివిల్ సర్వీసెస్‌కు సంబంధించిన ప్రాథమిక పరీక్ష సహా మూడు పరీక్షల రద్దు చేయటానికి అంగీకరించింది. ఆ మరుసటిరోజు నిరుద్యోగులు అసెంబ్లీకి ప్రదర్శన నిర్వహించారు. పాత అసెంబ్లీ కాంప్లెక్స్ 'ధృవ' వద్ద ఉదయం 10.30 ప్రాంతంలో ప్రారంభమైన నిరసన ప్రదర్శన ప్రశాంతంగా జరిగింది. ప్రదర్శకులు త్రివర్ణ పతాకాలు, నినాదాల ప్లకార్డులు, భగత్‌సింగ్, అంబేద్కర్, మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్, ఉద్యమ కారుడు నిర్మల్ మహతో చిత్రపటాలు చేబూనారు. ప్రదర్శకులు కొత్త అసెంబ్లీ భవనం వద్దకు తోసుకుపోయే క్రమంలో పోలీసులతో ఘర్షణ తలెత్తింది.

తాము ఉద్దేశపూర్వకంగా లాఠీచార్జి చేయలేదని, గుంపులను వెనక్కి నెట్టటానికి మాత్రమే ప్రయత్నించామని సిటీ డిఎస్‌పి అంటున్నారు. బారికేడ్లు, ముళ్ల ఇనుప కంచెలు అడ్డుపెట్టటానికి తామేమన్నా టెర్రరిస్టులమా అని నిరసనకారులు ప్రశ్నిస్తున్నారు. "విద్యార్థులుగా మేము తరచూ పరీక్షల రద్దు, పేపర్ లీక్ సమస్యలు ఎదుర్కొంటున్నాం.

ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచీ – 26ఏళ్లుగా ఇదే సమస్య" అని నిరుద్యోగి ఒకరు వ్యక్తం చేసిన ఆక్రోశం ఈ ఆందోళనకు మూలాన్ని వెల్లడిస్తున్నది. 'విద్యార్థులు మా కుటుంబ సభ్యులు' అంటున్న హేమంత్ సోరెన్ ఆ విధమైన సహృదయాన్ని ఆచరణలో ప్రదర్శించి ఉంటే పరిస్థితి ఇంతదూరం రాకపోను. ఇప్పుడైనా చర్చల ద్వారా సత్వరం నిరుద్యోగ యువత సమస్యకు సంతృప్తికరమైన పరిష్కారం కనుగొంటుందని ఆశించుదాం! ●



## ఎంపిగా పోటీ చేశా..నా పేరూ తొలగించారు

**కర్ణాటకలో కొనసాగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన ఓటర్ల జాబితాలో నా పేరు కూడా ఉంది. సర్ తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో ఓటు హక్కు తొలగించిన 65 లక్షల మందిలో నేనూ ఒకడిని. ఇది మంచి జోక్ కదా. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. నా చదువంతా ఇక్కడే సాగింది. స్కూల్, కాలేజీ, థియేటర్ అన్నీ ఇక్కడే. ముఖ్యంగా నేను ఇదే నియోజ-కవర్గం నుంచి ఎంపి అభ్యర్థిగా కూడా పోటీ చేశాను'. ఓటు హక్కును తిరిగి పొందేందుకు ఎలాంటి ప్రక్రియను అనుసరించాలో తెలుసుకుంటాను.**

– ఓటు మిస్సింగ్‌పై నటుడు ప్రకాశ్ రాజ్




# నేటి నుండి భారత్ అంతరిక్ష వారోత్సవాలు

భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు, భౌతిక శాస్త్రవేత్త, అంతరిక్ష పరిశోధకులు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ జన్మదినం 12 ఆగస్టు నుంచి వారం రోజుల పాటు, అనగా 18 ఆగష్టు వరకు దేశవ్యాప్తంగా భారత అంతరిక్ష వారోత్సవాలు లేదా ఇండియా స్పేస్ వీక్ సంబరాలను నిర్వహించడం ప్రతి ఏట ఆనవాయితీగా వస్తున్నది. 2026 భారత అంతరిక్ష వారోత్సవాల ఇతివృత్తంగా అంతరిక్ష విజ్ఞానం , పరిశోధనలు (స్పేస్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్) అను అంశాన్ని తీసుకొని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతరిక్ష శాస్త్రం, ఆవిష్కరణలు, ఉపగ్రహాల విజయవంతమైన ప్రయోగాలు, వివిధ గ్రహాలకు భారతీయ వ్యోమగాములను పంపించడం, ప్రజాహిత పరిశోధనలు కొనసాగించడం, యువతలో అంతరిక్ష ప్రయోగాల్లో అవగాహన కల్పిస్తూ వారిని అంతరిక్ష రంగంలోకి ఆకర్షించడం, అంతరిక్ష టెక్నాలజీ వైపు యువతను ఆకర్షించడం, పలు రకాల అంతరిక్ష సంబంధ అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలను వారం రోజుల పాటు నిర్వహస్తున్నారు.

**ఇస్రో ప్రయోగాల ఘన చరిత్ర:**

1963లో తొలి భారత అంతరిక్ష ప్రయోగంగా రాకెట్ లాంచ్‌ను తుంబా అంతరిక్ష కేంద్రం(కేరళ) నుంచి తొలి రాకెట్ ప్రయోగించడంతో అంతరిక్ష రంగంలో కార్యక్రమాలకు బీజాలు పడ్డాయి. 1980, 1990ల్లో ఎస్ఎల్‌వి, ఇన్సాట్ శ్రేణి సాటిలైట్ లాంచింగ్ వెహికిల్స్ ప్రయోగించడంతో దేశ కమ్యూనికేషన్స్, వాతావరణ హెచ్చరికలు, నీటి వనరుల అన్వేషణలు లాంటి ప్రయోగ ఫలితాలతో దేశ వ్యవసాయం, నీటి వనరుల అభివృద్ధి, విపత్తు నివారణ లాంటి అంశాలకు మార్గం సుగమం అయ్యింది. 2017లో ఒకే పిఎస్ఎల్‌విసి37 ప్రయోగంలో 104 ఉపగ్రహాలను అంతరిక్ష కక్షలో విజయవంతంగా చేర్చి చరిత్ర సృష్టించింది మన ఇస్రో. 2008లో చంద్రయాన్ I తో చంద్రుడిపై నీటి ఉనికిని నిర్ధారించడం, 2014లో మంగళ్‌యాన్ ద్వారా మార్స్‌కు చేరడం, 2023లో చంద్రయాన్3 ప్రయోగంతో చంద్రుడిపై ప్రయోగాలు చేయడం, 2024లో రెండు అంతరిక్ష ఉపగ్రహాలను అనుసంధానం లేదా డాకింగ్‌ను పూర్తి చేయడం జరిగింది. ఇటీవల భారత్‌కు చెందిన వ్యోమగామి శుభాంష్ శుక్లా 18 రోజులు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పరిశోధనలు చేసి సురక్షితంగా తిరిగి రావడం ఒక అద్భుత అంతరిక్ష ఘట్టంగా చరిత్రలో చెరగని ముద్రను వేసింది. రానున్న సంవత్సరాల్లో చంద్రమండలానికి భారతీయ వ్యోమగాములను పంపడం, భూమికి దగ్గరగా భారతీయ అంతరిక్ష కేంద్రంను ఏర్పాటు చేయడంతో పాటు 250కి పైగా ప్రైవేట్ సంస్థల ద్వారా అంతరిక్ష సాంకేతిక ప్రయోగాలను కొనసాగించడానికి పటిష్ట ప్రణాళికలు వేయడంలో ఇస్రో దృష్టిని కేంద్రీకరించడం హర్షదాయకం.

నేటి భారతీయ యువశక్తిని అంతరిక్ష రంగం వైపుకు ఆకర్షించాలనే ఏకైక లక్ష్యంతో ఈ వారోత్సవాల్లో పలు పోటీలను నిర్వహించి పెద్ద ఎత్తున బహుమతులు అందించడానికి వేసిన ప్రణాళికలను అమలు చేయడం జరుగుతోంది. వివిధ ఉన్నత విద్యా సంస్థల్లో అంతరిక్ష విద్యను ప్రారంభించడంతో పాటు యువతను ఆకర్షించి రేపటి అద్భుత అంతరిక్ష పరిశోధకులుగా తయారు చేయడం, పాలసీల రూపకల్పన, రేపటి తరానికి అంతరిక్ష చదువుల దారిని చూపడం నిరంతరం జరగాలని తెలపడానికి ఈ వారోత్సవాలను వేదికగా చేసుకోవడం గమనిస్తున్నాం.

**భారతీయ తొలి ప్రైవేటు స్పేస్–చెక్ కంపెనీ – స్కైరూట్ ఏరోస్పేస్:**

2018లో మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ్ భరత్ డాకా కలిసి స్కైరూట్ ఏరోస్పేస్ అనే భారతీయ ప్రైవేటు స్పేస్‌టెక్ కంపెనీని హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభించి భారతీయ తొలి స్పేస్‌టెక్ యూనికార్న్‌గా అవతరించి, 18 జులై 2026 రోజు భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు ఆర్బిటర్‌క్లాస్ రాకెట్ అయిన విక్రమ్1ను శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి విజయవంతంగా ప్రయోగించి చరిత్ర సృష్టించారు. ప్రపంచ దేశాల్లో ప్రైవేట్ ఆర్బిటర్ ప్రయోగ సామర్థ్యం కలిగిన మూడవ దేశంగా భారత్ నిలవడం మనందరికీ గర్వకారణమని తెలుసుకోవాలి. భారత అంతరిక్ష వారోత్సవాల సాక్షిగా రేపటి అంతరిక్ష పరిశోధనలకు నేటి స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేటు లిమిటెడ్ లాంటి కంపెనీలు భారత యువతకు ఊతం ఇవ్వాలని, నేటి యువభారతం రేపటి అంతరిక్ష శాస్త్రవేత్తలుగా రూపాంతరం చెందాలని ఆశిద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# విద్యార్థి ఉద్యమాల రథసారథి ఎఐఎస్ఎఫ్



పుట్ట లక్ష్మణ్
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి
9908814480

'స్వాతంత్ర్యం మా జన్మ హక్కు' అంటూ, స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య– ఏఐఎస్ఎఫ్. భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యంగా విద్యార్థులను చైతన్యపరిచిన ఘనత ఈ సంఘానిది. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో అక్కడక్కడ ఎవరికి వారుగా పోరాడుతున్న విద్యార్థులను ఐక్యంచేసి జాతీయ స్థాయిలో ఏర్పడ్డ తొలి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. 90సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ లో పని చేసి చాలా మంది పార్లమెంటు సభ్యులుగా, మంత్రులుగా, ఎమ్మెల్యే లుగా ఎదిగారు. వి.పి.సింగ్, అటల్ బిహారీ వాజ్ పాయ్, ఐ.కె.గుజ్రాల్ లాంటి వారు ఏఐఎస్ఎఫ్ నుండే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు. ఏఐఎస్ఎఫ్ లో పని చేసిన వారు ఎంతో మంది నేడు ప్రొఫెసర్లుగా, ఉపాధ్యాయులుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, జర్నలిస్టులుగా, మేధావులుగా సమాజంలో సేవలు అందిస్తున్నారు.

1936 ఆగస్ట్ 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో ఏఐఎస్ఎఫ్ ఏర్పడింది.ఈ మంగళవారం నాడు 91వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా నాటి చరితను ఒక్కసారి మననం చేసుకుందాం.స్వాతంత్ర్యోద్యమంలో అంతకు ముందు విద్యార్థులు ఉద్యమించినప్పటికీ, దేశ వ్యాప్తంగా జాతీయ స్థాయి లో సంఘటిత విద్యార్థి సంఘం అవసరం అని భావించి ఉత్తర ప్రదేశ్ డిగ్రీ విద్యార్థులు ప్రేమ్ నారాయణ భార్గవ్, బబురుద్దీన్ లు 12 రాష్ట్రాలలో ఉద్యమాలు చేస్తున్న విద్యార్థులకు ఈ విషయం పై ఉత్తరాలు రాసారు. ఈ నేపథ్యంలో 1936 జులై 30 న ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. ఆగస్ట్ 12,13 తేదీలలో మహాసభ నిర్వహించాలని నిర్ణయించారు. 1936 ఆగస్ట్ 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో లో గంగా ప్రసాద్ మెమోరియల్ హాల్ నందు జరిగిన తొలి జాతీయ స్థాయి విద్యార్థి సంఘ మహాసభకు 11 రాష్ట్రాల నుండి 200 శాఖల ద్వారా 916 మంది విద్యార్థి ప్రతినిధులు హాజరయ్యారు. వీరంతా ఒకటి, రెండు, పది, ఇరవై రూపాయలతో టిక్కెట్లను కొనుక్కొని మరీ మహాసభలో పాల్గొనడం గమనార్హం. మహాసభ ప్రారంభ ఉపన్యాసం జాతీయ ఉద్యమ నాయకులు జవహర్ లాల్ నెహ్రూ చేసారు. మహమ్మద్ అలీ జిన్నా అధ్యక్షత వహించారు. గాంధీ, రవీంద్ర నాథ్ ఠాగూర్, తేజ్ బహదూర్ లు సందేశాలు పంపారు. ఆ విధంగా ఎఐఎస్ఎఫ్ అనేది వివిధ జాతీయ ధోరణుల కలయికతో ఏర్పడింది.దీనికి సంబంధించిన ఆలోచనను పి.సి. జోషి, నెహ్రూ, బోస్, ఇతర నాయకులు కలిసి రూపొందించారు. తద్వారా ఎఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య ఉద్యమపు ఉత్తమ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లింది. ప్రపంచ దేశాల్లో మార్పు కోసం పోరాటం జరుగుతున్నాయని, విద్యార్థులు గమనించి దేశంనుంచి బ్రిటిష్ వాళ్ళని పారద్రోలేందుకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనాలని నెహ్రూ తన తొలి ప్రసంగంలో పిలుపునిచ్చారు. ప్రేమ్ నారాయణ భార్గవ్ ఈ సంఘం మొదటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

విద్యార్థులను చైతన్యం చేసేందుకు దేశంలో నాలుగు పత్రికలు అవసరం అని భావించిన ఈ సంఘం లాహోర్ నుండి 'స్టూడెంట్ ట్రిబ్యునల్', నాగ్ పూర్ నుండి 'ది స్టూడెంట్స్', బొంబాయి నుండి 'స్టూడెంట్ కాల్', కలకత్తా నుండి 'ఛాత్ర ఆభిజాన్' పత్రికలు ముద్రించి




విద్యార్థులకు అందించింది. 1937లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి విద్యార్థి సంఘం మద్దతు ఇచ్చింది. 1937లో భారత దేశంలో వరల్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు జేమ్స్ క్లబ్ మెన్ ఇక్కడ ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న ఉద్యమాలను అభినందించారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థులు వేలాది మంది పాల్గొన్నారు. బొంబాయి, కలకత్తా, మద్రాస్, ఢిల్లీ, హైదరాబాద్ వివిధ పట్టణాలలో విద్యార్థి ఉద్యమాలు ఉధృతమయ్యాయి. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో జాతీయ జెండా ఎగురవేసేందుకు నిజాం పాలకులు అడ్డు పడ్డా, వందలాది పోలీసులతో కాపలా పెట్టిన ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేయడం జరిగింది.

'శాంతి, అభ్యుదయం, చదువుతూ పోరాడు చదువుకై పోరాడు' అనే నినాదంతో, శాస్త్రీయ విద్యా విధానం కోసం, విద్యారంగానికి బడ్జెట్‌లో పాలకులు తగిన నిధులు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ పోరాడుతుంది. దేశంలో ఈశాన్య రాష్ట్రాలలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాడింది. పంజాబ్ లోని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడి అనేక మంది ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు ప్రాణాలు అర్పించారు.

తెలంగాణలో ఏఐఎస్ఎఫ్ చరిత్ర సాయుధ రైతు పోరాటం నుంచే మొదలైంది. ఇది స్వాతంత్ర్యానికి ముందు, నిజాం పాలనలో జరిగిన ఉద్యమం. రజాకార్ల నియంతృత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆయుధాలతో పోరాటంలో పాల్గొన్నారు. 1966లో విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ పోరాడింది ఏఐఎస్ఎఫ్. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఏర్పడిన ఉక్కు సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమం నడిచింది. ఆంధ్రప్రాంతంలో ఉధృత పోరాటంపై పోలీసుల కాల్పుల్లో 32 మంది విద్యార్థులు మరణించారు. 2002 జనవరి 19న నల్గొండ జిల్లాలో మతోన్మాద ఏబివిపి గుండాలు ఏఐఎస్ఎఫ్ నాయకుడు బొడ్డుపల్లి శేఖర్‌ని హత్య చేసారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి మద్దతు తెలిపిన మొదటి జాతీయ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అనేక పోరాటాలు, లాఠీ చార్జీలు, కేసులు ఎదుర్కొని జైలు జీవితాలు గడిపారు. 2014 లో రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్రంలో ప్రభుత్వ విద్య బలోపేతం చేయాలని, పేద విద్యార్థులందరికీ విద్య అందుబాటులో ఉండాలని, విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్. రానున్న కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యారంగంలో – ప్రభుత్వాలు తీసుకొస్తున్న కొత్త సవాళ్లను ఎదుర్కొంటూ – విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ విద్యార్థులకు అండగా ఉంటుంది. ఈ 91 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్, రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్ట్ 12 నుండి 30 వరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తుంది. ఏఐఎస్ఎఫ్ పూర్వ నాయకులకు, ప్రస్తుత నాయకులకు, కార్యకర్తలకు 91వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు.

## ఎఐఎస్ఎఫ్ చరిత్రలో ముఖ్య ఘట్టాలు

*చారిత్రాత్మకమైన మొదటి 'అఖిల భారత విద్యార్థుల దినోత్సవం' (ఆల్ ఇండియా స్టూడెండ్స్ డే) – దీనిని ఎఐఎస్ఎఫ్ 1937 నవంబర్ 20న దేశవ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించింది.*

***అండమాన్ ఖైదీల విడుదల ఉద్యమం– 1937:*** *ఎఐఎస్ఎఫ్ స్థాపించిన వెంటనే అండమాన్ సెల్యులార్ జైలులో ఉన్న వేలాది మంది ఖైదీలను ప్రధాన భూభాగానికి తరలించి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 1937 ఆగస్టులో ఎఐఎస్ఎఫ్ దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టింది. 1937–39 మధ్య సాగిన ఈ ఉద్యమం విజయవంతమైంది.*

***విద్యా సంస్కరణల కోసం పోరాటం:*** *1946 జూన్ 6–9 తేదీలలో నాగ్‌పూర్‌లో జరిగిన ప్రత్యేక అఖిల భారత సమావేశంలో, సైన్స్, టెక్నాలజీ, హ్యూమానిటీస్, పరీక్షలు, ప్రవేశాలు, విద్యా సంస్థలు మొదలైన అంశాలపై సమగ్ర విద్యా సంస్కరణల గురించి ఎఐఎఫ్ఎఫ్ చర్చించింది. ఏ సంస్థ అయినా విద్యావిధానంపై సమగ్ర ప్రతిపాదన తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం ఇదే మొదటిసారి.*

***1942 ఉద్యమంలో క్రియాశీల భాగస్వా మ్యం:*** *బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ మరియు అనేక ఇతర ప్రాంతాలలో 1942 ఆగస్టు ఉద్యమ ప్రారంభ దశల్లో ఎఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు.వారు ర్యాలీ లు, సమావేశాలు, నిరసనలకు నాయకత్వం వహించారు. సింధ్ ప్రాంతంలో ఎఐఎస్ఎఫ్‌కు చెందిన హేము కలానీని బ్రిటిష్ పోలీసులు పట్టుకుని ఉరితీశారు. అప్పుడు ఆయన వయసు కేవలం 17 ఏళ్లు మాత్రమే.. స్వాతంత్ర్య పోరాటంలో యుద్ధానంతర ఉధృతి(1945–47) సమయంలో ఎఐఎస్ఎఫ్ ముందువరుసలో ఉండి చురుకుగా పాల్గొంది. ఏదో ఒక రకమైన కార్యాచరణ లేకుండా ఒక్క రోజు కూడా గడవలేదు. చాలా మంది ఎఐఎస్ఎఫ్ కార్యకర్తలు అమరులయ్యారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి వచ్చిన స్వాతంత్ర్యాన్ని ఎఐఎస్ఎఫ్ సభలు, ఊరేగింపుల ద్వారా ఉత్సాహంగా స్వాగతించింది.*

***పాండిచ్చేరి,గోవా విముక్తి పోరాటాలు:*** *ఫ్రెంచ్ పాలన లోని పాండిచ్చేరి 1954లోనూ, పోర్చుగీస్ పాలనలోని గోవా 1961లోనూ విముక్తి పొందాయి. ఈ పోరాటాల్లోనూ ఎఐఎస్ఎఫ్ ముందు వరుసలో నిలిచింది. గోవా సత్యాగ్రహం (1955) వంటి వాటిలో అనేకమంది ప్రాణాలు అర్పించారు.*

***ఇతర ప్రధాన ఉద్యమాలలో భాగ-స్వామ్యం:*** *1959 నాటి ఆహార ఉద్యమం, చారిత్రాత్మక అఖిల భారత ఢిల్లీ మార్చ్, పట్నాలో కాల్పులకు వ్యతిరేకంగా 1955 నాటి విద్యార్థి ఉద్యమం, వివిధ బంద్ పోరాటాలు, విద్యార్థుల హక్కులు, ఫీజుల పెంపున కు వ్యతిరేకంగా 1960ల నాటి పోరాటాలు, గుత్తాధిపత్య సంస్థలు మరియు బ్యాంకుల జాతీయీకరణ, విద్య ప్రజాస్వామీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా, జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' ఉద్యమానికి వ్యతిరేకంగా, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా, మతతత్వ ఫాసిజం, మితవాద శక్తుల అధికార దాహానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో ఎఐఎస్ఎఫ్ చురుకుగా పాల్గొన్నది.*

*వియత్నాం విముక్తి పోరాటానికి సంఘీభావం, బంగ్లాదేశ్ విముక్తి, అలీన ఉద్యమం, అమెరికా సప్తమ నౌకాదళానికి వ్యతిరేకంగా సాగిన పోరాటం వంటి ప్రధాన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో కూడా చురుకుగా పాల్గొంది. తాజాగా జంతర్‌మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పేపర్ లీకేజీ వ్యతిరేక నిరసనల్లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ పాత్రను స్వయంగా సిజెపి ప్రశంసించింది. ఆ ఉద్యమానికి ఎఐఎస్ఎఫ్‌తో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలైన ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎలు ఉద్యమ ఆద్యంతం ప్రత్యక్షంగా భాగస్వాములై విజయవంతం అవడంలో తమ అనుభవాన్ని అందించాయి.*

***– అనిల్ రాజింవాలే***

# లేవండి.. మేల్కొనండి.. లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించకండి

యువత ఒక దేశానికి కేవలం భవిష్యత్తు మాత్రమే కాదు, వర్తమానాన్ని సైతం మార్చగల అపారమైన శక్తిరూపాలు. ఏ సమాజమైనా, దేశమైనా ప్రగతిపథంలో ముందుకు సాగాలంటే ఆ దేశ యువతలో ఉన్న ఆలోచనలు, ఉత్సాహం మరియు సృజనాత్మకత అత్యంత కీలకం. ప్రపంచంలో అత్యంత వేగంగా మారుతున్న రాజకీయ, ఆర్థిక, పర్యావరణ పరిస్థితుల నేపథ్యంలో యువత పాత్రను గుర్తించి, వారి ముందున్న సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికే ప్రతి సంవత్సరం ఆగస్టు 12న 'అంతర్జాతీయ యువజన దినోత్సవం' జరుపుకుంటారు. ఐక్యరాజ్యసమితి 1999లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా 2000వ సంవత్సరం నుండి ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా నేడు 10 నుండి 24 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత సంఖ్య రికార్డు స్థాయిలో దాదాపు 120 కోట్లకు పైగా ఉంది. సామాజిక పరివర్తనలోనూ, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలోనూ వీరి పాత్ర అమూల్యం. సాంకేతిక విప్లవం, డిజిటల్ యుగంలో నేటి యువత కొత్త ఆవిష్కరణలకు చిరునామాగా మారుతున్నారు. వాతావరణ మార్పులపై పోరాటం నుండి సామాజిక న్యాయం వరకు అనేక ప్రపంచ సమస్యలపై యువత గళం విప్పుతోంది. యువత శక్తిని, ఆలోచనలను సరైన



దిశలో ఉపయోగిస్తే ఆర్థిక వ్యవస్థలు రూపాంతరం చెందడమే కాకుండా శాంతియుత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. అయితే, ప్రస్తుత సమాజంలో యువత అనేక సవాళ్లను మరియు మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. విద్యా వ్యవస్థల్లో నాణ్యతా లోపం, చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరక్కపోవడం (నిరుద్యోగం), మరియు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాల కొరత ప్రధాన సమస్యలుగా మారాయి. దీనితో పాటు సోషల్ మీడియా ప్రభావం, ఆర్థిక అనిశ్చితి వల్ల నానాటికీ పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యలు యువతను కుంగదీస్తున్నాయి. ఉపాధి అవకాశాలు సరిగా లేని ప్రాంతాల్లో యువత తప్పుదోవ పట్ట డం, మత్తు పదార్థాల బారిన పడడం వంటి సామాజిక ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ప్రస్తుత ప్రపంచంలో భారతదేశం, అనేక అభివృద్ధి చెందుతున్న ఆఫ్రికా, ఆసియా దేశాలు 'జనాభా లబ్ధి' దశలో ఉన్నాయి.అనగా, ఈ దేశాల్లో వృద్ధులు మరియు పిల్లల కంటే ఉత్పాదకత కలిగిన యువ జనాభా శాతమే అత్యధికం. ఉదాహరణకు, భారతదేశంలో సగటు వయస్సు 28 ఏళ్లు కాగా, ఐరోపా, జపాన్ వంటి దేశాలు వేగంగా వృద్ధాప్య జనాభా వైపు పయనిస్తున్నాయి. ఈ భౌగోళిక అనుకూలత అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే అరుదైన అవకాశాన్ని అందిస్తోంది.

నేటి యువత జన్మతః డిజిటల్ ప్రపంచంతో అనుబంధం ఉన్న 'డిజిటల్ నేటివ్స్', ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్, స్టార్టప్ సంస్కృతి, కంటెంట్ క్రియేషన్ వంటి రంగాల్లో యువత కొత్త విప్లవాన్ని సృష్టిస్తోంది. సాంప్రదాయ ఉద్యోగాలపై మాత్రమే ఆధారపడకుండా 'ఉపాధి కల్పించే స్థాయికి' స్థాయికి ఎదుగుతూ గిగ్ ఎకానమీ, డిజిటల్ వ్యవస్థాపకతను ఊపిరిగా మలచుకుంటున్నారు. అయితే, సాంకేతికతపై అధిక ఆధారపడటం వల్ల వ్యక్తిగత సంబంధాలు తగ్గడం, సైబర్ నేరాలు, స్క్రీన్ టైమ్ పెరగడం వంటి కొత్త ప్రమాదాలనూ ఎదుర్కొంటున్నారు. రాజకీయ ప్రాతినిధ్యం విషయానికి వస్తే, ప్రపంచ చట్టసభల్లో లేదా ప్రభుత్వ నిర్ణయాధికారాల్లో యువత భాగస్వామ్యం ఇంకా తక్కువగానే ఉంది. అయినప్పటికీ, ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా సాంకేతికత, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడంలో యువత కీలక పాత్ర పోషిస్తోంది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై గ్లోబల్ ఉద్యమాలు నిర్మించడం, సామాజిక న్యాయం కోసం గళమెత్తడంలో యువత నేడు ప్రపంచ నాయకత్వానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తోంది. ఈ సమస్యలను అధిగమించడానికి కేవలం ప్రామాణిక విద్యను అందించడమే కాకుండా నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకతను ప్రోత్సహించే విధానాలు తక్షణ అవసరం. ప్రభుత్వ విధానాల రూపకల్పనలోనూ యువత భాగస్వామ్యానికి పెద్దపీట వేయాలి. అంతర్జాతీయ యువజన దినోత్సవం అనేది కేవలం అధికారిక కార్యక్రమాలకు పరిమితం కాకుండా, యువ శక్తికి సరైన మార్గదర్శకత్వం అందించి, వారి సృజనాత్మకతను సమాజ శ్రేయస్సుకు మలచుకోవడానికి ఒక బలమైన వేదిక గా ఉపయోగపడాలి.

**(ఆగస్టు 12 జాతీయ యువజన దినోత్సవం)**

ఎవి. సుధాకర్, 9000674747

## 'పాలమూరు – రంగారెడ్డి' ప్రాజెక్టుకు
# జాతీయ హోదా ఇవ్వాలి

◻ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల పట్ల కేంద్రం వివక్షత తగదు ◻ 'తుమ్మిడిహెట్టి'పై మహారాష్ట్రను ఒప్పించాలి ◻ ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్రాల మధ్య అంతర్రాష్ట్ర సమస్యలను కేంద్రం త్వరితగతిన సామరస్యంగా పరిష్కరించాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ప్రకటించే అంశం పరిశీలనలో లేదని ప్రకటించడం ద్వారా తెలంగాణ పట్ల బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వివక్షా ధోరణి స్పష్టమవుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు పార్లమెంటు సమావేశాలలో ఒక ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయమంత్రి ఇచ్చిన సమాధానంలో ఈ అంశం వెల్లడైందన్నారు. అత్యంత క్షామ పీడిత, వెనుకబడిన మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలకు కృష్ణా జలాలను అందించే ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా, కేంద్ర సహాయం విషయంలో కేంద్రప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు. అంతర్రాష్ట్ర అంశాలు, కృష్ణ నదీ జలాల ట్రిబ్యునల్–2, న్యాయవివాదాల పేరిట మెలిక పెట్టడం సరైంది కాదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన కృష్ణా, గోదావరి ప్రాజెక్టులకు అనుమతులు, ఇతర విషయాలలో దశాబ్దాల జాప్యం కారణంగా కొన్ని తరాలు నష్టపోయాయని, మరింత ఆలస్యమవడం ద్వారా నష్టం పెరగడంతో పాటు, వ్యయం కూడా పెరుగుతోందని ఆయన తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అంతర్రాష్ట్ర అంశాలను సామరస్యంగా పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. గతంలో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కావాల్సిన వనరులను కేటాయిస్తామని బిజెపి తన మ్యానిఫెస్టోలో పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం జాతీయ హోదా, నిధులు ఇవ్వాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్రం నుంచి ఎన్నికైన బిజెపి ఎంపిలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణ విషయంలో కూడా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సాంబశివరావు కోరారు.

**సాచివేత ధోరణి వద్దు**

2014 నుండి నేటి వరకు మూడు సార్లు మాత్రమే కేంద్ర జలశక్తి మంత్రి నేతృత్వంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కూడిన అపెక్స్ కమిటీ సమావేశం జరిగిందని, జిఆర్‌బి కెఆర్‌బి సమావేశాలు తూతూ మంత్రంగానే సాగుతున్నాయని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్ళు అవుతోందని, సాచివేత ధోరణిని మానుకుని ఇప్పటికైనా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులకు అనుమతులు, సహాయాన్ని నిర్ణీత కాలవ్యవధిలోగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.16 వేల కోట్లతో మారుమూల పల్లెలకు అభివృద్ధి రహదారి
- ములుగులో సిఎం చేతుల మీదుగా ఈ నెల 16న హ్యామ్ రోడ్ల పైలాన్ ఆవిష్కరణ, పనులకు శ్రీకారం
- ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా రైతు పొలానికి, పంటకు మార్కెట్‌కు, విద్యార్థికి పాఠశాలకు, రోగికి ఆసుపత్రికి, గ్రామానికి అభివృద్ధికి వారధిగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) ద్వారా భారీ స్థాయిలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ములుగులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ నెల 16న పైలాన్ ఆవిష్కరణతో పాటు పనులను ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి సీతక్క దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణలో మొత్తం 17,300 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారులను మూడు దశల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధేశించుకుంది. తొలి దశలోనే 7,450 కిలోమీటర్ల మేర 2,162 రహదారులను అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్రంలోని 96 నియోజకవర్గాలకు ఈ రోడ్ల ద్వారా ప్రయోజనం కలగనుంది. మొదటి విడతలో 90 శాతం ప్రస్తుతం ఉన్న రోడ్ల ఆధునీకరణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామపంచాయతీల నుంచి మండల కేంద్రాలు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన అనుసంధానం కల్పించేలా రహదారులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.16,007.56 కోట్లను మంజూరు చేసింది. నిర్మాణ పనులను 30 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. రోడ్లు నిర్మించిన తర్వాత కూడా 15 సంవత్సరాల పాటు వాటి నిర్వహణ బాధ్యతను కన్సెషనర్ సంస్థలే చేపట్టనున్నాయి. హ్యామ్ విధానంలో నిర్మాణ వ్యయంలో 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగా, 60 శాతాన్ని నిర్మాణ సంస్థలు సమకూరుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 15 సంవత్సరాల కాలంలో 30 వాయిదాల్లో చెల్లిస్తుంది. హ్యామ్ కార్యక్రమాన్ని 17 ప్యాకేజీలుగా విభజించగా, ఇప్పటికే 14 ప్యాకేజీలకు లెటర్ ఆఫ్ అవార్డ్స్ జారీ అయ్యాయి. మరో మూడు ప్యాకేజీలకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. దశాబ్దాలుగా రవాణా సౌకర్యాల కొరతను ఎదుర్కొంటున్న మారుమూల గ్రామాలకు మెరుగైన రోడ్లు అందుబాటులోకి వస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, మార్కెట్ సౌకర్యాలు మరింత చేరువ అవుతాయి. గ్రామీణ తెలంగాణ అభివృద్ధిలో రహదారుల విస్తరణ కీలక పాత్ర పోషించనుంది.

**రహదారి అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ధ్యేయం : మంత్రి సీతక్క**

'ప్రజలకు రోడ్డు అంటే ఒక ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదు, అది వారి జీవితాలను మార్చే మార్గం. మంచి రోడ్డు ఉంటే రైతుకు మార్కెట్ చేరువ అవుతుంది. విద్యార్థికి మంచి విద్య అందుబాటులోకి వస్తుంది. అత్యవసర సమయంలో రోగిని ఆసుపత్రికి సకాలంలో తీసుకెళ్లగలుగుతాం. ములుగు లాంటి అటవీ, ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి మరింత అవసరం. మారుమూల గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా అక్కడి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయి. రాష్ట్రంలో వేల కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేసేందుకు రూ.16 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గ్రామీణ ప్రాంతాలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనం. రోడ్లు నిర్మించడం మాత్రమే కాదు, అవి పదిహేనేళ్ల పాటు నాణ్యతగా ఉండేలా నిర్వహణ బాధ్యతను కూడా నిర్ధారించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకత. ములుగులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం గర్వంగా ఉంది. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం. రోడ్ల పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తాం. ములుగు వేదికగా మారుమూల చిట్టచివరి గ్రామం వరకు ప్రతి పల్లెకు మెరుగైన రహదారి అందించడమే మా లక్ష్యం' అని మంత్రి సీతక్క అన్నారు.

# రైతుల శ్రేయస్సు కోసమే వరుణ యాగం

### హరీష్‌రావు మాకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదు : ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ మంత్రి హరీష్‌రావు తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, ప్రాజెక్టులు ఎప్పుడు నింపాలి, ఎప్పుడు పంపులు ఆన్ చేయాలి అనే విషయం ప్రభుత్వానికి తెలుసు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పి మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు ఛాయలు కనిపిస్తున్న నేపథ్యంలో పండితుల సూచన మేరకు నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వరుణ యాగం నిర్వహించామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారని చెప్పారు. వరుణ యాగాన్ని బిఆర్‌ఎస్ నాయకులు విమర్శించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. గతంలో కెసిఆర్ దంపతులు అయుత చండీ, సహస్ర చండీ, రాజశ్యామల, నవగ్రహ చండీ యాగాలు నిర్వహించినప్పుడు కాంగ్రెస్ ఎలాంటి విమర్శలు చేయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు రైతుల కోసం నిర్వహించిన వరుణ యాగాన్ని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి డ్రామాగా అభివర్ణించడం సరికాదన్నారు. కరువు పరిస్థితులను కెటిఆర్, హరీష్‌రావు రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం తగ్గి, అమ్మవారి దయతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# బిజెపికి తెలంగాణలో భవిష్యత్ లేదు


### మోదీ మీడియాతో మాట్లాడలేక సెల్ఫీ వీడియోలు తీసుకునే పరిస్థితి : బల్మూర్ వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ విభజనను, తెలంగాణ అస్తిత్వాన్ని హేళన చేసిన బిజెపికి రాష్ట్రంలో భవిష్యత్ లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. సిఎల్‌పి మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ యువత ఆగ్రహంతో కేంద్ర ప్రభుత్వానికి పట్టపగలే చుక్కలు కనిపించాయన్నారు. ప్రధాని మీడియాతో మాట్లాడలేక సెల్ఫీ వీడియోలు తీసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. గత 12 ఏళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, దీనిపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని అన్నారు. యువత ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. జెన్‌జీ ప్రభావంతో ఢిల్లీలో ప్రధాని, హోంమంత్రి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సాక్షిగా బిజెపి ఎంపి తేజస్వీ సూర్య తెలంగాణపై తప్పుగా మాట్లాడినప్పటికీ రాష్ట్ర బిజెపి నేతలు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా తెలంగాణకు నిధులు ఎందుకు కేటాయించడం లేదో కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం బిజెపి నేతలకు లేదని విమర్శించారు. ఈ అంశాలపై ఎన్నడూ మాట్లాడని రామచందర్‌రావు ఇప్పుడు ఏదో చేస్తామని చెప్పడం నవ్వు తెప్పిస్తోందన్నారు. రామచందర్‌రావు సంతోషం మూడునాళ్ల ముచ్చటేనని, మరో వారం రోజుల్లో ఏం జరుగుతుందో అందరికీ తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు, రైతులకు మేలు జరగాలని ముఖ్యమంత్రి వరుణ యాగం నిర్వహిస్తే, హిందువులమని చెప్పుకునే బిజెపి నేతలు ఆ యాగాన్ని సైతం వక్రీకరించడం బాధాకరమని బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు.

### ఉపాధ్యాయ, విద్యారంగ ప్రధాన సమస్యలు
# తక్షణమే పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి 'జాక్టో' డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉపాధ్యాయ, విద్యారంగ ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (జాక్టో) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే తదుపరి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని ఎస్‌టియు భవన్‌లో జాక్టో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. తొలిదశలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్‌తో జాక్టో ప్రతినిధులు సమావేశమై విస్తృతంగా చర్చించారు. అనంతరం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్‌కు 12 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం జాక్టో చైర్మన్ జి.సదానందం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలని కోరారు. 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, 5 డిఎలను సత్వరమే విడుదల చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ మెమో నెం.57/4, 57/5 ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల తరహాలో డిఎస్‌సి 2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో స్టాఫ్ ప్యాట్రన్‌ను పునఃసమీక్షించి జిఒ 25ను సవరించాలని, 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించాలని, ఖాళీగా ఉన్న ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డిఇఒ, డైట్ లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, ఎంఇఒ పోస్టులను అప్ గ్రేడ్ చేసి,రాష్ట్రంలోని ఎడ్యుకేషన్ డివిజన్లను పునర్వ్యవస్థీకరించాలని, ఇతర శాఖల మాదిరిగా పాఠశాల విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖలలో జిఒ190ను అమలు చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని, మోడల్, ఎయిడెడ్ పాఠశాలలు, అన్ని గురుకుల సొసైటీల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, గిరిజన సంక్షేమ శాఖలో భాషా పండిట్,పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కెజిబివి/యుఆర్‌ఎస్ సిబ్బందికి కనీస వేతనాన్ని అమలు చేయాలని, డిఎస్సీ 2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు చెల్లించాలని జాక్టో సమావేశం డిమాండ్ చేసినట్టు సదానందంగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాక్టో సెక్రటరీ జనరల్ కె. కృష్ణుడు,కోచైర్మన్ పర్వతి సత్యనారాయణ, నాయకులు హేమచంద్రుడు, జయబాబు, రాములు, అలీం, మల్లికార్జున రెడ్డి, నగేష్ యాదవ్, గీతాంజలి, రాజభాను చంద్ర ప్రకాష్, నయీం, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్యాహు ప్రపంచంలోనే అత్యంత ఉగ్ర నేత

### ఆయనతో మోదీ స్నేహం చేయడం పెద్ద తప్పు: వి.ఎస్.బోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించేందుకు నిరాకరిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహు విధానం అత్యంత ప్రమాదకరమని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఉగ్ర నేతతో ప్రధాని నరేంద్ర మోదీ స్నేహం చేయడం పెద్ద తప్పిదమని విమర్శించారు. పాలస్తీనా విముక్తి కోసం అనేక సంస్థలు పోరాడుతున్నాయని, వాటిలో హమాస్ కూడా ఒక సంస్థేనని నేతన్యాహు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర సంస్థలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడుతుంటే, హమాస్ సాయుధ పోరాటం నిర్వహిస్తోందని, అంతమాత్రాన దానిని ఉగ్రవాద సంస్థగా ముద్ర వేయడం సరికాదని పేర్కొన్నారు. భారతదేశంలోనూ తెలంగాణలో నిజాం వ్యతిరేక సాయుధ పోరాటం జరిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా జాతి విముక్తి, దేశ స్వాతంత్ర్యం కోసం వివిధ ప్రాంతాల్లో సాయుధ పోరాటాలు జరిగిన చరిత్ర ఉందన్నారు. సామ్రాజ్యవాద అమెరికాతో కలిసి పాలస్తీనాను సర్వనాశనం చేయడం ఇజ్రాయెల్ చరిత్రలో అత్యంత నీచమైన చర్యగా నిలిచిపోతుందని బోస్ విమర్శించారు. తన జీవితకాలంలో పాలస్తీనా ప్రత్యేక దేశంగా ఏర్పడటానికి అంగీకరించబోనని నేతన్యాహు ప్రకటించడం ద్వారా ఆయన వైఖరి స్పష్టమవుతోందన్నారు. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా అంగీకరించడంతో పాటు, హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టి ఇజ్రాయెల్‌కు లొంగిపోయే వరకు దాడులను విరమించబోమని ప్రకటించడం ప్రపంచ ప్రజల అభిప్రాయాలను ధిక్కరించడమేనని అన్నారు. శాంతి కోసం అమెరికా చేస్తున్న ప్రయత్నాలను కూడా తిరస్కరించడం నేతన్యాహు అహంకారానికి నిదర్శనమన్నారు. తన వద్ద అణ్వాయుధాలను కలిగి ఉండి, పొరుగు దేశాలు అలాంటి ఆయుధాలను తయారు చేయకూడదని చెప్పడం ఆయనలోని వివక్షాపూరిత, ఆధిపత్య ధోరణిని బయటపెడుతోందన్నారు. అలాంటి నేతతో స్నేహం చేస్తూ దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని ప్రధాని మోదీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. మోదీ తన విదేశాంగ విధానాన్ని పునఃసమీక్షించుకుని, చరిత్రలో నిలిచిపోయిన స్వతంత్ర పాలస్తీనాకు భారతదేశం అండగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ దౌర్జన్యాలను, పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న అణచివేతను ఖండించాలని కోరారు.

## బిఆర్‌ఎస్ హయాంలో ఎకరా రూ.90 లక్షలు..
# మేము రూ.1.50 కోట్లకు కేటాయించాం

### పరిశ్రమలు రాకూడదన్న ఉద్దేశంతోనే కెటిఆర్ దుష్ప్రచారం: మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో పారిశ్రామిక వేత్తలకు ఎకరం రూ.90లక్షలకు ప్రభుత్వ భూమిని ఇవ్వగా తమ ప్రజా ప్రభుత్వం రూ.1.50 కోట్లకు ఎకరం చొప్పున ఇచ్చామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులకు భూములు కేటాయించారంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉందని ఆయన అన్నారు. నిబంధనల ప్రకారమే భూముల కేటాయింపులు జరిగాయని ఆయన మరోసారి తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరం భూమిని రూ.90 లక్షలకు కేటాయిస్తే, తమ ప్రభుత్వం ఎకరానికి రూ.1.50 కోట్ల చొప్పున కేటాయించిందన్నారు. సంబంధిత బోర్డు నిర్ణయించిన ధర కంటే ఒక్క రూపాయి కూడా తక్కువకు భూమిని కేటాయించలేదని స్పష్టం చేశారు. భూముల కోసం మొత్తం 32 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో టెస్సెరాక్ట్ సంస్థ కూడా ఒకటని మంత్రి తెలిపారు. ఏకంపెనీ ప్రారంభ దశలోనైనా క్యాపిటల్ అమౌంట్ తక్కువగానే ఉంటుందని, టెస్సెరాక్ట్ సంస్థకు సిఎం సోదరులతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఐదు ఎకరాల్లో రూ.34 కోట్లతో ఏర్పాటు కానున్న కంపెనీని రూ.200 కోట్ల కంపెనీగా కెటిఆర్ పేర్కొనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో తక్కువ ధరకు భూము లు ఎందుకు కేటాయించారో కెటిఆర్ సమాధానం చెప్పాలని శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ముడుపులు తీసుకుని కంపెనీలకు భూములు కేటాయించారా అనే అంశంపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కెటిఆర్‌పై ఉందన్నారు.

**పిఎం ఏక్తా మాల్ టెండర్లు పారదర్శకమే..**

పిఎం ఏక్తా మాల్ టెండర్ల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని మంత్రి తెలిపారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారమే మాల్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. రూ.200 కోట్ల సాఫ్ట్ లోన్‌ను తిరిగి చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.పిపిపి విధానంలో టెండర్ నిర్వహించామని, ప్రీబిడ్డింగ్‌లో ఏడు గురు బిల్డర్లు పాల్గొనగా.. వారిలో ఇద్దరిని ఎంపిక చేశామని తెలిపారు. ప్రభుత్వంపై ఎలాంటి భారం పడకుండా పిఎం ఏక్తా మాల్ ద్వారా లాభాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**పరిశ్రమలు రాకూడదన్నదే కెటిఆర్ హిడెన్ ఏజెండా..**

రాష్ట్రానికి పరిశ్రమలు రాకూడదన్న హిడెన్ ఏజెండాతోనే కెటిఆర్ ఈ విధమైన ఆరోపణలు చేస్తున్నారని శ్రీధర్‌బాబు విమర్శించారు. కెటిఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. తన శాఖలో ఎవరో చెప్పిన సమాచారం ఆధారంగా తాను పనిచేసే వ్యక్తిని కాదని, శాఖలో జరిగే ప్రతి నిర్ణయం తనకు తెలుసని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారని, అప్పట్లో అది కెటిఆర్‌కు తప్పుగా ఎందుకు అనిపించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం హెచ్‌ఐఎల్‌టి పాలసీ ద్వారా నిరుపయోగంగా ఉన్న, రెగ్యులరైజ్ అయిన భూములను బదలాయించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

**గత ప్రభుత్వ భూ కేటాయింపులపై విచారణ..**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల కేటాయింపులపై విచారణ చేయిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రభుత్వం కక్షధోరణితో, వ్యక్తిగత లక్ష్యంతో వ్యవహరించడం లేదని, చట్ట ప్రకారమే ముందుకు వెళ్తున్నామని చెప్పారు. కక్షతో వ్యవహరించి ఉంటే పలువురు ఇప్పటికే వేరే పరిస్థితుల్లో ఉండేవారని వ్యాఖ్యానించారు. గత రెండున్నరేళ్లుగా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నా, భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నా రాష్ట్రానికి పరిశ్రమలు వస్తూనే ఉన్నాయని తెలిపారు.

### 'టెస్సెరాక్ట్' కంపెనీకి ప్రభుత్వ భూమి కేటాయింపుపై
# ప్రభుత్వం సమగ్ర విచారణ

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి చెందిన 'టెస్సెరాక్ట్ అడ్వాన్సుడ్ సిస్టమ్స్' కంపెనీకి విలువైన ప్రభుత్వ భూమి కేటాయించిన వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం రాష్ట్రంలోనే అతిపెద్ద భూ కేటాయింపు అక్రమాల్లో ఒకటి అని అభివర్ణించారు.ఈ అవినీతిపైన గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే లోకాయుక్త, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ కొండల్ రెడ్డి తనలింక్‌డిన్ ప్రొఫైల్‌లో టెస్సెరాక్ట్ అడ్వాన్సుడ్ సిస్టమ్స్, భూపాల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు తాను బాధ్యత వహిస్తున్నట్లు పేర్కొన్నారని. ఆ కంపెనీ పెయిడ్ అప్ క్యాపిటల్ కేవలం రూ.1 లక్ష మాత్రమేనని, పటాన్‌చెరు ప్రాంతంలో ఒక చిన్న చిరునామాను కార్యాలయంగా చూపిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఆర్థిక సామ ర్థ్యం ఉన్న కంపెనీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సు మారు రూ.200ల కోట్ల విలువ చేసే ఐదు ఎకరా ల ప్రభుత్వ భూమిని ఎలా కేటాయించిందని ప్ర శ్నించారు. యుఎస్, ఇండియా స్ట్రాటజిక్ భాగస్వామి ఫోర మ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో టెస్సెరాక్ట్ అడ్వాన్సుడు సిస్టమ్స్ చైర్మన్‌గా కొండల్ అనుముల చేరినట్టు సంబంధిత సంస్థ స్వయంగా ప్రకటించిందని వివరించారు. 'టెస్సెరాక్ట్' కంపెనీ వెబ్‌సైట్‌లో 123456789గా ఫోన్ నంబర్ ఉన్నదని,ఈ నం బర్ అర్థం కావడం లేదని, 2025 మార్చి 31 నాటికి ఈ కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేరని, ఉద్యోగుల సంఖ్య సున్నా అని ఆ కంపెనీ వివరాల్లోనే పేర్కొన్నారన్నారు. టెస్సెరాక్ట్ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారని, కానీ కొండల్ రెడ్డిని స్వయంగా తన లింక్‌డిన్ ప్రొఫైల్‌లో టెస్సెరాక్ట్ చైర్మన్‌గా చెప్పుకున్నారని , మంత్రి శ్రీధర్‌బాబు శాఖలో ఏం జరుగుతుందో కూడా ఆయనకు (శ్రీధర్‌బాబు)తెలియదా? అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. కర్నాటకలో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణికి భూమి కేటాయింపు వ్యవహారంలో అనేక ఆరోపణలు రావడంతో అక్కడ తీవ్ర రాజకీయ, న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. కర్నాటకకు ఒక న్యాయం, తెలంగాణలో మరో న్యాయం ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అమెరికా పర్యాటనలో భాగంగా సిఎం మరో సోదరుడు అనుముల జగదీష్ రెడ్డితో 'స్వచ్ఛ్ బయో సంస్థ' తో సుమారు రూ.1,000 కోట్ల ఒప్పందానికి సంబంధించిన ఎంఓయూ జరిగిందని కెటిఆర్ ఆరోపించారు. ఆ ఒప్పందం తర్వాత ఆ సంస్థకు ఎక్కడైనా భూములు కేటాయించారా? పెట్టుబడులు వచ్చాయా? అనే అంశాలను కూడా వెలికి తీస్తామన్నారు. సిఎం కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన అన్ని భూములు, కంపెనీ లు, కాంట్రాక్టుల వివరాలను ప్రజల ముందుంచుతామని కెటిఆర్ తెలిపారు. అధికారంలో ఉన్న వ్యక్తుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ వనరులు, భూములు, కాంట్రాక్టులు దక్కుతున్నాయా ? అనే అంశంపై సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-49, ఎస్ఎల్‌పి జోన్ : సిఎంసి
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No. 30/EE/CIR-49/SLPZ/CMC/1-4/2026-27 తేది: 10.08.2026
పని కేటగిరి: తీవ్రంగా దెబ్బతిన్న బిటి రోడ్లు మరియు సిసి రోడ్ల మరమ్మతులు, అంచనా విలువ: రూ.181.00లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 11.08.2026 మ.3.00గం.ల నుండి 14.08.2026 మ.3.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఇఇ, సర్కిల్-49, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9000115410.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, సిఎంసి.
DIPR R.O. No. : 7654-PP/CL/ADVT/2026-27, Date: 11-08-2026

దేవాదాయ – ధర్మాదాయ శాఖ
**శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం**
వెంకటాపురం గ్రామం, వలిగొండ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ.
Cell : 9885152595, 9381824284. Email: eo.matsyagiritemple@gmail.com
సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన – ఆరవ సారి తేది: 07.08.2026
సదరు దేవస్థానములో 2026-27 సంవత్సరమునకు గాను (1 సంవత్సర కాలమునకు) **1.** వాహనపూజా సామాగ్రి అమ్ముకోనుహక్కు **2.** వాహనముల టోల్‌గేట్ (మేకలబండ వద్ద) వసూలు చేసుకొనుహక్కు **3.** కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు నిమిత్తం **తేది: 18.08.2026 రోజున మధ్యాహ్నం 12.00 గం.లకు** సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం శ్రీయుత కమీషనర్, దేవదాయ ధర్మదాయశాఖ, బొగ్గులకుంట, హైదరాబాదు కార్యాలయములో గల "**ధ్యాన మందిరము**" యందు శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమీషనర్ దేవాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించుటకు నిర్ణయించడమైనది. పాల్గొనదలచిన వారు టెండర్ షెడ్యులు మరియు ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించగలరు.
*శ్రీస్వామి వారి సేవలో.......*
చైర్మన్ & ధర్మకర్తల మండలి సం/- కార్యనిర్వాహణాధికారి
DIPR R.O. No. : 7642-PP/CL/ADVT/2026-27, Date: 11-08-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 11/DB/EE-II/ Alwal Circle/ MMC/2026-27. Dt: 11.08.2026 | ఎంఎంసి పరిధిలోని అల్వాల్ సర్కిల్ (02)లో వివిధ ప్రాంతాలలో సిసి రోడ్ల నిర్మాణం మరియు తీవ్రంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు. | రూ. 227.00 లక్షలు | 13.08.2026 మ.02.00 గం.లకు | 20.08.2026 మ.02.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి
DIPR R.O. No. : 7624-PP/CL/ADVT/2026-27, Date: 11-08-2026

## హమాలీల బిల్లులు చెల్లించాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్



ప్రజాపక్షం/ఆదిలాబాద్: హమాలీల బిల్లులు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసి ఆర్ఎం కార్యాలయం ముందు ఆర్టీసి లైసెన్స్‌డ్ పోర్టర్ యూనియన్ జిల్లా కన్వీనర్ పోతుగంటి శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అవేజ్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం హమాలీల బిల్లులను వెంటనే చెల్లించాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ విలాస్ మాట్లాడుతూ పోర్టర్ హమాలీలకు ఆగస్టు 1 నుండి 11 వరకు రోజువారీ బిల్లులు చెల్లించకుండా, అందులో 30 శాతం కమీషన్ ఇవ్వాలని వేధించడం సిగ్గుచేటన్నారు. యాజమాన్యం తీరు మార్చుకుని పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే 14 నుండి పనులు బంద్ చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌టీసీ ఆర్ఎం బి.విజయభానుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో హమాలీలు రాజు, అశోక్, సోమన్న, దేవన్న, రమేష్, దత్తు, శ్రీకాంత్, మహబూబ్ పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్లకు దరఖాస్తులు

మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

ప్రజాపక్షం / రామకృష్ణాపూర్: అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ల మంజూరు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, కల్లు గీత కార్మికులు, డయాలసిస్ బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన వారు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను క్యాతనపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో సమర్పించాలని కోరారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా సకాలంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన వివరించారు.

## చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

సిపిఐ కార్యవర్గ సభ్యుడు ఖలీందర్ అలీ ఖాన్ పిలుపు



ప్రజాపక్షం / జన్నారం : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ కార్యవర్గ సభ్యుడు ఖలీందర్ అలీ ఖాన్ పిలుపునిచ్చారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పోరు యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో సామాన్య ప్రజలు ధరల భారంతో ఇబ్బందులు పడుతుంటే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తోందని విమర్శించారు. విద్యను వ్యాపారంగా వైద్యాన్ని దోపిడీగా ఉపాధిని అందని కలగా మార్చే విధానాలను ప్రజలు సహించబోరని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం కార్మిక హక్కులను హరించడం ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. ప్రజల సంక్షేమానికి వినియోగించాల్సిన దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో నిర్వహించే పోరాటానికి కార్మికులు రైతులు విద్యార్థులు యువత మహిళలు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు, దాసరి తిరుపతి, జోగుల మల్లయ్య, కొట్టే కిషన్ రావు, మేదరి దేవవరం, కేతిరెడ్డి రమణ రెడ్డి, దేవి పోచన్న, మహేందర్ రెడ్డి, రాజేశం, రమేష్ పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కమలానగర్ కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాలనీలో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ, మురుగు కాలువలు, సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ నీటి కనెక్షన్లు తదితర సమస్యలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో డ్రైనేజీ, మురుగు కాలువల సమస్య కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. కాలనీ ప్రజల ఇబ్బందులను సానుకూలంగా పరిశీలించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమలానగర్ కాలనీ అధ్యక్షుడు మధుసూధన్,మెహేష్,ప్రకాష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సాయికుమార్ ,గంగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సిసి కెమెరాలు కీలక పాత్ర

సిపి పి. సాయి చైతన్య

ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి : నేరాల నియంత్రణలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 25 సిసి కెమెరాలను సిపి ప్రారంభించి మాట్లాడారు. ఒక్క సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, అలాగే ట్రాఫిక్ నియంత్రణలో సిసి కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రతి ఒక్కరూ వారి భద్రత కోసం సిసి కెమెరాలను పెట్టాలని చెప్పారు. ఇది వారి బాధ్యతగా తీసుకోవాలని, దుకాణాల యజమానులు తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసిపి ప్రకాష్, సిసిఆర్‌బిఏసిపి గురునాయుడు, డిచ్‌పల్లి సిఐ తిరుపతి, జక్రాన్‌పల్లి ఎస్సై మహేష్, గ్రామ సర్పంచ్ బండి పద్మనర్సయ్య, మండల అధ్యక్షులు రెక్కల సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకే ప్రాధాన్యం

ఎమ్మెల్సీ దండే విఠల్
ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూర్ శాసనసభ్యుడు పాల్వాయి హరీష్ బాబు సూచించారు. కాగజ్ నగర్ మండలం నజ్రూల్‌నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతున్న ప్రభుత్వ పథకాలతో మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నూతన భవనం గ్రామ మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. మహిళల అభ్యున్నతికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, నా యకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నా రు.

## ఇవిఎం గోదాం తనిఖీ



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: కలెక్టరేట్ సమీపంలో గల ఇవిఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించి, సిసి కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి: కలెక్టర్ హరిత

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ టౌన్ : ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందన్న వాతావరణ నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారని, ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తులో వరి సాగుకు నీరు సరిపోక పోవచ్చని తెలిపారు. 15 నుంచి మండల, గ్రామస్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే ప్రజలు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 1న చలో ఢిల్లీ

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



ప్రజాపక్షం / దండేపల్లి: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబరు 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. మంగళవారం దండేపల్లి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పోరు యాత్రలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక హక్కులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని, నిత్యావసర ధరలతో సామాన్యులు, పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు అప్పులపాలవుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తోందని మండిపడ్డారు. విద్యను వ్యాపారంగా, వైద్యాన్ని దోపిడీగా మార్చే విధానాలను ప్రజలు సహించబోరన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను, కార్మిక హక్కుల హరణను నిరసిస్తూ ఢిల్లీ పోరాటానికి కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రజా పోరు యాత్రకు సిపిఎం నాయకుడు కనికరపు అశోక్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖలీందర్ అలీ ఖాన్, దాసరి తిరుపతి, జోగుల మల్లయ్య, కొట్టే కిషన్ రావు, మేదరి దేవవరం, కేతిరెడ్డి రమణ రెడ్డి, దేవి పోచన్న, మహేందర్ రెడ్డి, రాజేశం, రమేష్ పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు ఆపాలి

టిఎన్‌టియుసి నాయకుడు వాసాల సంపత్



ప్రజాపక్షం / మందమర్రి : ఫిబ్రవరి 12న జాతీయ కార్మిక సంఘాలన్ని జెఎసిగా ఏర్పడి ఇచ్చిన ఒక్కరోజు టోకెన్ సమ్మెలో పాల్గొన్నందుకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను రూ.500 చెల్లించాలని కాంట్రాక్టర్ వేధించడం అన్యాయమని టిఎన్‌టియుసి నాయకుడు వాసాల సంపత్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు సమ్మెల్లో పాల్గొనడం ప్రజాస్వామికంగా చట్టబద్ధంగా కల్పించిన హక్కు అని, ఆ హక్కును కాలరాసే అధికారం ఎవరికి లేదని స్పష్టం చేశారు. సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుల నుంచి రూ.500 వసూలు చేయాలని ఏ కార్మిక చట్టంలో ఉందో కాంట్రాక్టర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వేధింపులకు గురిచేయడం తక్షణమే నిలిపివేయాలని సూచించారు. కార్మికులపై ఇదే విధంగా ఒత్తిడి కొనసాగితే సింగరేణి పర్సనల్ మేనేజర్‌ను కలిసి సమస్యపై వినతిపత్రం అందజేసి కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడిపెల్లి రాజయ్య, పారుపల్లి శీను, కాంట్రాక్ట్ కార్మికులు సురేందర్, శ్రీను, లచ్చయ్య, దేవయ్య, ప్రశాంత్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / హాజీపూర్ : ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం హాజీపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని, ముల్కల్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాలల్లో చేపట్టిన అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సంక్షోభంపై ఎమ్మెల్యే ఆగ్రహం



ప్రజాపక్షం / పటాన్‌చెరు : పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, జనరేటర్ పనితీరు దెబ్బతినడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడటంపై శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపు కార్యాలయంలో ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్, వైద్యులు అభివృద్ధి సలహా సంఘం సభ్యులతో ఎమ్మెల్యే అత్యవసర సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సమస్య, జనరేటర్ పనిచేయక పోవడం నా దృష్టికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఆసుపత్రి మొత్తం వైరింగ్ మర్చేందుకు సుమారు రూ.4 లక్షలు అవసరం ఉన్నట్లు అధికారులు తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు పోన్ చేసి నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. నిధులు విడులైన వెంటనే వైరింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కరోనా సమయంలో సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన జనరేటర్‌ను అత్యవసరాల్లో పూర్తిస్థాయి లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సదుపాయాలు, మౌలిక సౌకర్యాలపై త్వరలో కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం, నాణ్యమైన మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకునే తదుపరి చర్యలపై పర్యవేక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## బాధితులకు ఫోన్లు అందజేత



ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండల పరిధిలో గత కొన్ని రోజులుగా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఫిర్యాదులను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి 8 సెల్‌ఫోన్లు రికవరీ చేసి యజమానులకు అందజేశామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్ ఎవరైనా పోగొట్టుకున్న వెంటనే పిఎస్‌లో దరఖాస్తు చేసినచో త్వరితగతిన ఫోన్‌లను ట్రేస్ చేసే అవకాశం కలదు. ఇట్టి ఫోన్లను రికవరీ చేసినందున కానిస్టేబుల్ నారాయణను అభినందించారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర గొప్పది

ఎస్పి డి. వి. శ్రీనివాసరావు



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, ఇతర కార్యవర్గ సభ్యులు, మీడియా ప్రతినిధులు మంగళవారం ఎస్‌పి డి.వి. శ్రీనివాసరావు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎస్‌పి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా గొప్పదని, ప్రజలకు సమాచారాన్ని అత్యంత వేగంగా అందించేందుకు పత్రిక, ఛానెల్స్ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్‌పి పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు పో లీసులు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. మహిళలు, బాలికల భద్రత కోసం ప్రజల్లో అవగాహన కల్పించడం లో మీడియా తరపున పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి అశోక్, గౌరవ కార్యవర్గసభ్యులు శ్రీధర్, కామాటి కృష్ణ, నీలం, సందీప్, రమేష్ సిద్దేశం, రాజా గౌడ్, రహమత్, ఫణిరాజ్, శ్రీహరిగౌడ్, ఫసిమోద్దీన్, కార్తీక్, సుబ్బు, మల్లేశం, మల్లికార్జున్, లక్ష్మ ణ్ తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జలసిరిలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజాపక్షం/నిజామాబాద్ : భూగర్భజలాలను పెంపొందించేందుకు వర్షపు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలున్న ప్రస్తుత తరుణంలో జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృతస్థాయిలో ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ తదితర నిర్మాణాలు జరిపించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం జలసిరి, హౌసింగ్, వనమహోత్సవం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై జిల్లా అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల అధికారులతో కలెక్టర్ సుధీర్ఘ సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికనుగుణంగా ఫాంపాండ్స్, ఇంకుడుగుంతల నిర్మాణాలు జరగని మండలాల ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ప్రజలను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిని సరెండర్ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలు నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# భూ భారతి ఆపరేటర్లపై సర్కార్ వేటు




ప్రజాపక్షం/నిర్మల్ : తెలంగాణ రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి రాజ్యమేలిన ప్రైవేట్ అక్రమాలకు, దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. భూ భారతి పోర్టల్ నిర్వహణ పేరిట మండల తహసీల్దార్ కార్యాలయాల్లో విధుల్లో ఉన్న థర్డ్ పార్టీ అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లను (ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్) విధుల్లోంచి తొలగిస్తూ అధికారిక ఆదేశాలు జారీ చేసింది. పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలనందించడమే లక్ష్యంగా రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేసేందుకు సర్కార్ ఈ కఠిన చర్యకు శ్రీకారం చుట్టింది.సాధారణంగా ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయానికి ఒకరు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత జిల్లాల వికేంద్రీకరణ ప్రాతిపదికన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 70 మండలాల్లో సుమారు 70 మంది ఆపరేటర్లను విధుల నుంచి తప్పించేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా: 18 మండలాలు — 18 మంది ఆపరేటర్లు, నిర్మల్ జిల్లా: 19 మండలాలు — 19 మంది ఆపరేటర్లు, మంచిర్యాల జిల్లా: 18 మండలాలు — 18 మంది ఆపరేటర్లు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా: 15 మండలాలు — 15 మంది ఆపరేటర్లు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా ఉన్న ఆపరేటర్లతో పాటు జిల్లా స్థాయి కోఆర్డినేటర్లను కూడా తొలగించి, ఆ స్థానాల్లో ప్రభుత్వ పక్కా ఉద్యోగులను నియమిస్తున్నారు. ఇకపై భూ భారతి పోర్టల్ ఐడీలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల పూర్తి బాధ్యతలను ప్రభుత్వ రెవెన్యూ శాఖలోని జూనియర్ అసిస్టెంట్లకు అప్పగిస్తున్నారు. సేవల్లో ఎటువంటి సాంకేతిక లోపాలు లేదా జాప్యం తలెత్తకుండా ఉండేందుకు వీరికి వారం రోజుల పాటు తీవ్రస్థాయిలో సాంకేతిక శిక్షణ అందిస్తున్నారు. స్లాట్ బుకింగ్, ల్యాండ్ రికార్డుల డిజిటలైజేషన్, సదా బైనామా, నిషేధిత ఆస్తుల జాబితా పరిశీలన వంటి కీలక అంశాలపై వీరికి స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నారుప్రభుత్వం తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో భూ యజమానులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై దళారీల వేధింపులు తగ్గడంతో పాటు పారదర్శకంగా పనులు జరుగుతాయని భావిస్తున్నారు. అయితే, సంవత్సరాల తరబడి సేవలు అందించిన తమను అకస్మాత్తుగా తొలగించడం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని లేదా యథావిధిగా కొనసాగించాలని తొలగించబడిన ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా, రాబోయే 10 రోజుల్లో జూనియర్ అసిస్టెంట్లు బాధ్యతలు స్వీకరించి నూతన వ్యవస్థను పట్టాలెక్కించేందుకు రెవెన్యూ శాఖ సమాయత్తమవుతోంది.

## 'క్యూఆర్ కోడ్'తో హెచ్ఐవి సేవలు సులభతరం

కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్ : హెచ్ఐవీ పరీక్షలు, సేవలను ప్రజలకు మరింత సులభంగా అందించేందుకు డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమీపంలోని హెచ్ఐవీ పరీక్షా కేంద్రాలు, అందుబాటులో ఉన్న సేవల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. అనుమానం ఉన్నవారు భయపడకుండా, గోప్యతకు భంగం కలగకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ హరిప్రసాద్, ఐసీటీసీ కౌన్సిలర్ ధనశ్రీ, గోపి, సుధాకర్, రవి, పీఎంఓ శంకర్ రథోడ్, కామునిి రాజేశ్వర్, స్కోప్ ఎన్జీ ఉప్పలయ్య, అనిల్, లింక్ వర్కర్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మ ణ్, స్టాఫ్ నర్స్ సౌందర్య, అంజిరెడ్డి, సిపిఎం శ్రీనివాస్, అకౌంటెంట్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపి ప్రభుత్వాన్ని గద్దె దించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపు



**ప్రజాపక్షం/ముత్తారం:** ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా 'ప్రజా చైతన్య యాత్ర'ను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ.. కేంద్రంలోని అధికార పక్షం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా కంటక పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా సీపీఐ ఆధ్వర్యంలో 'బీజేపీ హఠావో.. దేశ్ బచావో' అనే నినాదంతో ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాటంలో భాగంగానే రాబోయే సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ సభను విజయవంతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రజల నిరసన సెగ తగిలేలా చేయాలని కోరారు.ఈ ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంతో పాటు సీఐటీయూ కార్యదర్శి కడారి సునీల్,గౌతమ్ గోవర్ధన్,గోశిక మోహన్, మల్లయ్య ,స్వామి,లక్ష్మి నారాయణ,రాజయ్య,నవీన్,రమ, తో పాటు తదితర ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/చందుర్తి:** ఒక వైపు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మరో వైపు ఎల్‌ఓసిలు మంజూరి ఇప్పిస్తూ ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేదల పెన్నిధిగా పేరుగాంచారని మండలం లోని ఆశిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ బొజ్జ మల్లేశం అన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొజ్జ మల్లేశం మాట్లాడుతూ ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈసరి ఆనందం కుమారుడికి గత కొద్ది నెలల క్రితం చేతికి శస్త్ర చికిత్స చేయించగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం రూ.1,00,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసి ఆర్థికంగా వారి కుటుంబానికి అండగా నిలిచారని అన్నారు.ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొట్టె ప్రభాకర్ , ఆత్మ కమిటి చైర్మన్ ముసుకు ముకుందరెడ్డి,ఉపసర్పంచ్ మహేంధర్ రెడ్డి పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** జిల్లాలో ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్.పి మహేష్ బి.గితె తో కలిసి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, తప్పనిసరిగా హాజరయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లు, వేదిక, గ్రౌండ్ తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అవగాహన కలిగే విధంగా స్టాళ్లలో ప్రదర్శించాలని సూచించారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అధికారులు, విద్యార్థులకు అవసరమైన మేర తాగునీటి వసతి ఏర్పాట్లు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల :** ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేబడుతున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన 5లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని కుల సంఘాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. రాజకీయాల్లోకి రాకముందే పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి సహకారంతో జగిత్యాల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నందయ్య,ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అడువల జ్యోతి లక్ష్మ ణ్, గిరి,నాగభూషణం, తదితరులు ఉన్నారు.

## విస్తృతంగా వాహన తనిఖీలు

**ప్రజాపక్షం/కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ముందు రవాణా శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రత, వాహన నియమ నిబంధనలు అమలు లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ తనిఖీల్లో భాగంగా రవాణా శాఖ అధికారులు వాహనాలకు సంబంధించిన పత్రాలు, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ కు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వాహనదారులకు ఫిట్నెస్ సర్టిఫికెట్, వాహన ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్,వాహన పత్రాలు అన్ని పూర్తిగా ఉండాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేసి క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని అన్నారు. రవాణా నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై ఎల్లప్పుడూ తనిఖీలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు,రామారావు,సాయి చరణ్,రవాణా శాఖ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లకు 'గోల్డెన్ ఛాన్స్'

అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కావొద్దు
కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం/కరీంనగర్:** అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని సాచురేషన్ మోడ్‌లో గుర్తించి, వారం రోజుల్లో అర్హులందరినీ గుర్తించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి వార్డు యూనిట్‌గా ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో డీ ఆర్డీఓ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ చిత్రా మిశ్రా చేయూత పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. గ్రామం, వార్డు వారీగా ముందుగా అర్హులను గుర్తించి, వారితో దరఖాస్తులు చేయించే విధానం.. చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నందున ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్న నేపథ్యంలో ఆయా వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని తెలిపారు.

**ఇంటింటి సర్వేతో అర్హుల గుర్తింపు:** గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.

**ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి:** ఒంటరి మహిళలు తమ జనన ధ్రువపత్రం, ఎస్ఎస్‌సి మెమో, ఓటరు గుర్తింపు కార్డు (ఇపిఐసి) వంటి అందుబాటులో ఉన్న పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పించాలనీ, అవసరమైన సందర్భాల్లో స్థానిక విచారణ, సంబంధిత ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. వితంతు మహిళలు తమ భర్త మరణ ధ్రువపత్రాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకుని చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.

**పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి:** కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియను మరింత సవాలుగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్‌లో కార్పొరేటర్లు, ఇతర మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మున్సిపల్ అధికారులు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ భీమయ్య 22వ వర్ధంతి



**ప్రజాపక్షం/గజ్వేల్:** దౌలాపూర్ గ్రామంలో కామ్రేడ్ కుకునూరి భీమయ్య 22వ వర్ధంతి భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ పార్టీ సీనియర్ నేత తొందూరి బాల్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పార్టీ నేతలు మాట్లాడుతూ కామ్రేడ్ కుకునూరి భీమయ్య దౌలాపూరు గ్రామంలో 20 ఏళ్ల పాటు సర్పంచ్ గా అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. ప్రతి నిత్యం పేదల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేస్తూ అండగా నిలిచినట్లు గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు, అభివృద్ధి పనులు ఇప్పటికీ గ్రామంలో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బట్టు దయానంద రెడ్డి, రాజేశం, శివలింగ కృష్ణ, నరసింహారెడ్డి, మహేందర్ రెడ్డి, కృష్ణ, భీమన్న వారసులు అభిమానులు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీలను మూసివేయాలి

కలెక్టర్‌కు అఖిలపక్షం వినతి పత్రం అందజేత



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని గుగ్గిళ్ళ,పోతారం గ్రామాల శివారుల్లో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే మూసివేయాలని కోరుతూ మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మండలంలోని అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో జాయింట్ కాలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీల ఏర్పాటు చేయడం వలన అందులో నుండి వెలువడే రసాయానాలతో దుర్వాసన వెదజల్లుతుందని అంతే కాకుండా వాతావరణ కాలుష్యమై ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలను రద్దు చేయాలని మండల ప్రజలతో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించామని మండల వ్యాప్తంగా బంద్‌ను నిర్వహించామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇథనాల్ ఫ్యాక్టరీలను రద్దు చేసి మండల ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూపేష్, తిప్పారపు శ్రీనివాస్,పాకాల మహిపాల్ రెడ్డి, బీఎస్పీ, డిఎస్పీ నాయకులు, ఉమేష్, పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తు సెప్టెంబర్ 1 'చలో ఢిల్లీ'

నియోజకవర్గ కన్వీనర్
జాగీరు సత్యనారాయణ పిలుపు



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేఖ విధానాలను నిరసిశిస్తు సెప్టెంబర్ 1 చలో ఢిల్లీ కార్యక్రమంను జయప్రదం చేయుటకు సిపిఐ చైతన్యయాత్ర నియోజకవర్గంలో ని నియోజకవ్గంలోని గ్రామాల్లో చైతన్య యాత్ర చేపట్టి కేంద్రంలో మోడి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించి వారి చైతన్య పరిచారు. మంగళవారం హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్, నాగారం, జిలల్లెగడ్డ, దేవేంద్రనగర్, మీర్జాపూర్, పందిల్ల, పొట్లపెల్లి , కూచనపెల్లి,తో పాటు హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్బంగా నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారయణ మాట్లాడుతూ ఈ నెల 13 హుస్నాబాద్‌లోచైతన్య యాత్ర ముగింపు సభను ఏర్పాటు చేయనున్నట్లు దీనికి ముఖ్య ఆతిధితులుగా కేంద్ర మాజీ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి,రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కల్లపెల్లి శ్రీనివాస రావు,కార్యవర్గసభ్యులు కళవేని శంకర్ పాల్గొంటారని ఈ సభను విజయవంతం చేయుటను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గోనాలని పిలుపునిచ్చారు. ఆలాగే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దేశంలో డిజిల్, పెట్రోల్, వంటగ్యాస్, నిత్యవసరవస్తువుల ధరలకు పెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్నరని వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి గడిపె మల్లెశ్, మహిళా సమాఖ్యా జిల్లా ఆధ్యక్షురాలు గూడ పద్మ, ఎ ఐ వై ఫ్ జిల్లా ఆధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ , నాయకులు పిట్టల మొగిలి, కిష్టయ్య, రమేశ్, నీల పాపిరెడ్డి, సమ్మయ్య, బాలయ్య, స్వామి, పెద్ది నిర్మలా, రాజవ్వ, శోభ, శ్రీకాంత్, వినోద్, ఆశోక్‌లు పాల్గోన్నారు.

## షాపింగ్ కాంప్లెక్స్‌పై లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలి

తిలక్ నగర్ కాంప్లెక్స్ పరిశీలించిన
సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని తిలక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ లో సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సిపిఐ శాఖ కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ పరిశీలించడంతో పాటు అక్కడ లబ్ధిదారుల వివరాలను తెలియజేయాలని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కూల్చివేతలు చేస్తూ కట్టుకోమని వారే హామీ ఇస్తూ మళ్లీ అనుమతులు లేవు అక్రమాలు జరుగుతున్నాయి అంటూ వాటిని కూల్చివేస్తూ చిరు వ వ్యాపారులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తూ ఎమ్మెల్యే మాత్రం హైదరాబాదులో ప్రశాంతంగా ఉండడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. ఎల్బీనగర్లో ఎటువంటి అక్రమాలు జరగలేదు కనుక మీరు అడిగిన వెంటనే నిబద్ధతతో నిక్కచ్చిగా లబ్ధిదారుల వివరాలను వెంటనే అక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని అదే నిబద్ధతతో ఎమ్మెల్యే రామగుండం కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్ రాజేష్ థియేటర్ దగ్గర, తిలక్ నగర్ సెంటర్లో, బస్టాండ్ కాలనీ దగ్గర లబ్ధిదారుల వివరాలను ఏర్పాటు చేయాలని కోరారు. తిలక్ నగర్ సెంటర్లో కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ జరిగిన నాడు ఆర్ జీవన్ జీఎం హాజరై మరలా ఈరోజు అక్కడ అనుమతులు లేవంటూ ఎస్ఎన్‌పిసి సిబ్బందిని కాపలా ఉంచడం సిగ్గుచేటని అన్నారు. ఆర్జీవన్ జీఎం రాజకీయాలు మాని తన పని తాను చేసుకోవాలని హితవు పలికారు. లబ్ధిదారుల వివరాలు జీఎం దగ్గర ఉన్నాయా అని ప్రశ్నించారు. ఒకవేళ లబ్ధిదారుల వివరాలు లేనట్లయితే ఏ వివరాల ఆధారంగా కూల్చివేతలు చేస్తున్నారో జీఎం బహిరంగపరచాలని వారు కోరారు. రామగుండం ఎమ్మెల్యేను గత రెండు రోజుల క్రితం రామగుండం కార్పొరేషన్ లో నిర్మాణం జరుగుతున్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర లబ్ధిదారుల వివరాలను ఏర్పాటు చేయాలని లబ్ధిదారులకు ప్రోసిడింగ్ కాపీలు , సింగరేణి నుండి ఇప్పించడంతోపాటు మున్సిపల్ అధికారుల నుండి బిల్డింగ్ పర్మిషన్స్ ఇప్పియ్యాలని చెప్పి చెప్పినప్పటికీ ఈరోజు వరకు ఎమ్మెల్యే స్పందించడం లేదని 24 గంటల్లోగా లబ్ధిదారుల వివరాలు పూర్తిస్థాయిలో బహిరంగపరచకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆసాల నవీన్,కొండ్ర దాసు పాల్గొన్నారు.

## చొప్పదండి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర :** చొప్పదండి నియోజకవర్గంలోని ప్రాజెక్టులను పూర్తి చేసి ఇక్కడి భూములను సస్యశ్యామలం చేస్తామని రైతుల జీవితాల్లో సంతోషాన్ని నింపుతామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధర మండలం మధురానగర్ వద్ద నారాయణపూర్ కుడి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ నారాయణపూర్ కుడి కాలువను 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించి 90 శాతం పనులు పూర్తి చేసిందని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ కుడి కాలువ నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేసిందన్నారు. పదేళ్ల కాలంలో కుడి కాలువలో తట్టెడు మట్టి తీయలేదని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నారాణపూర్ ప్రాజెక్టు కాలువలను పూర్తి చేయడంపై దృష్టి పెట్టానని అందులో భాగంగా ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.23.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. అలాగే రిజర్వాయర్ అభివృద్ధి, కుడి కాలువల పూర్తి కోసం మరో 20 కోట్ల రూపాయలను మంజూరు చేయించానని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయాలని తాను చూస్తుంటే బిఆర్ఎస్ నాయకులు పనులను అడ్డుకుంటూ శిఖండి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని రాజకీయాలు చేసినా నారాయణపూర్ ప్రాజెక్టుతోపాటు అసంపూర్తిగా ఉన్న కాలువలను పూర్తి చేసి గంగాధర మండలంతో పాటు బోయినపల్లి మండలానికి సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈ సుమతి దేవి, ఎస్ఈ సంత ప్రకాశ్, ఈఈ బాలకృష్ణ, డీఈఈ, ఏఈఈ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చయ్య, మాజీ జడ్పిటిసి సత్తు కనకయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ముద్దం నగేశ్, సర్పంచులు రామిడి రాజిరెడ్డి, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, వేముల భాస్కర్, చందు, దాతు అంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలు పండించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల్లో జిల్లా రైతులు ఆరుతడి పంటలను పండించా జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా నీటిపారుదల అడ్వైజరీ కమిటి సమావేశానికి కలెక్టర్ హైమవతి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్నపూర్ణ సాగర్‌లో 3.50 టిఎంసీలకు 1.51 టిఎంసీల నీరు ఉందని,వాటిలో 0.32 డెడ్ స్టోరేజీ పోగా 1.19 టిఎంసీలన ఈరు అందుబాటులో ఉందన్నారు. రంగనాయగ్ సాగర్‌లో 3 టిఎంసీలకు 0.99 టిఎంసీల నీరు ఉందని. వీటిలో డెత్ స్టోరేజ్ 0.17 టిఎంసీలకు 0.82 టిఎంసీల నీరు అందుబాటులో ఉందన్నారు. మల్లన్నసాగర్ 50 టిఎంసీల నీటికి 13.86 నీరు అందుబాటులో ఉందనిఙ, దీంతో 9.37 డెత్ స్టోరేజీ కాగా 4.12 టిఎంసీల నీరు అందుబాటులో ఉందన్నారు. కొండపోచమ్మసాగర్‌లో 15 టిఎంసీలకు 6.31 టిఎంసీల నీరు ఉందని, 2.20 డెత్ స్టోరేజీ పోగా 4.11 టిఎంసీల నీరు అందుబాటులో ఉందన్నారు.శనిగరం ప్రాజెక్టులో 1.09 టిఎంసీలకు 0.46 టిఎంసీల నీరు అందుబాటులో ఉందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల అందుబాటులో ఉన్న నీటిని కేవలం త్రాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో వర్షభావ పరిస్థితుల్లో ఏర్పడిన జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులో కొత్తగా నీరు చేరలేదన్నారు. మళ్లీ వర్షాకాల వరకువర్షాలు పడే సూచనలు లేవని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఇప్పుడు ప్రాజెక్టుల్లో నిల్వ నీరు కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించనున్నట్లు తెలిపారు.జిల్లా లో సాగునీరు అందుబాటులో లేదని రైతులు వరి పంటలు పండించవద్దన్నారు. గత సంవత్సరం 4.82 లక్షల ఎకరాల్లో వరి పంట వేయగా వాటిలో 3.68లక్షల ఎకరాల్లో వరిపంటను పండించినట్లు తెలిపారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యానికి 1200 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఈసంవత్సరం వర్షాభావ పరిస్థితులో రైతులకు అవగాహన కల్పించటం వల్ల ఇప్పటికి 70వేల ఎకరాల్లో పంట మార్పిడి జరిగి కందులు, పెసర్లు, మినుమలు, చిరధాన్యాలు, మొక్కజొన్న పత్తితర పంటలు వేసినట్లు తెలిపారు. ఆగస్టు 15 తర్వాత ఆముదం, పత్తి, నూనే గింజలు పంటలను పండించవచ్చునన్నారు. ఆరుతడి పంటలను పండించాలన్నారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ సర్కిల్ సిఈ సత్యనారాయణరెడ్డి, సిద్దిపేట,గజ్వేల్, కరీంనగర్ సర్కిల్ ఎస్ఈలు సూర్యకిరణ్, లక్ష్మ ణ్, పల్లం రాజు, జిల్లా ఇరిగేషన్ అధికారి నాగరాజు, సిద్దిపేట,గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు సదానందం, చంద్రకళ. రాంమూర్తి. జిల్లా వ్యవసాయాధికారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంథని మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** మంథని మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.ఎన్. జయ ప్రకాశ్‌పై వచ్చిన ఆర్థిక ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆగస్టు 7న మంథని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కె.ఎన్. జయ ప్రకాశ్‌పై పలు ఆర్థిక ఆరోపణలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి ప్రాథమికంగా విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రాథమిక విచారణలో విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, విధుల పట్ల అంకితభావం లోపించడం, ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన వంటి అంశాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (ప్రవర్తనా) నిబంధనలు, 1964లోని రూల్ 3(1), 3(2) నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 20 ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (సిసిఎ) రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం శ్రీ కె.ఎన్. జయ ప్రకాశ్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం సస్పెన్షన్ కాలంలో జీవనాధార భత్యంతో పాటు డి.ఏ. ఇతర పరిహార భత్యాలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

## సిఎంఆర్ఎఫ్,కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/వైరా:పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 105 మంది లబ్ధిదారులకు రూ.25లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్‌ఎఫ్) చెక్కులను, 9 మంది లబ్ధిదారులకు రూ.9లక్షల విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు సిఎం సహాయ నిధి వారికి ఆర్థికంగా అండగా నిలుస్తుందని అన్నారు. ఆడపిల్లల వివాహానికి కళ్యాణలక్ష్మి పథకం ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటేశ్వర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, మార్కెట్ చైర్మన్ బోర్ల గంగారావు, పమ్మి అశోక్, ఫుల్ల్ శ్యామ్‌బాబు, కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గుమ్మా రోశయ్య, మద్దా బుజ్జి, మల్లు రామకృష్ణ, ఆది ఆనందరావుతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## యువ ఆపద మిత్ర శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ : నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో యువ ఆపద మిత్ర కార్యక్రమంలో భాగంగా సామాజిక స్పృహ కలిగిన యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా యువ అధికారి మద్దెల వెంకట రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సునామీ, వరదలు, కరువు, భూకంపాలు, కరోనా వంటి విపత్తుల సమయంలో ఆపత్కాలంలో ఉన్న ప్రజల సహాయక చర్యలు చేపట్టడానికి ప్రభుత్వ దళాలకు అండగా ఉండటానికి యువతను సుశిక్షితులను చేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం అన్నారు. వారం రోజుల పాటు ఆరవ బెటాలియన్ టిజిఎస్‌పి వాళకొండ భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే ఈ శిక్షణ శిబిరానికి అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆపత్కాలంలో ఉపయోగపడగలా ఉండే ఒక ఎమర్జెన్సీ కిట్‌తో పాటు శిక్షణ పొందినట్టు ప్రభుత్వ సర్టిఫికెట్ కూడా ఇవ్వనున్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వారై ఉండాలని, 18 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండాలని, కనీసం ఏడవ తరగతి ఉత్తీర్ణత సాధించి మానసికంగా, శారీరకంగా, దృడంగా ఉండాలన్నారు.దరఖాస్తులకు ఈనెల 25 చివరి తేదీ అని ఆయన తెలిపారు. గ్రామాల్లోని యువత, విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని మై భారత్ (నెహ్రూ యువ కేంద్రం) కార్యాలయంలో లేదా ఫోన్ నెం. 9177329258 సంప్రదించాలని కోరారు.

## సిబ్బంది సంక్షేమానికి పనిచేయాలి



### నూతన కమిటీకి పోలీసు కమిషనర్ సునిల్‌దత్ సూచన

ప్రజాపక్షం/ఖమ్మంక్రైం: పోలీసు అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు సిబ్బంది సంక్షేమానికి అంకితబావంతో పనిచేయాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. ఇటీవల జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం స్థానిక సిపి కార్యలయంలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని సిపి అభినందించి మాట్లాడారు. పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా వ్యవహరించాలన్నారు. పోలీసు సిబ్బంది సమస్యలు, వారి సంక్షేమానికి కృషిచేయాలన్నారు.నూతనరంగా ఎన్నికైన వారిలో అసోసియోషన్ అధ్యక్షుడిగా బి హేమనాథ్, ఉపాధ్యాక్షులుగా కె జగదీష్, వి సురేష్, కార్యదర్శిగా బి వీరభద్రం, సంయుక్త కార్యదర్శిగా కె సుధాకర్, నిర్వాహణ కార్యదర్శిగా బి అప్పారావు, కోశాధికారిగా టి. నరసింహారావు, ఈసి సభ్యులుగా వై వెంకటేశ్వర్లు, వి హరికృష్ణ, కె సురేష్, టి జమలయ్య, ఎన్ ఏడుకొండలు, టి రేణుక ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి సాంబరాజు, ఏఆర్ ఏసిపి సుసిలసింగ్ పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఇంటితో పాటు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వేపకుంట్ల సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ రమాదేవి ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రోడ్ల వెంబడి చెత్తాచెదారాన్ని తొలగించి డ్రైనేజీలు శుభ్రం చేసి దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, యాంటీలార్వా పిచికారి చేశారు. గడ్డిమందు చల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రోడ్ల వెంబడి చెత్తాచెదారం వేయకుండా చూడాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనిల్, సిబ్బంది సందీప్ పాల్గొన్నారు.

## కృషికి తగిన ఫలితం ఐసిఐసిఐ బ్యాంకు డిప్యూటీ మేనేజర్‌గా అఖిల

ప్రజాపక్షం/ఖమ్మం : చిన్నప్పటి నుంచి అలవర్చుకున్న క్రమశిక్షణ, నిరంతర కృషి ఆమెను ఉన్నత స్థాయికి చేర్చింది. ఉన్నత విద్యను అభ్యసించిన అనంతరం అందుకు తగిన ప్రతిఫలాన్ని అందుకుని తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపింది. ఖమ్మంకు చెందిన అర్వపల్లి అఖిల నాగరమ్య ఐసిఐసిఐ బ్యాంకు డిప్యూటీ మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించారు.మామిళ్లగూడెంలో నివసించే అర్వపల్లి నగేష్, శ్రీలక్ష్మి ల కుమార్తె అఖిల నాగరమ్య చిన్నప్పటి నుంచి ఎంతో క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ఖమ్మంలోని మాంటిస్సోరి విద్యాలయంలో పదవ తరగతి వరకు చదివిన ఆమె ఇంటర్ విద్య ఖమ్మంలోనూ, ఉన్నత విద్యను గుంటూరు మాస్టర్ మైండ్స్ కళాశాలలోనూ అభ్యసించారు. పట్టుదలతో చదివి బ్యాంక్ మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించిన నాగరమ్యను పలువురు అభినందించారు. నాగరమ్య తల్లిదండ్రులు నగేష్, శ్రీలక్ష్మి కి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎంఆర్ 'మాయ' మిల్లుల్లో భారీ తేడాలు!

- రూ. కోట్ల విలువైన బియ్యం లెక్కల జల్లెడ
- మిల్లుల కేటాయింపులపైనా స్పెషల్ టీం దర్యాప్తు
- అధికారుల పాత్రపైనా లోతుగా విచారణ...
- తల్లాడ తనికెళ్లలో ఖమ్మం జిల్లాలో మిల్లర్లలో అలజడి



ప్రజాపక్షం/వైరా:ఖమ్మం జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) వ్యవహారం కలకలం రేపుతుంది. ప్రభుత్వానికి అప్పగించాల్సిన సిఎంఆర్ బియ్యంలో భారీగా తేడాలు ఉన్నట్లు ప్రత్యేక తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం. ధాన్యం తీసుకున్న మిల్లర్లు నిర్దేశిత పరిమాణంలో బబియ్యం తిరిగి ప్రభుత్వానికి అప్పగించారా? నిల్వలు, రికార్డులు సరిపోతున్నాయా? అనే అంశాలపై ప్రత్యేక బృందాలు మిల్లుల రికార్డులను జల్లెడ పడుతున్నాయి. 2022–23 సీజన్ నుంచి 2025–26 వరకు సిఎంఆర్ కేటాయింపులు, మిల్లులకు ఇచ్చిన ధాన్యం, ఉత్పత్తి కావాల్సిన బియ్యం ప్రభుత్వానికి అప్పగించిన పరిమాణం, బకాయిలు, మిల్లుల్లో ఉన్న వాస్తవ నిల్వలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. పలు మిల్లుల్లో రికార్డులకు, వాస్తవ నిల్వలకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తుంది.

**రూ.100కోట్లకు పైగానే తేడాలా?**

జిల్లాలోని పలు మిల్లులకు సంబంధించిన లెక్కలను పరిశీలిస్తుండగా రూ.100కోట్లకు పైగా విలువైన సిఎంఆర్ బియ్యం విషయంలో తేడాలు ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పూర్తిస్థాయి తనిఖీలు, లెక్కల సరిపోలిక పూర్తయ్యే వరకు అసలు నష్టం ఎంతన్నది స్పష్టమయ్యే అవకాశం లేదు. అన్ని మిల్లుల తనిఖీలు పూర్తయితే మరిన్ని కీలక వియాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నాట్లు సమాచారం.

**నడవని మిల్లులకు కేటాయింపులు**

సిఎంఆర్ ధాన్యం కేటాయింపులపైనా ప్రత్యేక బృందం దృష్టి సారించినట్లు తెలుస్తుంది. నడవని మిల్లులు, గతంలో డిఫాల్ట్‌గా ఉన్న మిల్లులకు సిఎంఆర్ కేటాయింపులు ఎలా జరిగాయి? నిబంధనల ప్రకారం మిల్లుల సామర్థ్యం, గత బకాయిలు, పనితీరు పరిశీలించారా? లేక ఇతర కారణాలతో కేటాయింపులు జరిగాయా? అనే కోణాల్లో వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కేటాయింపుల నుంచి ధాన్యం తరలింపు, మిల్లింగ బియ్యం, నిల్వ, ప్రభుత్వానికి అప్పగింత వరకు మొత్తం ప్రక్రియను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారంలో కేవలం మిల్లర్ల పాత్రేనా? లేక కేటాయింపులు, పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యం లేదా మరేదైనా ప్రమేయం ఉందా? అన్న కోణంలోను విచారణ సాగుతున్నట్లు సమాచారం.


**తల్లాడ తనిఖీలతో కలకలం**

తల్లాడ మండలంలోని విజయ దుర్గ రైస్ ఇండస్ట్రీస్‌లో సుమారు రూ.7.7 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లు విజిలెన్స్ తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కేసు నమోదు కాడంతో జిల్లాలోని ఇతర సిఎంఆర్ మిల్లర్లలోనూ ఆందోళన మొదలైనట్లు తెలుస్తుంది. వైరా, తల్లాడ, కొణిజర్ల, బోనకల్లు, ఖమ్మం పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సిఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లులపై తనిఖీలు ముమ్మరం కావడంతో మిల్లర్లలో ఉత్కంఠ నెలకొంది.

**రికార్డుల్లో ఒక లెక్క... గోధాముల్లో మరో లెక్క?**

సిఎంఆర్ వ్యవహారంలో ఇప్పుడు ప్రధానంగా ఇదే ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. మిల్లులకు కేటాయించిన ధాన్యం ఎంత? దానికి అనుగుణంగా రావాల్సిన బియ్యం ఎంత? ప్రభుత్వానికి అప్పగించింది ఎంత? మిల్లులో వాస్తవంగా ఉన్న నిల్వలు ఎంత? రికార్డుల్లో చూపుతున్న లెక్కలు ఎంత? మధ్యలో తేడా ఎక్కడ ఏర్పడింది? అన్న అంశాలపై ప్రత్యేక బృందాలు దృష్టి సారించినట్లు సమాచారం. తనిఖీలు పూర్తయిన తర్వాతే సిఎంఆర్ వ్యవహారంలో అసలు లెక్కలు తేలనున్నాయి. మిల్లర్లతో పాటు కేటాయింపులు, పర్యవేక్షణలో భాగమైన అధికారుల పాత్రపైనా విచారణ సాగుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారం జిల్లాలో మరింత సంచలనంగా మారుతుంది.

## ఆశలు రేపుతున్న పత్తి



- కలిసి వచ్చిన వర్షాలు
- రెండవ అతిపెద్ద పంటసాగుకు ఊపు

ప్రజాపక్షం/ ఖమ్మం : ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వ్యవసాయ దిగుబడులపై ఆశలు కోల్పోయిన రైతులకు పత్తి ఆశలు రేపుతుంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నడుమ రైతులు ధైర్యంగా జూన్ మాసంలో పత్తి విత్తనాలు నాటారు. కొందరు రైతులు నీళ్ల పోసి మొక్కలు బతికించుకున్నారు. ఆ తర్వాత వచ్చిపోయే చినుకులు, జూలై మాసం చివరిలో, ఆగస్టు మొదటి వారంలో కురిసిన వర్షాలకు పత్తి ఏపుగా పెరుగుతుంది. చాలా ప్రాంతాల్లో పూతకు వచ్చి నవ నవలాడుతుంది. రాష్ట్రంలోనే వరి తర్వాత అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో వరి కంటే పత్తి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఇదే పరిస్థితి. ఖమ్మం జిల్లాలో దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జలాశయాల్లోకి నీరు రాకపోవడంతో పత్తే ప్రధాన పంటగా ఉంది. దశాబ్ద కాలంగా ఖరీఫ్‌లో పత్తి సాగు చేసి రెండవ పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కరువు వస్తుందని భయపడిన సమయంలో పత్తి ఎదుగుదల, పూత ఆశాజనకంగా ఉండటం రైతుల్లో ఆశలు చిగురింపజేస్తుంది. ఖరీఫ్‌లో ఈ ఏడాది పెసరను కూడా సాగు చేయగా ప్రస్తుతానికి ఫర్వాలేదన్న స్థితిలో ఉంది. పూత, కాత దశలో ఉన్న పెసర ఎడతెగని వర్షాలు లేకపోవడంతో సంపూర్ణంగానే పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. ఇటదే సమయంలో వరి సాగు గణనీయంగా తగ్గింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులలో తాలిపేరు మినహా ఏ ప్రాజెక్టులోనూ సాగునీటి విడుదలకు సరిపడ నీరు లేదు. క్రింద 2.5 లక్షల ఎకరాలకు అందుతుండగా ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు విడుదలయ్యే అవకాశం లేదు. మొత్తంగా పత్తి, పెసర మినహా పంటల పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. బావులు, మోటార్లు, ఇతర నీటి వనరుల క్రింద వరి నాట్లు వేస్తున్నారు.

## భూధార్‌తో భూమికి భద్రత

### కలెక్టర్ దివాకర్ టి.ఎస్

ప్రజాపక్షం/సత్తుపల్లి:భూ రికార్డుల్లో నెలకొన్న లోపాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, హద్దుల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియ సత్తుపల్లి నియోజకవర్గంలో వేగంగా కొనసాగుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న ఈ సర్వే పూర్తయితే ప్రతి భూమికి డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డు అందుబాటులోకి వస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్.. సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గంగారం, బేతుపల్లి, నారాయణపురం గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీసర్వేను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గంగారం గ్రామంలోని పంట పొలాల్లో రైతుల సమక్షంలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన ఆయన పొలాల గట్ల వెంట నడుచుకుంటూ వెళ్లి సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అనంతరం బేతుపల్లి, నారాయణపురం గ్రామాల్లో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సందేహాలను తెలుసుకున్నారు.

12 వేల ఎకరాలకు రీసర్వేబేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గంగారం, బేతుపల్లి, నారాయణపురం, రామగోవిందపురం, ఎం.వి.పాలెం, రామనగర్, పాకలగూడెం గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో భూ రీసర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం 10 బృందాలను ఏర్పాటు చేయగా, ఇప్పటివరకు సుమారు 4 వేల ఎకరాల భూముల రీసర్వే పూర్తయినట్లు వెల్లడించారు. రైతుల సమక్షంలోనే హద్దుల నిర్ధారణభూ రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సర్వేకు 48 గంటల ముందుగానే సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేస్తామని, రైతుల సమక్షంలోనే వారి భూములను కొలుస్తామని చెప్పారు.

## బద్లావ్ జరూరీ హై

- నేడు అశ్వారావుపేటలో ముగింపు
- హాజరుకానున్న పల్లా
- రేపు ఖమ్మంలో ముగింపునకు హాజరుకానున్న కూనంనేని
- గ్రామ గ్రామాన జోరుగా జన చైతన్య యాత్ర

ప్రజాపక్షం/ ఖమ్మం: 'బద్లావ్ జరూరీ హై' అనే నినాదంతో సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు జన చైతన్య యాత్ర పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ నెల ఆరు నుంచి గ్రామ గ్రామాన యాత్రలు నిర్వహించారు. ఖమ్మంజిల్లా యాత్ర ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద ప్రారంభం కాగా భద్రాద్రి కొత్తగూడెంజిల్లా యాత్ర ఏడుళ్లబయ్యారంలో ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరై యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర పినపాక, భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లందు నియోజక వర్గాల్లో పర్యటించి చివరిగా అశ్వారావుపేట నియోజక వర్గంలో చేరుకుంది. పలు గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు పాదయాత్రలు నిర్వహించి జనం సమస్యలు తెలుసుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా నేతృత్వంలో సాగిన ఈ యాత్రలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర్లుతో పాటు రాష్ట్ర సమితి సభ్యులు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 12న బుధవారం అశ్వారావుపేటలో ముగింపు సభ జరగనుంది. ఈ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకటరెడ్డి హాజరుకానున్నారు. ఖమ్మం జిల్లాలో సాగిన ఈ యాత్ర చివరి రోజు ఈనెల 13న గురువారం ఖమ్మంలో సాగనుంది. ఇప్పటి వరకు మూడు నియోజక వర్గాల్లో దాదాపు అన్ని మండలాల్లో సాగిన ఈ యాత్ర బుధవారం సత్తుపల్లి నియోజక వర్గంతో పాటు ఏన్కూరు మండలంలో సాగనుంది. ముగింపు సందర్భంగా ఖమ్మంలో వినూత్న రీతిలో ప్రజా ప్రదర్శనను ఏర్పాటు





చేశారు. మూడు వైపుల నుంచి ప్రదర్శనలు ప్రారంభమై సభ జరిగే భక్తరామదాసు కళాక్షేత్రానికి చేరుకోనున్నాయి. రోటరీ నగర్ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రకు బాగం హేమంతరావు, నయాబజార్ కళాశాల నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రకు జిల్లా కార్యదర్శి దండి సురేష్, అల్లిపురం క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రకు జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి నేతృత్వం వహించనున్నారు. ఈ మూడు ప్రదర్శనలు జెడ్పి సెంటర్ వద్దకు చేరుకున్న అనంతరం జెడ్పి సెంటర్ నుంచి వైరా రోడ్డులో భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ప్రదర్శనగా సాగనున్నాయి. ప్రదర్శన అనంతరం జరిగే సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తో పాటు సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొననున్నారు. వారం రోజులుగా సాగిన పాదయాత్రకు సంబంధించి వివిధ గ్రామాల్లో స్వీకరించిన వినతులు, కనుగొన్న సమస్యలకు సంబంధించి కార్యాచరణ తదితర విషయాలను సభలో ప్రకటించనున్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- కొత్తగూడెం ఏరియాలో పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలి : ఎఐటియుసి



ప్రజాపక్షం/చుంచుపల్లి:సింగరేణి కొత్తగూడెం ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రత్యేక చొరవ చూపాలని ఎఐటియుసి నాయకులు కోరారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో నాయకులు ఇటీవల జీఎం పర్సనల్‌గా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్, జీఎం అయజ్‌కుమార్, జీఎం ఎద్యుకేషన్ గడిపెల్లి రాజేంద్రప్రసాద్‌లను కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు యాజమాన్యం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కొత్తగూడెం ఏరియాలో కార్మికులకు సంబంధించిన పలు సమస్యలు వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వేగంగా పరిష్కరించేందుకు నూతన అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, వాటి పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతోందని నాయకులు పేర్కొన్నారు. యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య సమన్వయంతో ముందుకు సాగితే కార్మికులకు న్యాయం జరగడంతోపాటు సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతాయని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కరిస్తే కార్మికుల్లో యాజమాన్యంపై విశ్వాసం మరింత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరయ్య, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి జె.గట్టయ్య, భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపాలకుల రమేష్, కార్పోరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సత్తుపల్లి కార్యదర్శి సముద్రాల సుధాకర్, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు కత్తెర్ల రాములు, ఆఫీస్ బేరర్లు సందేబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, గుమ్మడి వీరయ్య, హీరాలాల్, పిట్ కార్యదర్శులు మధు తదితరులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న భోజనం'పై కలెక్టర్ అసంతృప్తి

### క్రీడలతో పాటు మెరుగైన విద్యను అందించాలి



ప్రజాపక్షం/పాల్వంచ : యానంబైల్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ అంకిత్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. మండల పరిధి కిన్నెరసాని లోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మోడల్ క్రీడా పాఠశాలను, యానంబైల్, రాజాపురంలలో గల పాఠశాలలు, పల్లె ధవాఖానను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా క్రీడా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, లైబ్రరీ, క్రీడా మైదానాన్ని, పాఠశాల పరిసరాలను, భవనాలు వర్షానికి లీకై కరుస్తున్నాయా, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా, హాస్టల్ సమస్యలను, సదుపాయాలను అడిగి తెలుసుకొన్నారు. క్రీడా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న క్రీడా శిక్షణపై ఆరా తీశారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను పరిశీలించారు. అనంతరం యానంబైల్ జిల్లా పరిషత్ పాఠశాలను, పల్లె ధవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులను చూసి భోజనాన్ని పరిశీలించారు. మెనూ కు, ఇచ్చిన ఆహారానికి తేడా ఉండటంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందించేందుకు ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులను విద్యతో పాటుగా క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దారా ప్రసాద్, పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్లు

### ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్: పెన్షన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు నగర పాలక సంస్థ పరిధిలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పోరేషన్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెన్షన్ దరఖాస్తుల పరిశీలన కోసం నగర పాలక సంస్థ పరిధిలో 16 కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు కార్పోరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పెన్షన్ దరఖాస్తు మొదట సంబంధిత వార్డు ఆఫీస్ వద్దకు చేరి అక్కడి నుంచి డిప్యూటీ కమిషనర్ ద్వారా కలెక్టరేట్ కార్యాలయానికి పంపేవిధంగా ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనంత్ టెక్నాలజీస్ ద్వారా అందిన అన్‌అసెస్డ్ ప్రాపర్టీలను గుర్తించి వాటి పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ట్యాక్స్ కలెక్షన్ బాధ్యతలను రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు.

**అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి :**ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రత్యేకంగా యూడిఎఫ్ పనులతో పాటు ఫుట్‌పాత్ నిర్మాణ పనులు కూడా త్వరితగతిన చేపట్టాలన్నారు. ప్రధాన రహదారులపై ప్యాచ్ వర్క్స్ అవసరం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. వీధి దీపాల పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడ నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వరద పరిస్థితులపై సమీక్షించి ప్రభావిత ప్రాంతాల స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బంది, వాలంటీర్లతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

**ఎల్ఆర్ఎస్ ఎల్ 1 దరఖాస్తులు పరిష్కరించాలి**

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఎల్1 స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిని సెప్టెంబర్ 30లోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రీవెన్స్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ తెలిపారు.

## ఐటిడిఎ కాంప్లెక్స్‌లో సబ్ స్టేషన్ నిర్మాణం పనులు వేగవంతం


### సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్



ప్రజాపక్షం/భద్రాచలం: భద్రాచలం ఐటిడిఎ నివాస గృహాలు, పరిసరాల్లో నివసిస్తున్న కాలనీలోని కుటుంబాలకు సౌకర్యవంతంగావిద్యు కొరత, సమస్యలు తలెత్తకుండా 33/11 kv నిర్మాణం చేపడుతున్న సబ్‌స్టేషన్ పనులు త్వరితగతిన పూర్తిచేసి త్వరలో కరెంటు సరఫరా అయ్యే విధంగా సంబంధిత విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలని ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. మంగళవారం ఐటిడిఎ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం వెనుక ఉన్న 30 కుంటల ఖాళీ స్థలంలో 33/11 kv సబ్ స్టేషన్ నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ సబ్ స్టేషన్ నిర్మణం వల్ల భద్రాచలం పట్టణం ,శివారు కాలనీలలో విద్యుత్ సమస్య అనేది ఉండదని, దాదాపు 5 వేల కుటుంబాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ విద్యుత్ శాఖ అధికారి వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేరళం బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు 17వ రోజైన మంగళవారం కూడా ఉభయసభల్లో ప్రతిపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేశాయి. జులై 20న 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్యపై, పెల్లెట్ గన్‌ల వినియోగం, అయోధ్యలోని రామాలయంలో విరాళాల చోరీపై హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చిన సమాధానం చెప్పాలని పట్టుబట్టాయి. ప్రతిపక్షాలతో నిరసనలతో దిగొచ్చిన ప్రభుత్వం ఈ అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే విద్యార్థుల నిరసనలపై పెల్లెట్ గన్‌ల వినియోగానికి ఎవరు అనుమతించారో హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకించి ప్రకటన చేయాలని కాంగ్రెస్ తాజాగా డిమాండ్ చేసింది. ఎలాంటి బేరసారాలు లేకుండా రామాలయ విరాళాల చోరీపై కూడా చర్చ జరపాల్సిందేనని పట్టుబట్టింది. ఉభయసభల్లోనూ మరోసారి కూడా వాయిదాల పర్వం కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే లోక్‌సభ రెండు కీలక బిల్లులను ఆమోదించింది. 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026', 'జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ) బిల్లు, 2026'లకు ఆమోదం తెలిపిన తరువాత సభ మరుసటి రోజుకు వాయిదా పడింది. అదే సమయంలో, రాజ్యసభ మంగళవారం నాడు 'ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు, 2026'ను ఆమోదించింది. కాగా, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీపై ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభలు పలుమార్లు వాయిదా పడగా, గందరగోళం మధ్య మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైంది. ఆ కోలాహలం మధ్యే సభకు పత్రాలను సమర్పించడానికి ప్రిసైడింగ్ అధికారి కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతించారు. అనంతరం, రాష్ట్ర పేరును 'కేరళం'గా మార్చాలని ప్రతిపాదించే 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను పరిశీలన, ఆమోదం కోసం చేపట్టారు. హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ప్రవేశపెట్టిన ఈ బిల్లు, నినాదాల హోరు మధ్య ఎటువంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటు ద్వారా ఆమోదం పొందింది. ఆ వెంటనే, సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ 'జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. కొనసాగుతున్న గందరగోళం మధ్యనే ఇది కూడా చర్చ లేకుండా ఆమోదం పొందింది. ఇప్పటివరకు లోక్‌సభ ఆమోదించిన 11 బిల్లులలో కేవలం రెండింటిపై మాత్రమే చర్చ జరిగింది, మిగిలిన బిల్లులన్నీ ప్రతిపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదించబడ్డాయి. అంతకు ముందు, ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాయిదా పడాల్సి రావడంపై స్పీకర్ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు.



### రాజ్యసభ నుంచి ఇండియా కూటమి వాకౌట్

ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు, 2026పై రాజ్యసభలో చర్చ జరుగుతుండగా, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేను మాట్లాడటానికి సభాపతి అనుమతించకపోవడంతో, మంగళవారం మధ్యాహ్న భోజనానంతర సమావేశంలో ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు వాకౌట్ చేశాయి. గత నెలలో నిరసన తెలిపిన విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో సహా బలప్రయోగం చేయడం, రామ మందిరంలో విరాళాల దొంగతనం ఆరోపణలపై హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేయడంతో, పదేపదే వాయిదా పడుతున్న రాజ్యసభలో, మంగళవారం మధ్యాహ్న భోజనానికి ముందు జరిగిన సమావేశం రెండుసార్లు వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష ఎంపిల నినాదాల మధ్య ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లును చేపట్టారు. సభాపతి ఎంపిలను కేవలం బిల్లుపై మాత్రమే మాట్లాడాలని కోరారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేను మొదట మాట్లాడటానికి అనుమతించలేదు. దీంతో ప్రతిపక్ష బెంచీల నుండి 'ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడనివ్వండి' అనే నినాదాలు వినిపించాయి. గందరగోళం మధ్య చర్చ ప్రారంభం కాగానే, ప్రతిపక్ష ఎంపిలు కూడా క్రమశిక్షణా అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నించారు. అదే సమయంలో, హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని, రామ మందిరంలో విరాళాల దొంగతనం జరిగిందంటూ పలు నినాదాలు వినిపించాయి. హరివంశ్, ఖర్గేను కొద్దిసేపు మాట్లాడటానికి అనుమతించినప్పటికీ, సభలో చర్చకు వచ్చిన అంశాలపైనే ఆయన మాట్లాడాలని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకుడు రామ మందిరం అంశంపై మాట్లాడటానికి ప్రయత్నించగా, సభాపతి ఆయనకు అనుమతి ఇవ్వలేదు. ఆ తర్వాత హరివంశ్ తదుపరి వక్తను పిలవగా, చర్చ కొనసాగుతుండగానే ఇండియా కూటమి పార్టీలు సభ నుండి వాకౌట్ చేశాయి.

# ఉమ్మడి అవగాహనకు రండి

**సభా కార్యకలాపాలకు అంతరాయంపై అధికార, విపక్ష సభ్యులకు స్పీకర్ ఓమ్‌బిర్లా విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ :** లోక్‌సభ కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలగడంపై స్పీకర్ ఓమ్ బిర్లా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సుదూరమైన మార్పులు తీసుకువచ్చే కీలక బిల్లులపై సభ చర్చించేందుకు వీలుగా ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఒక ఉమ్మడి అవగాహనకు రావాలని కోరారు. ప్రతిపక్షాల నిరసనల మధ్య సభలో ప్రకటన చేస్తూ, జులై 20న నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించిందని బిర్లా తెలిపారు. సభ ఎలాంటి అంతరాయాలు లేకుండా పనిచేస్తే, ప్రతిపక్షాలు లేవనెత్తిన ఇతర సమస్యలపై కూడా చర్చించవచ్చని బిర్లా అన్నారు. ప్రభుత్వమే సభను నడపాలని, ప్రతిపక్ష, అధికార పక్షాలు ఒక ఉమ్మడి అవగాహనకు వచ్చి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ఆయన అన్నారు. సభ సక్రమంగా పనిచేయకపోవడంతో తనకు కలుగుతుందని బిర్లా అన్నారు. సభ లోపల ప్లకార్డులు ప్రదర్శించడం పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమని, అలా చేయవద్దని ప్రతిపక్ష సభ్యులను ఆయన కోరారు. జులై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి, లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం పూర్తి కాలేదు, ఎలాంటి చర్చ లేకుండా గందరగోళం మధ్య అనేక బిల్లులు ఆమోదం పొందాయి. ప్రశ్నోత్తరాల సమయం చాలా ముఖ్యమైనదని, ఇది ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచడంలో సభ్యులకు సహాయపడుతుందని, అలాగే కార్యనిర్వాహక వర్గ పనితీరులో పారదర్శకతను తీసుకువస్తుందని బిర్లా అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో జాబితాలో ఉన్న ప్రశ్నలను మాత్రమే అడగాలని తాను ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు స్పీకర్ నొక్కి చెప్పారు.



# మా డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గలే

- మొదటి నుంచీ స్థిరంగానే ఉన్నాం
- పార్లమెంట్‌లో ప్రతిష్టంభనపై మల్లికార్జున ఖర్గే స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షం తమ డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గడం లేదని, విద్యార్థులపై జరిగిన పోలీసుల దౌర్జన్యాలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలనే డిమాండ్‌తో సహా తమ వైఖరి మొదటి నుంచీ స్థిరంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. పార్లమెంటులో ప్రతిష్టంభన నెలకొనడంతో ఆయన మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసన అనేది ఒక ప్రత్యేక అంశం అని పేర్కొన్న ఖర్గే, ప్రతి ఒక్క విషయాన్నీ ఒకే రోజున చర్చించగలమా అని ప్రశ్నించారు. 'మేము మా డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గడం లేదు. మా వైఖరి మొదటి నుంచీ స్థిరంగా ఉంది, మాకు మూడు నిర్దిష్టమైన అంశాలు ఉన్నాయి. మొదటిది విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, కాల్పులకు సంబంధించినది. ఆ ఆదేశాలు ఎవరు ఇచ్చారు, అది ఎలా జరిగింది అనేది మాకు తెలియాలి. దీనిపై సభలో ప్రకటన రావాలని మేము కోరుకుంటున్నాము. రెండవది, లాఠీచార్జ్ కారణంగా చాలా మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు, ఆసుపత్రి పాలయ్యారు. 100 మందికి పైగా స్వల్ప గాయాలపాలయ్యారు, చాలా మంది పెల్లెట్ గన్ల దాడిలో గాయపడ్డారు. ఈ విషయంపై కూడా ప్రకటన కావాలని మేము కోరుకుంటున్నాము. 18 రోజులు గడిచినా, దీనిపై ప్రకటన ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖత చూపడం లేదు' అని పార్లమెంట్ భవన సముదాయంలో విలేకరులతో ఖర్గే అన్నారు. అయితే ప్రభుత్వం ఏదో ఒక తూతూమంత్రపు ప్రకటన చేసి ముందుకు సాగిపోవాలని చూస్తోందని విమర్శించారు. ఇక చందాచోర్, ప్రధాని, అమిత్ షా క్షమాపణ చెప్పాలనే అంశాలను తాము మొదటి నుంచి లేవనెత్తుతున్నావేనన్నారు. అవి పరిష్కారమయ్యే వరకు సభల్లో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంటుందన్నారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసన గురించి ఖర్గే మాట్లాడుతూ, 'అది ఒక ప్రత్యేక అంశం. వందలాది సమస్యలు ఉంటాయి, వాటిని విడివిడిగా చర్చిస్తారు కదా? ప్రతి ఒక్క విషయాన్నీ ఒకే రోజున లేవనెత్తుతామా?' అని అన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి
# దేశవ్యాప్త ప్రచారం

- ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం
- సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటన

**న్యూఢిల్లీ :** గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం దేశవ్యాప్త ప్రచారం చేయనున్నట్లు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. పాఠశాలల్లోని కనీస వసతులపై సామాజిక తనిఖీలు నిర్వహించాలని తల్లిదండ్రులకు, అలాగే పాఠశాలల అభివృద్ధి బాధ్యతను చేపట్టాలని సర్పంచులకు ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ విద్యా మౌలిక సదుపాయాల పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని పరిష్కరించేందుకు పౌరులు, తల్లిదండ్రులు, గ్రామ నాయకులు కలిసి పనిచేయాలని కోరుతూ, ఈనెల15న ఈ ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. మహారాష్ట్రలోని తన సొంత గ్రామం హింగోలిలో, అక్కడి ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచాలని గ్రామ పెద్దను కోరడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని దీప్కే సోమవారం ఒక వీడియో సందేశంలో తెలిపారు. ఆగస్టు 15 మన 80వ స్వాతంత్ర్య దినోత్సవం, కానీ, గత 80 ఏళ్లలో అత్యంత నిర్లక్ష్యానికి లేదా విస్మరణకు గురైన అంశం ఏదైనా ఉందంటే, అది మన గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలే అని దీప్కే అన్నారు. 'మనం కొత్త పార్లమెంట్ భవనాన్ని, కొత్త ప్రధానమంత్రి నివాసాన్ని నిర్మించుకున్నాం. మరి మన గ్రామాల్లో కొత్త పాఠశాలలను ఎందుకు నిర్మించలేకపోయాం? రైతులు, కూలీల పిల్లలను మన దేశ భవిష్యత్తుగా మనం భావించడం లేదా?' అని ఆయన ప్రశ్నించారు. గ్రామీణ పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి ఇప్పటికీ చాలా దూరం నడవాల్సి వస్తోందని, అక్కడ తాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు కూడా తరచుగా అందుబాటులో ఉండటం లేదని దీప్కే పేర్కొన్నారు. ఈ ఆగస్టు 15న ఏదైనా విషయంపై దృష్టి సారించాలన్నా, లేదా ఏదైనా కొత్త ప్రారంభం చేయాలన్నా, అది మన ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడంతోనే మొదలుపెట్టాలని భావిస్తున్నానన్నారు. ఈ ప్రచారంలో భాగంగా, దేశవ్యాప్తంగా ఉన్న సర్పంచులు తమ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సిజెపి పిలుపునిచ్చింది.



**జార్ఖండ్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్‌పై సిజెపి ఖండన**

జార్ఖండ్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఖండించారు. ఈ ఘటన తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతోకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఆసుపత్రిలో ఉన్న మహతోతో దీప్కే వీడియో కాల్ ద్వారా మాట్లాడారని, పోలీసుల చర్యకు ముందు మహతో తొమ్మిది రోజుల పాటు నిరాహార దీక్ష చేశారని, ఆ లాఠీచార్జ్ ఘటన తర్వాత ఆయన ఆరోగ్యం క్షీణించిందని సిజెపి ఒక ప్రకటనలో పేర్కొంది. పోలీసుల చర్య సమయంలో తీవ్రమైన ఛాతీ నొప్పి, అనేక గాయాల కారణంగా మహతోకు ఆక్సిజన్ సపోర్ట్ అందించాల్సి వచ్చిందని సిజెపి తెలిపింది. శాంతియుత నిరసనలో పాల్గొంటున్న విద్యార్థులే లక్ష్యంగా పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారని ఆ పార్టీ ఆరోపించింది.

## యువత నిరసనలను
# బిజెపి, కాంగ్రెస్ హైజాక్

**అధికార, విపక్ష శిబిరాలకు దూరంగా ఉండండి • జెన్ జీకి బిఎస్‌పి చీఫ్ మాయావతి విజ్ఞప్తి**

**లక్నో :** అధికార, ప్రతిపక్ష శిబిరాల 'కుట్రలకు' దూరంగా ఉండాలని బిఎస్‌పి అధినేత్రి మాయావతి విద్యార్థులకు, జెన్ జెడ్‌కు విజ్ఞప్తి చేశారు. తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం యువత నిరసనలను హైజాక్ చేయడానికి బిజెపి, కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయని ఆమె ఆరోపించారు. మంగళవారం లక్నోలో ఏర్పాటు చేసిన మిడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత తమ సమస్యల పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వాటిని పరిష్కరించే విషయంలో బిఎస్‌పి 'తీవ్రంగా, సున్నితంగా' వ్యవహరిస్తోందని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. యువత సమస్యలను పరిష్కరించడంలో బిజెపి గానీ, కాంగ్రెస్ గానీ చిత్తశుద్ధితో లేవని మాయావతి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన విద్యార్థులు, యువత నిరసనను మొదట 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) ప్రారంభించిందని, అయితే ఆ తర్వాత దానిని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు హైజాక్ చేశాయని ఆమె ఆరోపించారు. రాంచీలో కూడా ఇలాంటి పరిస్థితే తలెత్తుతోందని, అక్కడ విద్యార్థులు, యువత తమ సమస్యలపై నిరసన తెలుపుతుండగా, ఆ తర్వాత దానిని బిజెపి, దాని మిత్రపక్షాలు హైజాక్ చేశాయని మాయావతి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ విద్యార్థి, యువజన ఉద్యమం, ఇప్పుడు రాంచీలో జరుగుతున్న ఉద్యమం... వీటి ముసుగులో మనకు ఎక్కువగా రాజకీయాలే కనిపిస్తున్నాయని మాయావతి అన్నారు. యువత సమస్యల పరిష్కారం పట్ల అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏవీ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆమె ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల కుట్రలకు దూరంగా ఉండాలని, ఎన్నికల ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు వారి నిరసనలను వాడుకోవడానికి అనుమతించకుండా, తమ సమస్యల పరిష్కారం కోసం వాటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని ఆమె జెన్ జీకి విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్ల విధానంపై అధికార బిజెపిని మాయావతి తీవ్రంగా విమర్శించారు. బిఎస్‌పి ప్రభుత్వ హయాంలో తాను తీసుకొచ్చిన కోటా నిబంధనలను కాషాయ పార్టీ బలహీనపరుస్తోందని ఆమె ఆరోపించారు. 'మేము ప్రైవేట్ రంగానికి వ్యతిరేకం కాదు, కానీ ప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్నట్లే ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అందుబాటులో ఉండాలి' అని ఆమె అన్నారు. ధనికులకే ప్రయోజనాలు చేకూరుతుండగా, పేదలు, నిరుద్యోగులు, అణగారిన వర్గాలు మరింత వెనుకబడిపోతున్నాయని ఆమె ఆరోపించారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా తన నాలుగు పర్యాయాల పదవీకాలంలో, తమ ప్రభుత్వం ఏ వర్గానికీ వివక్ష చూపలేదని, 'సర్వజన హితాయ్, సర్వజన సుఖాయ్' (అందరి సంక్షేమం, సంతోషం) అనే సూత్రంపై పనిచేసిందని మాయావతి పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ పంజాబ్‌లలో ఏకకాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని, విద్యార్థులు, యువత, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ముస్లింలు, ఇతర మైనారిటీలు, రైతులు, కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులతో సహా అన్ని వర్గాల వారు బిఎస్‌పిని బలోపేతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బిఎస్‌పి ప్రభుత్వాల హయాంలో విద్యార్థులు, యువత నిరాశకు గురికాలేదని, వారి జీవనోపాధికి ప్రత్యేక శ్రద్ధ చూపారని మాయావతి అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడ్డాయని ఆమె పేర్కొన్నారు. 'జై భీమ్', 'జై భారత్' నినాదాలతో ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.



### పంద్రాగస్టుకు శ్రీనగర్‌లో బహుళంచెల భద్రత

**శ్రీనగర్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శాంతియుతంగా నిర్వహించేందుకు కశ్మీర్ వ్యాప్తంగా బహుళ అంచెల పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మంగళవారం లోయ పోలీస్ చీఫ్ వి.కె. బిర్ది బలిదాన్ స్తంభం వద్ద ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. జమ్ముకశ్మీర్ పోలీసులు కేవలం శ్రీనగర్ నగరంలోనే కాకుండా, లోయలోని వివిధ జిల్లాల్లో కూడా ఎల్లప్పుడూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుంటాని, నిర్దిష్ట వేదికల వద్దే కాకుండా, నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతనాగ్, పుల్వామాలలో ఇటీవల జరిగిన దాడులపై దర్యాప్తు గురించి అడిగిన ప్రశ్నకు ఐజిపి సమాధానమిస్తూ, దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఇది ఒక ప్రజా కార్యక్రమం. ఇందులో పోలీసులు కేవలం సహాయకులుగా లేదా నిర్వాహకులుగా మాత్రమే వ్యవహరిస్తారు. ప్రజలు ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని వాటిని విజయవంతం చేయాలని మేము కోరుతున్నాము' అని ఆయన అన్నారు. శ్రీనగర్‌లోని బక్షి స్టేడియంలో జరగనున్న ప్రధాన కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను కూడా ఆయన సమీక్షించారు. అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, సున్నితమైన ప్రదేశాలలో, నగర ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వెంబడి భద్రతా చెక్ పాయింట్లను మరింత పటిష్టం చేయాలని ఐజీ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తుల పట్ల కఠినమైన నిఘా ఉంచాలని, అన్ని అధికార పరిధులలో అప్రమత్తతను పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ముమ్మరించిన భద్రతా చర్యలలో భాగంగా, పోలీసులు లాల్ చౌక్ మరియు నగరంలోని ఇతర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు, సోదాలు నిర్వహించారు.

## 'కేన్సర్‌ను 'నోటిఫైచేయదగిన వ్యాధి'గా ప్రకటించాలని...
# 19 రాష్ట్రాలు, యుటిలను కోరిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** రోగులకు ముందస్తుగా వ్యాధిని గుర్తించి, సరైన సంరక్షణ అందించేందుకు వీలుగా, 'కేన్సర్‌ను ఒక నోటిఫై చేయదగిన వ్యాధిగా ప్రకటించాలి' అని మంగళవారం సుప్రీంకోర్టు మిగిలిన 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యుటిలు)ను కోరింది. పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదికలోని సిఫార్సుల దృష్ట్యా 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 17 రాష్ట్రాలు ఇప్పటివరకు కేన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించాలని సమాచారం అందిన తర్వాత సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీచేసింది. ప్రముఖ వైద్యుడు అనురాగ్ శ్రీ వాస్తవ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గతేడాది డిసెంబరు 12న కోర్టు నోటీసులు జారీచేసి, కేంద్రానికి, అన్ని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాల స్పందనలు కోరింది. రోగులకు ముందుగానే వ్యాధిని గుర్తించి, సరైన సంరక్షణను అందించేందుకు దేశవ్యాప్తంగా కేన్సర్‌ను 'నోటిఫై చేయదగిన వ్యాధి'గా ప్రకటించాలని కోరుతూ ఈ ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేయబడింది. మంగళవారం, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం, ఏకరీతి విధానం ఉండాలని పేర్కొంటూ, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కొన్ని తప్పనిసరి మార్గదర్శకాలను ఎందుకు జారీ చేయడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరపున కోర్టులో హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్ ధర్మాసనం మందు మాట్లాడుతూ ఆరోగ్యం అనేది రాష్ట్ర పరిధిలోని అంశం అని తెలియజేశారు. 'అంతేకాకుండా, 17రాష్ట్రాలు ఈ వ్యాధిని గుర్తించాయి' అని న్యాయాధికారి అన్నారు. 'మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పైన పేర్కొన్న సిఫార్సులను పరిశీలించి, తగిన నిర్ణయాలు తీసుకోవాలని మేం ఆదేశిస్తున్నాం. అనుగుణ్యత అఫిడవిట్లను దాఖలు చేయాల్సి ఉంటుంది' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చెప్పారు. తన పిటిషన్‌లో, భారతదేశ వ్యాప్తంగా కేన్సర్‌ను నోటిఫై చేయదగిన వ్యాధిగా ప్రకటించడంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, రాష్ట్రాలు విఫలమయ్యాయని శ్రీవాస్తవహైలెట్‌చేశారు. భారతదేశంలో కేన్సర్ కేసుల ఏకరీతి, తప్పనిసరి రిపోర్టింగ్‌ను నిర్ధారించడానికి, కేన్సర్‌ను ఒకనోటిఫైడ్ వ్యాధిగాప్రకటించేలా ప్రతివాదినెంబర్1 (కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ)కు వ్యతిరేకంగా మాండమస్ స్వభావం గల సముచితమైన రిట్‌ను తయారుచేయండి' అని పిటిషన్‌లో పేర్కొనబడింది. కేంద్రం, అన్ని రాష్ట్రాలతోపాటు, న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సర్జికల్ డిసిప్లిన్స్ విభాగాధిపతి శ్రీ వాస్తవ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్‌ను కూడా ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)లో ఒక పక్షంగా చేర్చారు. అనేక రాష్ట్రాలలో రోగులకు తరచుగా వ్యాధి ముదిరిన దశల్లో మాత్రమే రోగ నిర్ధారణ జరుగుతున్నదని, ఆ దశలో నయం చేసే చికిత్స 'కష్టంగా, ఖరీదైనదిగా లేదా అసాధ్యంగా మారుతుంది'అని అందులో పేర్కొన్నారు. ఎన్‌సిఆర్‌పి, ఆసుపత్రి డేటా బేస్‌లు, ప్రభుత్వ బీమా పథకాలు, మరణాల రికార్డులతో అనుసంధానించబడిన కేంద్రీకృత రియల్ టైమ్ క్యాన్సర్ రిజిస్ట్రీని ఏర్పాటు చేయాలనే ఒక ఆదేశాన్ని పిటిషన్ కోరింది.



# నీట్ పరీక్షలను రద్దుచేయాలని తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

**చెన్నై :** వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి జాతీయస్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షను తమిళనాడు తొలి నుంచీ వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో సిఎం విజయ్ నేతృత్వంలోని టివికె ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆరోగ్యశాఖ మంత్రి కె అరుణ్‌రాజ్ మంగళవారం ఈ తీర్మానాన్ని తీసుకువచ్చారు. దీనికి ప్రధాన విపక్షాలైన డిఎంకె, ఎఐఎడిఎంకె మద్దతు తెలిపాయి. టివికెకు మిత్రపక్షాల నుంచి ఎలాగూ మద్దతు ఉన్నది. ఒక్క బిజెపి మాత్రం సభ నుంచి వాకౌట్ చేసింది. ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా ఆరోగ్య మంత్రి అరుణ్‌రాజ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నీట్‌ను రద్దు చేయాలి. ఈ ప్రవేశ పరీక్షవల్ల విద్యార్థుల దృష్టి కోచింగ్ సెంటర్ల వైపు మళ్లింది. ఫీజులు భారీగా వసూలు చేసే కోచింగ్ సెంటర్లు పెరిగిపోయాయి. దాంతో గ్రామీణ ప్రాంతాల్లోని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి అని ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాష్ట్రాల హక్కులకు ఈ పరీక్ష వ్యతిరేకం అనే విషయాన్ని తమిళనాడులోని ప్రతి ప్రభుత్వం వాదిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం ఉండాలని విజయ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. గతంలో డికెంకె ఇదే ప్రతిపాదన చేసింది. నీట్ పేపర్ లీక్ అంశాన్ని కూడా తమిళనాడు ప్రభుత్వం తీర్మానంలో ప్రస్తావించింది. విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ పరీక్ష ఒత్తిడి కారణమని పేర్కొన్నది. నీట్ రద్దుతోనే వాటికి ముగింపు వస్తుందని అభిప్రాయపడింది.

# 'వందేమాతరం' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**న్యూఢిల్లీ :** జాతీయ గీతం వందేమాతరం గీతాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. మంగళవారం ఈ విషయాన్ని ఒక ప్రభుత్వ ప్రకటన తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు, 2026 చట్టంగా మారింది. లోక్‌సభ జులై 30న ఈ బిల్లును ఆమోదించగా, దీనికి ఒక రోజు ముందే ఈ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలియజేసింది. ఈ తాజా చట్టం వందేమాతరానికి జన గణ మన జాతీయగీతంతో సమానమైన హోదాను కల్పిస్తుంది.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా ఎర్రకోట ప్రాకారాల నుంచి వందేమాతరం గీతాన్ని ఆలపిస్తారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. గతంలో జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక చట్టం ప్రకారం..ఉద్దేశ పూర్వకంగా జాతీయ గీతాన్ని (జన గణ మన) పాడటాన్ని అడ్డుకోవడం లేదా ఆ గీతాన్ని పాడుతున్న ఏదైనా సభకు ఆటంకం కలిగించడం నిషేధించబడింది. ఈ నేరాలకు గరిష్ఠంగా మూడు సంవత్సరాల జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు. కాగా, రెండవ, ఆ తర్వాతి ప్రతీ నేర నిర్ధారణకు కనీసం ఒక సంవత్సరం జైలుశిక్ష విధించబడుతుంది. కానీ, పూర్వపు చట్టం జాతీయ గీతానికి తగిన రక్షణను కల్పించలేదు.'ప్రస్తుతం జాతీయగీతంగా గౌరవించబడే వందేమాతరం గానాన్ని అవమానించడాన్ని నిరోధించడానికి నిర్దిష్టమైన చట్టపరమైన నిబంధన ఏదీలేదు. అందువల్ల, ఏ వ్యక్తి అయినా ఉద్దేశపూర్వకంగా జాతీయగీతాన్ని ఆలపించకుండా నిరోధించడం లేదా ఆ గానంలో నిమగ్నమైన ఏదైనా సభకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను నిషేధించడానికి, సదరు చట్టంలోని సెక్షన్ 3 పరిధిలోకి జాతీయ గీతాన్ని కూడా చేర్చి,అటువంటి చర్యలను శిక్షార్హమైనవిగా చేయడానికి సవరించాలని ప్రతిపాదించబడింది' అని ఆ బిల్లు పేర్కొంది.


**LOST CERTIFICATES**

I, **Mohammad Nausheen Zaara, D/o. Mohammad Ishaq**, R/o. H.No. 2-203, Ramraheem Nagar, Narsampet Municipality and Mandal, Warangal District, Telangana State, hereby **I lost my original B.sc Degree Convacation certificate. Roll no. 484183240**, while travelling by motor bike from my house to Narsampet bus stand. If anybody found return to the above mentioned address.

**Contact No: 6281886163**

# క్యాటరింగ్ లారీలో దాక్కొని ట్రంప్ ప్రయాణం

- క్షిపణి ప్రయోగంతో ట్రంప్ హత్యకు ఇరాన్ ప్రణాళిక భగ్నం
- టర్కీ నుండి లండన్ తరలించేందుకు సీక్రెట్ ఆపరేషన్
- వాషింగ్టన్ పోస్ట్ సంచలన కథనం

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై అనేక సార్లు హత్యా ప్రయత్నాలు జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఇరాన్‌తో యుద్ధం ప్రారంభించిన తర్వాత ఆయనకు తీవ్రమైన బెదిరింపులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది జులై 7–8 తేదీలలో టర్కీ నగరం అంకారాలో జరిగిన నాటో కూటమి సమావేశాల్లో పాల్గొన్న ట్రంప్ తిరుగు ప్రయాణంలో అత్యంత రహస్య ఆపరేషన్ ద్వారా అమెరికాకు వెళ్ళిపోయారు. ఇరాన్ వర్గాలు హత్య చేస్తాయనే విశ్వసనీయమైన సమాచారం అందిన పూర్వరంగంలో ప్రపంచాన్ని తప్పుతోవ పట్టించి రహస్యమార్గంలో ట్రంప్‌ను అమెరికాకు తరలించారు. వాషింగ్టన్ పోస్ట్ సోమవారం ఈ కథనం ప్రచురించింది. హత్యా ప్రమాదం నుండి తప్పించుకునేందుకు ట్రంప్ క్యాటరింగ్ లారీలో రహస్యంగా కొంతదూరం ప్రయాణించి ఆ తర్వాత చిన్న సైనిక విమానం ఎక్కి వెళ్ళిపోయారు. టర్కీ నుండి తిరిగివెళ్ళే మార్గమధ్యలో ట్రంప్‌ను క్షిపణి ప్రయోగం ద్వారా హత్య చేయాలని ఇరాన్ చేసిన ప్రణాళికను అమెరికా రక్షణ వర్గాలు భగ్నం చేశాయి. అంకారాలో జరిగిన నాటో సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ తనను హత్య చేసేందుకే ప్రధానంగా గురిపెట్టిందని, ఇరాన్ మొదటి లక్ష్యం తానేనని చెప్పిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమైన తర్వాత అమెరికా తిరిగి దాడులను పునరుద్ధరించింది. ఆ మరునాడే ట్రంప్ ఏ విమానంలో వెళుతున్నారో ఎవరికీ తెలియకుండా అంకారా నుండి రహస్యంగా తప్పించుకుని వాషింగ్టన్ చేరుకున్నారు. ట్రంప్ అంకారా నగరానికి ఖతార్ దేశం బహుమతిగా ఇచ్చిన బ్రహ్మాండమైన కొత్త బోయింగ్ విమానం 747–8 లో వెళ్ళారు. కానీ తిరిగి వెళ్ళేటప్పుడు పాత డొక్కు ఎయిర్‌ఫోర్స్–1 విమానం ఎక్కారు. జులై 8న ఈ దృశ్యాలు సిసి కెమెరా ఫుటేజీలలో రికార్డు అయ్యాయి. పాత్రికేయులు కూడా ఆయనతోపాటే ప్రయాణం చేశారు. ట్రంప్ తమతోపాటే ఆదేవిమానంలో లోపల క్యాబిన్‌లో ఉన్నారని పాత్రికేయులు, వారితోపాటు వైట్ హౌస్ అధికారులు కూడా భ్రమ పడ్డారు. కిటికీ తెరలు వేసుకోవాలని వారికి ఆదేశాలు వెళ్ళడంతో వారంతా అలాగే చేశారు. కానీ అసలైన ట్విస్ట్ ఏమిటంటే, ట్రంప్ అంకారాలో అసలు ఎయిర్‌ఫోర్స్–1 విమానం ఎక్కలేదు. విమానం ఎక్కినట్టు నటించారు. వెంటనే విమానం వెనుక నుండి విమాన తలుపు స్థాయి ఎత్తైన క్యాటరింగ్ మినీ లారీలోకి ట్రంప్ ఎక్కారు. ఈ క్యాటరింగ్ లారీ అక్కడి నుండి వెళ్ళిపోవడం కూడా కెమెరాల్లో రికార్డయింది. కానీ ట్రంప్ అందులో వెళ్తారని ఊహించలేదు. ఆయన రహస్యంగా అంకారాలోని ఫుడ్ డెలివరీ క్యాటరింగ్ ట్రక్కులో ఎక్కి వెళ్ళి దూరంగా ఉన్న చిన్న సైనిక విమానం సి–32 ఎలోకి ప్రవేశించారు. ఇదేవిధమైన ఒక రహస్య ఆపరేషన్ 2000 సంవత్సరంలో బిల్‌క్లింటన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కూడా నిర్వహించారు. ఆయన కూడా ఇదేవిధంగా రహస్యంగా పాకిస్తాన్‌కు చేరుకుని అక్కడి నుండి అమెరికాకు వెళ్ళిపోయారు. ట్రంప్ కూడా సి–32ఎ సైనిక విమానం ఎక్కి రాత్రి 10:56 గంటలకు లండన్ చేరుకుని అక్కడ ఎయిర్ ఫోర్స్–1 విమానంలోంచి కిందికి దిగుతూ పాత్రికేయులకు కనిపించారు. అక్కడ సైనికులను కూడా పరామర్శించి కొన్నిరోజులు వారితో గడిపి ఆ తర్వాత ఖతార్ బహూకరించిన కొత్త విమానంలోనే తిరిగి అమెరికా బయలుదేరారు. ఐతే సి–32 ఎ విమానం నుండి తిరిగి ఎయిర్ ఫోర్స్–1 విమానంలోకి ట్రంప్ ఎప్పుడు ఎక్కారనే విషయం అన్నింటికంటే అతిపెద్ద రహస్యంగా మారింది. ఎయిర్‌ఫోర్స్–1 విమానం పాతబడిపోవడంతో అత్యాధునికమైన భారీ విమానాన్ని ఖతార్ ప్రభుత్వం ట్రంప్‌కు బహుమతిగా ఇచ్చింది. ఆ తర్వాత ఈ విమానానికి బాగా ఖర్చుపెట్టి ఆధునిక సౌకర్యాలు,అత్యాధునిక జామర్లు,సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నవీకరించారు. కానీ ట్రంప్ అంకారాలో పాత విమానం ఎక్కడంతో అంతర్జాతీయ మీడియాలో పెద్ద చర్చనీయాంశమైంది. ఆయన కొత్త విమానం వదిలేసి ఎందుకు పాత విమానం ఎక్కారు? అని గతనెలలో చర్చ జరిగింది. కానీ ఆయన ఈ రెండు విమానాలు ఎక్కకుండా మూడో విమానంలో ప్రయాణం చేశారు. దీనిపై ట్రంప్‌ను పాత్రికేయులు నిలదీశారు. ఎందుకు కిటికీ తెరలు వేసుకోవాలన్నారు అని ప్రశ్నించగా, ప్రమాదకరమైన విమానంలో ప్రయాణం చేస్తున్నందువల్ల అలా చేయమని చెప్పి ఉండవచ్చని వివరణ ఇచ్చారు. దీనిపై వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెంగ్ మాట్లాడుతూ, అమెరికాపై చాలామంది శత్రువులు కన్నువేశారని, అందువల్ల బెదిరింపులను ఎదుర్కోవడానికి తమకు అనుకూలంగా ఉన్న అన్ని సాధనాలను ఉపయోగిస్తామని చెప్పారు.




## అల్లర్లలో హతులైన కుటుంబాలకు ఇరాన్ నష్టపరిహారం చెల్లించాలి: ట్రంప్

### చర్చల్లో ఈ అంశం ప్రస్తావిస్తాం

**వాషింగ్టన్:** ఇరాన్‌లో గడచిన ఐదు దశాబ్దాలుగా జరిగిన ప్రభుత్వ వ్యతిరేక అల్లర్లలో మరణించిన లక్షలమందికి,గాయపడినవారికి మొజ్తాబా ఖమేనీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేశారు. గడచిన ఐదు నెలల్లో 52 వేలమంది మరణించారన్నారు. యుద్ధంలో మరణించిన వేలాదిమందికి, అమెరికా కోల్ నౌకపై దాడిలో మరణించినవారికి పరిహారం చెల్లించాలని కోరారు. గడచిన ఐదు నెలలుగా అమెరికా చేస్తున్న దాడులవల్ల జరిగిన నష్టానికి పూర్తి పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసిన నేపథ్యంలో ట్రంప్ తిరిగి ప్రకటన చేస్తూ ఇరాన్ ప్రభుత్వమే రు సాగించిన అణచివేత చర్యలకు గాను పరిహారం చెల్లించాలన్నారు. ఈ ఏడాది యుద్ధానికి ముందుగా 2025లో ఇరాన్‌లో ప్రజలు తీవ్ర అసంతృప్తితో వీధుల్లోకి వచ్చి తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును మొజ్తాబా ఖమేనీ తండ్రి అలీ ఖమేనీ ఐఆర్‌జిసి దళాల సహాయంతో హింసాత్మకంగా అణచివేశారు. ఈ అణచివేత చర్యల్లో వేలమంది హతులైనట్లు మానవహక్కుల సంఘాలు ప్రకటించాయి. అనేకమందిని అరెస్టు చేసి ఉరిశిక్షలు అమలు చేసే ప్రక్రియ మరోవైపు కొనసాగుతోంది. ఇరాన్‌లో అణచివేతకు గురైనవారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో ఇరాన్‌తో జరిగే చర్చల్లో ఈ అంశాన్ని కూడా ముందుకు తీసుకువస్తామని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. హోర్ముజ్ జలసంధి పూర్తిగా తెరచుకోవాలంటే ఆరు షరతులను అమెరికా ప్రభుత్వం ఒప్పుకోవాలని ఇరాన్ సర్వోన్నత నేత మొజ్తాబా ఖమేనీ రాజకీయ సలహాదారు జోల్ఫాగర్ ప్రతిపాదించారు. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేయాలని, యుద్ధంవల్ల జరిగిన విధ్వంసానికి నష్టపరిహారం చెల్లించాలని, షరతులు లేకుండా ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఆస్తులు విడుదల చేయాలని, భవిష్యత్తులో ఎప్పుడూ ఇరాన్‌ను బెదిరించకూడదని ప్రతిపాదించింది. దీనికి ప్రతిగా ట్రంప్ పైవిధంగా డిమాండ్ చేశారు.

### కుర్దిస్థాన్ వర్కర్స్‌పార్టీ రద్దు

## టర్కీ పార్లమెంటు చారిత్రాత్మక తీర్మానం



**అంకారా:** నిషేధిత కుర్దిస్తాన్ వర్కర్స్‌పార్టీ (పికెకె)ని రద్దు చేసేందుకు టర్కీ పార్లమెంటు చరిత్రాత్మకమైన తీర్మానం చేసింది. పదివేలమందికిపైగా ప్రాణాలు బలి గొన్న దశాబ్దాలనాటి సంఘర్షణకు ముగింపు పలికేందుకు వీలుగా టర్కీ పార్లమెంటు ఈ తీర్మానం ఆమోదించడం ద్వారా కీలకమైన ముందడుగు వేసింది. నిర్బంధ నేరాలకు పాల్పడిన మాజీ ఉగ్రవాదులకు ఎలాంటి శిక్షలూ పడకుండా ఈ చట్టంలో రక్షణలను కూడా పొందుపరిచారు. కొందరికి విధించిన జైలు శిక్షలు కూడా ఈ చట్టం ప్రకారం రద్దు అవుతాయి. 600 మంది ఎంపీల బలం ఉన్న టర్కీ పార్లమెంటులో 468 మంది చట్టసభ్యులు మద్దతుతో ఈ తీర్మానం చట్టరూపం దాల్చింది. 1978 నుండి 2025 వరకు టర్కీ అంతర్గతంగా కుర్దిస్థాన్ వర్కర్స్‌పార్టీ సాయుధ పోరాటంతో అతలాకుతలమైంది. కుర్దిస్తులు, కుర్దిస్థవాదులు కూడా పికెకెతో కలిసి ఈ పోరాటంలో పాలుపంచుకున్నారు. టర్కీ నుండి వేరుపడి ప్రత్యేక స్వతంత్ర్య కుర్దిస్థాన్ దేశాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఈ సాయుధ అంతర్యుద్ధం జరిగింది. ఈ పోరాటం ఎక్కువగా ఉత్తర కుర్దిస్థాన్‌లో జరిగినప్పటికీ దేశమంతటా విస్తరించింది. కానీ పికెకె మాత్రం 2010 నుండి తన వేర్పాటువాద డిమాండ్‌ను విరమించుకుంది. టర్కీలోనే కుర్దులకు స్వయంప్రతిపత్తి లేదా ప్రత్యేక రాజకీయ,సాంస్కృతిక హక్కులు కావాలని డిమాండ్ చేయడం ప్రారంభించింది. ఈ అంతర్గత యుద్ధం వల్ల టర్కీ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయింది.2024లో కొత్త శాంతి ప్రక్రియ చర్చలు ప్రారంభమయ్యాయి. ఆయుధాలు వదిలిపెట్టాలని పికెకె నాయకుడు అబ్దుల్ ఓకలాన్ తన సహచరులను కోరారు. సాయుధ పోరాటం విరమించి విడిపోతున్నట్లు పికెకె 2025 మే నెలలో ప్రకటించింది. ఆ తర్వాత టర్కీ అధ్యక్షుడు తయ్యప్ ఎర్డొగాన్ పికెకెకు రాయితీలు ఇస్తూ ఈ చట్టాన్ని తీసుకువచ్చారు.

# హౌతీలపై యెమెన్ ప్రభుత్వ దళాల దాడులు

**సనా:** హౌతీ ఉగ్రవాద దళాలపై యెమెన్ ప్రభుత్వదళాలు మంగళవారం క్షిపణులు,డ్రోన్లతో దాడులు చేశాయి. పశ్చిమాసియాలోని హోర్ముజ్ జలసంధిలో ప్రస్తుతం యుద్ధం ఆగిపోయినప్పటికీ తీవ్ర ఉద్రిక్తతలతో కూడిన ప్రశాంతత నెలకున్నప్పటికీ యుద్ధరంగం ఇప్పుడు ఎర్ర సముద్రంవైపు మళ్ళింది. ఇరాన్ మద్దతు గల హౌతీ సైన్యాలు సౌదీ అరేబియాపై యుద్ధం ప్రకటించడంతో కొత్త యుద్ధరంగానికి తెరలేచింది. హౌతీలు మొన్న చేసిన దాడిలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వ దళాలలోని నలుగురు సైనికులు సహా ఏడుగురు మరణించడంతో యెమెన్ ప్రభుత్వం ప్రతీకార దాడులు ప్రారంభించింది. ఈ దాడులు కొనసాగుతాయని ప్రకటించింది. మారిబ్ గవర్నరేట్‌లోని అల్–రధా పర్వతాలలో ఉన్న హౌతీల మోర్టార్ వ్యవస్థలు, ఆయుధ నిల్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకోగా, అల్–జౌఫ్ గవర్నరేట్‌లోని అల్–అలంలో ఉన్న హౌతీల శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుని వైమానిక బలగాలు దాడులు చేశాయి. అంతకుముందు మారిబ్ నగరంలో నివాసిత ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని హౌతీ దళాలు దాడులు చేశాయి. ఈ కారణంగా మారిబ్‌లో అనేక ప్రాంతాలలో పేలుళ్ళు సంభవించాయి. మోఖా ఓడరేవును లక్ష్యంగా చేసుకుని హౌతీలు క్షిపణి దాడులు చేశారు. హౌతీ ఉగ్రవాద సైన్యాలు–సౌదీ అరేబియా మధ్య 2015లో ఘర్షణ ప్రారంభమైంది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభం కాగానే ఇరాన్‌కు అనుకూలంగా యుద్ధరంగంలోకి దిగుతున్నట్లు హౌతీలు ప్రకటించారు. కానీ వెంటనే ఆ ప్రకటన ఉపసంహరించుకున్నారు. అమెరికాతో చర్చలు విఫలమై విసుగెత్తిపోయిన తర్వాత ఇరాన్ ఆదేశంతో హౌతీలు జులై 20వ తేదీన సౌదీ అరేబియాపై యుద్ధం ప్రకటించారు. ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియా చమురు నౌకలను,వాణిజ్య నౌకలను వెళ్ళకుండా అడ్డుకుంటామని ప్రకటించారు. ఆ తర్వాత సౌదీ నౌకలపై దాడిచేసి ముంచివేశారు.

**హోర్ముజ్ జలసంధిలో ప్రయాణం చేసింది ఆరు నౌకలే**

హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు దాదాపు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. సోమవారంనాడు కేవలం ఆరే ఆరు నౌకలు హోర్ముజ్ జలసంధిలో ప్రయాణం చేశాయని షిప్పింగ్ డేటా తెలియజేసింది. గడచిన పది రోజులలో 11 నౌకలు ప్రయాణం చేయగా, తాజా గణాంకాలు అత్యంత హీనస్థాయికి పడిపోయాయి. మంగళవారం తెల్లవారుజామున కూడా రెండు ఖాళీ ట్యాంకర్లు, నాలుగు సరుకు రవాణా నౌకలు జలసంధిలోకి ప్రవేశించాయి. అంటే దాదాపు ఇరాన్ అనుకున్నవిధంగా హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా దాడి చేయకముందు ఈ జలసంధిలో రోజుకు 140 వాణిజ్య నౌకలు రాకపోకలు సాగించేవి. ప్రపంచవ్యాప్తంగా అవసరమైన చమురు, గ్యాస్‌లో 20శాతం ఈ జలసంధి నుండే ప్రయాణం చేసేది. ఈ జలసంధి మూసుకుపోయిన తర్వాత ప్రపంచదేశాలలో తీవ్ర చమురు సంక్షోభం ఏర్పడింది. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేసేవరకూ జలసంధిలో నౌకల రాకపోకలు ఉండబోవని, జలసంధి మూసే ఉంటుందని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి సోమవారం మరోసారి ఉద్ఘాటించారు. తాము ప్రతిపాదించిన ఆరు డిమాండ్లు నెరవేరిస్తేనే హోర్ముజ్ తెరచుకుంటుందని, లేకపోతే ఎప్పటికీ మూసే ఉంటుందని ఇరాన్ ప్రకటించింది. మరోవైపు పరిస్థితులు అనుకూలించిన తర్వాత నౌకలను ఉమ్మడిగా నియంత్రించేందుకు వీలుగా ఇరాన్–ఒమన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. జలసంధిలోకి ప్రవేశించే నౌకలు ఇరాన్ ప్రాదేశిక జలాల నుండి, జలసంధి లోంచి మహాసముద్రంలోకి ప్రవేశించే నౌకలన్నీ ఒమన్ ప్రాదేశిక జలాలలోంచి ప్రయాణం చేసేవిధంగా ఒక కొత్త జలమార్గాలను ఏర్పాటు చేసేందుకు, మ్యాపింగ్ ను కూడా ఈ రెండు దేశాలూ సిద్ధం చేస్తున్నాయి. ఎర్ర సముద్రంలో అల్–మందేబ్ జలసంధి నుండి 25 నౌకలు మాత్రమే ప్రయాణం చేశాయి.

## ‘మూడు పబ్లిక్ స్కూళ్లు’

(మొదటి పేజీ తరువాయి)

ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ ఎండి గణపతి రెడ్డితో పాటు ఆరుట్ల, వంగూరు, పోల్కంపల్లి, మంచాల పాఠశాలల హెచ్‌ఎంలు, కాంట్రాక్టర్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నిధుల విడుదల, మౌలిక వసతులు, ఫర్నిచర్ తదితర అంశాలపై సమీక్షించారు. కొన్ని పనులకు సంబంధించిన నిధుల జాప్యం అంశంపైన కూడా చర్చించారు. పాఠశాలలకు అవసరమైన ఫర్నిచర్‌ను జైళ్ల శాఖ నుంచి సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. చర్లపల్లి, చంచల్ గూడ జైళ్లో ఖైదీలు తయారు చేసే ఫర్నిచర్‌ను టిపిఎస్ లకు ఉపయోగించుకోవాలని, దీనికి సంబందించి ప్రతి పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ వివరాలతో పూర్తి ఇండెంట్‌ను సిద్ధం చేయాలని హెచ్‌ఎంలను నవీన్ నికోలస్ ఆదేశించారు. నిధుల సమస్య కారణంగా పనులు నిలిచిపోకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని,తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయోగాత్మక ప్రాజెక్టులోని మూడు పాఠశాలల్లో మిగిలిన పనులను వేగవంతం చేసి, డిసెంబర్ గడువులోగా పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల అవసరాలకు అనుగుణంగా డెస్కులు, బెంచీలు, టేబుళ్లు, కుర్చీలు తదితర ఫర్నిచర్ అవసరాలను ముందుగానే గుర్తించి, ఇండెంట్‌ను సిద్ధం చేయాలన్నారు .

**సమన్వయంతో వ్యవహరిస్తాం:గణపతి రెడ్డి**

మూడు టిపిఎస్‌లలో ఇప్పటివరకు పూర్తయిన పనులకు సంబంధించిన ఎంబిల (మెజర్‌మెంట్ బుక్స్) నమోదు విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ ఎండి గణపతి రెడ్డి తెలిపారు. పనుల కొలతలు, రికార్డుల నిర్వహణ, బిల్లుల ప్రక్రియ తదితర అంశాల్లో సమన్వయంతో వ్యవహరిస్తామన్నారు.

## పోరాటమే స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలే దాని పతనానికి దారి తీస్తాయని అన్నారు. దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని అన్నారు. మహిళా రిజర్వేషన్ విషయంలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా దానికి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును జోడించి ఆమోదింపజేసుకోవడానికి కుట్ర పన్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలు అనేక మార్లు లీక్ అయి లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై, మహిళలపై అకృత్యాలు, దాడులు పెరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి,సీనియర్ రాష్ట్ర నాయకులు టి. వెంకట్రాములు, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి , జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా మెట్రో రైల్

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్ కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్2లో భాగంగా ఎంజిబిఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు.

డిసెంబర్ లో ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

డిసెంబర్ లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు కె.రామకృష్ణారావు, ఎన్ విఎస్.రెడ్డి, మెట్రో రైల్ ఎండి సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## 14న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 14వ తేదీన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆగస్టు 15వ తేదీన 3.34 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా పరిశీలనలో లేదని కేంద్ర జలశక్తి మంత్రి ఇటీవల ప్రకటించిన విషయం, శాసనసభ వర్షాకాల సమావేశాల నిర్వహణ తేదీల ఖరారు, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇంకా కొనసాగుతున్న వర్షాభావ పరిస్థితులు, సాగు, తాగు నాటి సమస్యలు, క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చర్యలు తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. మరోవైపు హైదరాబాద్ పాతబస్తీలో హైదరాబాద్ మెట్రో రైల్ రెండోదశ పనుల నిర్వహణ, పలు ప్రజా ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలనా అంశాలు, ప్రభుత్వ శాఖల వారీగా పనితీరు, పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరగనున్నట్లు సమాచారం.

## భూదాన్ భూముల పరిరక్షణపై చర్యలేంటి?

### హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లోని సర్వే నంబర్ 695లో ఉన్న భూదాన్ భూముల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్ర వివరాలు సమర్పించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సర్వే నంబర్‌లో 11.24 ఎకరాల భూదాన్ భూమి ఉండగా, అందులో 3.34 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చి నివాస లే అవుట్ అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ జంగం రమేశ్ గౌడ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. వ్యాపారవేత్త మల్లారెడ్డి భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. భూదాన్ భూములను నిషేధిత జాబితాలో చేర్చకుండా అధికారులు ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం రెవెన్యూ కమిషనర్, కలెక్టర్‌తోపాటు ప్రైవేటు ప్రతివాది మల్లారెడ్డికి నోటీసులు జారీ చేసింది. ముఖ్యకార్యదర్శి, సిసిఎల్‌ఎ, హెచ్‌ఎండిఎ తదితర ప్రతివాదులు మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## పోటాపోటీ నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు దురాగతాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని ఇండియా కూటమి ఎంపిలు డిమాండ్ చేశారు. మకర ద్వారం వద్ద నిరసనలు వెల్లువెత్తడంతో, ఇరు పక్షాల ఎంపిలు తమ తమ డిమాండ్లను ప్రదర్శించే ప్లకార్డులను పట్టుకుని ప్రతినినాదాలు చేశారు. ఎన్‌డిఎ కూటమి సమావేశమైన అనంతరం,ఆ కూటమికి చెందిన ఎంపిలు పార్లమెంట్ లైబ్రరీ నుంచి సభ ప్రధాన ద్వారమైన మకర ద్వారం వైపు ర్యాలీ చేస్తూ ‘రాహుల్ గాంధీ జవాబ్ దో’, ‘రాహుల్ గాంధీ భాగో మాత్’ తదితర నినాదాలు చేశారు. సోమవారం, దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న విద్యార్థుల నిరసనలపై హోం మంత్రి షాతో చర్చ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, సాధారణ అంశాలపై పార్లమెంటులో షా అభిప్రాయం దేశానికి అవసరం లేదని, నిరసన చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్లతో కాల్పులు జరపమని ఆయన ఆదేశించారా లేదా అని తెలుసుకోవాలనుకుంటున్నామని రాహుల్‌గాంధీ అన్నారు. అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల అపహరణ, ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌లపై నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసుల అతిక్రమణలకు నిరసనగా కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో సహా ప్రతిపక్ష ఎంపిలు జూలై 20న పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. జార్ఖండ్ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన సోమవారం తీవ్రరూపం దాల్చింది. అసెంబ్లీ వైపు మార్చ్‌ను నిరోధించేందుకు పోలీసులు నిరసనకారులపై వాటర్ కెనాన్లు ప్రయోగించి, లాఠీఛార్జ్ చేశారు.

## పరిశోధన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

విస్తరణ, పరిశోధన రంగంలో చేపట్టనున్న ప్రణాళికలపై చర్చించారు. సమావేశం అనంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు.

**200 మందికి ఉద్యోగాలు..**

జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న పరిశోధన, ఆవిష్కరణల కేంద్రం ద్వారా సుమారు 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇటీవల యామ్జెన్ హైదరాబాద్‌లో సుమారు 3 వేల మంది ఉద్యోగులతో అతిపెద్ద గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి) ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రపంచ స్థాయి ఔషధ, బయోటెక్నాలజీ సంస్థలు తెలంగాణపై విశ్వాసం వ్యక్తం చేయడం తమ ప్రభుత్వానికి గౌరవంగా భావిస్తున్నామని మంత్రి అన్నారు. లైఫ్ సైన్సెస్ రంగానికి తెలంగాణ కీలక వేదికగా మారడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కొత్త పరిశోధన కేంద్రంలో కల్పించే ఉద్యోగావకాశాల్లో తెలంగాణ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని యామ్జెన్ యాజమాన్యాన్ని శ్రీధర్ బాబు కోరారు. స్థానికంగా ఉన్న ప్రతిభావంతులైన యువతకు అంతర్జాతీయ స్థాయి పరిశోధన, ఉపాధి అవకాశాలు లభించేలా సంస్థ సహకరించాలని సూచించారు.

**లైఫ్ సైన్సెస్‌కు గ్లోబల్ హబ్‌గా తెలంగాణ..**

నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జెనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ తెలంగాణకు ప్రధాన బలమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కారణంగానే ప్రపంచంలోని ప్రముఖ లైఫ్ సైన్సెస్ సంస్థలకు తెలంగాణ కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని అన్నారు.

దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ సమస్యలు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. జెనోమ్ వ్యాలీలో కొత్త పరిశోధన కేంద్రం ఏర్పాటుతో తెలంగాణలో లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలకు మరింత ఊతం లభించనుంది. ఎంవోయూ కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సిఇఒ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

తన కార్యాలయంలో 22ఏ/పిఓబి అంశంపై మంగళవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ రోజు సాయంత్రంలోగా నాలుగు జిల్లాల సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించి, ఉన్నత స్థాయి భేటీలో తీసుకున్న నిర్ణయాలను తెలియజేసి, తక్షణమే అమలు చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజిని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంత్, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు హాజరయ్యారు.

**14వ తేదీలోగా డాక్యుమెంట్ల అప్‌లోడ్‌కు ఆదేశం**

భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జిఓలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ అనుమతులు తదితర పత్రాలన్నింటినీ ఈ నెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీని వల్ల నకిలీ డాక్యుమెంట్లకు చెక్ పడుతుందని, రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్లు నిజమైన, బోగస్ పత్రాలను సులభంగా గుర్తించగలుగుతారని చెప్పారు. పారదర్శకత కోసం పహాణీలను కూడా సబ్ రిజిస్ట్రార్‌లకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

**సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు కళ్లెం**

సబ్ రిజిస్ట్రార్‌లకు అదనపు విచక్షణాధికారాలు ఉండరాదని, ఆన్‌లైన్‌లో నమోదైన సమాచారం మేరకే నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, తప్పులు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిఓబి జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా, మూడు రోజుల వ్యవధిలో తిరస్కరణకు గల కారణాలను తెలియజేయాలని ఆదేశించారు. ఇకపై పిఓబి దరఖాస్తులను తహశీల్దార్‌ల ద్వారా కాకుండా నేరుగా కలెక్టర్‌లకే పంపాలని, కలెక్టర్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని సూచించారు.

**దరఖాస్తుల యుద్ధప్రాతిపదిక పరిష్కారానికి కలెక్టర్లకు సూచన:** సమస్య వచ్చాక పరిష్కరించడం కన్నా, సమస్య తలెత్తకుండా చూసే బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని మంత్రి శ్రీనివాస రెడ్డి అన్నారు. పిఓబి దరఖాస్తులను ప్రతిరోజూ కేసుల వారీగా సమీక్షించాలని, 22ఏ పేరుతో పేదలకు, అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజాకోణంలో నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పిఓబి జాబితాలను సమీకృతం చేయడం వల్ల సబ్ రిజిస్ట్రార్ల పరిశీలనలో కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్టు కనిపించి, మొత్తం రిజిస్ట్రేషన్ నిలిచిపోతున్నదని ఫిర్యాదులు వస్తున్నాయని, తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకుని నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

# భారత జట్టు అస్త్రం.. ఆ కుర్రాడే!



నాలుగు రోజుల్లో గాలేలో మ్యాచ్ ఉండడంతో... లంక బ్యాటర్లను నిలువరించే పేసర్ ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. ఈ నేపథ్యంలో శ్రీలంక దిగ్గజం పర్వేజ్ మొహరూఫ్‌తమ ఆటగాళ్లకు టీమిండియాలోని పొడగరి పేసర్ నుంచి ముప్పు ఉందని తెలిపాడు. వామప్ మ్యాచ్‌లో గెలుపొందిన భారత జట్టు టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతోంది. శ్రీలంక ఎలెవన్ బ్యాటర్ల ముందు తేలిపోయిన మన బౌలర్లు ఏ మేరకు రాణిస్తున్నారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరో నాలుగు రోజుల్లో గాలేలో మ్యాచ్ ఉండడంతో శ్రీలంక బ్యాటర్లను నిలువరించే పేసర్ ఎవరు? అనేది ఆసక్తి రేపుతోంది. ఈ నేపథ్యంలో శ్రీలంక దిగ్గజం పర్వేజ్ మొహరూఫ్ తమ ఆటగాళ్లకు టీమిండియాలోని పొడగరి పేసర్ నుంచి ముప్పు ఉందని తెలిపాడు. టెస్టు సిరీస్‌లో ఆ కొత్త బౌలరే శుభ్‌మన్ గిల్ సేనకు ప్రధాన అస్త్రం అవుతాడని మహరూఫ్ పేర్కొన్నాడు. టెస్టు సిరీస్‌లో ఓవైపు గాయాలు.. మరోవైపు శ్రీలంక ఎలెవన్‌పై భారీగా పరుగులిచ్చుకున్న బౌలర్లు.. భారత జట్టుకు సవాల్‌గా మారనున్నాయి. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో సిరాజ్ నేతృత్వంలోని టీమిండియా బౌలింగ్ దళం ఏమేర రాణిస్తుంది? అనేది చూడాలి. అయితే.. అరంగేట్రం నుంచి ఆకట్టుకుంటున్న గుర్నూర్ బ్రార్ టీమిండియా తరపు ముక్క అవుతాడని శ్రీలంక వెటరన్ పర్వేజ్ మహరూఫ్ అన్నాడు. 'పాత బంతితో బుమ్రా రివర్స్ స్వింగ్ రాబట్టగలడు. ఇప్పుడు అతడు దూరమవ్వడం భారత్‌కు ఎదురు దెబ్బే. దాంతో, టీమిండియా వికెట్ తీసే అవకాశాలపై ప్రభావం పడుతుంది. కానీ, సిరాజ్ మంచి బౌలరే. అయితే.. ఈ సిరీస్‌లో ఇండియాకు గుర్నూర్ బ్రార్ కీలకం కానున్నాడు అని నా అభిప్రాయం. అతడు బౌన్స్ రాబట్టగలడు. అతడిలో మంచి పేస్‌తో పాటు కసి కూడా ఉంది. కానీ, అతడు ఇంకా టెస్టులు ఆడలేదు. అయినా సరే .. లంక బ్యాటర్లను గుర్నూర్ ఇబ్బంది పెట్టగలడు. ఇక స్పిన్నర్ల విషయానికొస్తే.. జడేజా, కుల్దీప్.. సుతార్, సరాన్ష్‌లో ఒకరిని ఆడించే అవకాశముంది' అని మహరూఫ్ వెల్లడించాడు. ఆగస్టు 15న గాలే స్టేడియంలో ఆతిథ్య లంకను భారత జట్టు ఢీ కొట్టనుంది.

# అత్యాచారం కేసులో ఐపిఎల్ స్టార్ అరెస్ట్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ స్టార్ అభిషేక్ పొరెల్ అరెస్టయ్యాడు. అత్యాచారం కేసులో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఒ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అభిషేక్‌పై క్రిమినల్ కేసు పెట్టిన పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను లైంగికంగా లొంగదీసుకున్నాడని సదరు విద్యార్థిని అతడిపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఐపిఎల్‌లో మెరుస్తున్న మరో క్రికెటర్ అత్యాచారం కేసులో అరెస్టయ్యాడు. ఇప్పటికే యశ్ దయాల్ రేప్ కేసులో ఇరుక్కోగా.. బెంగాల్ క్రికెటరైన అభిషేక్ పొరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐపీఎల్‌లో తనపై అత్యాచారం చేశాడని, భయపెట్టాడని ఓ వైద్య విద్యార్థిని ఫిర్యాదు చేయడమే అందుకు కారణం. సదరు విద్యార్థిని ఫిర్యాదు మేరకు డుమ్ డుమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీ పోలీసులు అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. హుగ్లీ రూరల్ పోలీస్ ఎస్పి కున్వర్ భుషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు జూన్‌లో అభిషేక్‌పై ఫిర్యాదు చేసింది. 'గత మూడేళ్లుగా మేము రిలేషన్‌షిప్‌లో ఉన్నాం. నన్ను పెళ్లి చేసుకుంటానని అభిషేక్ నమ్మబలికాడు. తనకు న్యాయం చేయాలని ఆమె కోర్టును కూడా ఆశ్రయించింది. దాంతో, కోల్‌కతా హైకోర్టు క్రికెటర్ అభిషేక్‌ను అరెస్ట్ చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే.. అభిషేక్ మాత్రం తనకేం తెలియదని, ఆ అమ్మాయి చెబుతున్నదంతా కట్టు కథ అని కొట్టిపారేశాడు.

## క్రికెట్‌లో పోర్చుగల్..
# కెప్టెన్‌గా ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్



టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి ఆటలకు పాపులరైన పోర్చుగల్ క్రికెట్‌లోనూ రాణిస్తోంది. తొలిసారి టీ20 ప్రపంచకప్‌లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఆ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. తమ జట్టు వరల్డ్‌ప్ కలను నిజం చేసేందుకు ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ మోసెస్ హెన్రిక్స్ కెప్టెన్సీ అప్పగించింది. క్రికెట్ ఆట ఇప్పుడు ప్రపంచాన్ని చుట్టేస్తోంది. చైనా, ఒమన్, మలేషియా దేశాలు పలు లీగుల్లో రాణిస్తున్నాయి. ఈ దేశాలను అనుసరిస్తూ టీ20 ప్రపంచకప్ 2028 పోటీలకు సిద్ధమవుతోంది పోర్చుగల్. ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ మోసెస్ హెన్రిక్స్ సారథ్యంలోని 14 మందితో కూడిన బృందం ప్రపంచకప్ బెర్తు లక్ష్యంగా సాధన చేయనుంది. ఆసీస్ తరఫున హెన్రిక్స్ 4 టెస్టులు,16 వన్డేలు, 24 టీ20లు మాత్రమే ఆడాడు.మోసెస్ పుట్టింది పోర్చుగల్‌లోని ఓ ద్వీపంలో. అతడి చిన్నతనంలోనే వాళ్ల కుటుంబం ఆస్ట్రేలియాకు వలస వెళ్లింది. దాంతో, అతడు అక్కడే దేశవాళీ క్రికెట్ ఆడి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో ఆర్సీబికి ప్రాతినిధ్యం వహించాడు హెన్రిక్స్. యూరోపియన్ టీ20 లీగ్‌లో సైతం ఆడిన అనుభవం అతడి సొంతం. దాంతో, తమ ప్రాంతానికే చెందిన అతడికి కెప్టెన్సీ అప్పగించింది ఆ దేశ క్రికెట్ బోర్డు. ఆగస్టు14 నుంచి 20 వరకూ ఫిన్లాండ్‌లో జరుగనున్న టీ20 వరల్డ్‌ప్ యూరోప్ ప్రాంతీయ క్వాలిఫయర్ సీలో పోర్చుగల్ తలపడనుంది. గ్రూప్ బీలోని ఇజ్రాయేల్, జర్మనీ, గ్రీస్, చెచియాలను ఢీ కొట్టనుంది యూరప్ టీమ్. ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో 37వ స్థానంలో ఉంది పోర్చుగల్. పోర్చుగల్ స్క్వాడ మోసెస్ హెన్రిక్స్(కెప్టెన్), క్రెగ్ కచోపా, ఎడ్వర్డ్ ఫ్లెమింగ్, క్రిస్టోఫర్ డె ఫ్రీటస్, రాహుల్‌కుమార్ హష, సిరాజ్ ఉల్లాహ్ ఖాదీమ్, హర్దీప్ ఖుట్టాన్, జెరెమి మార్టిన్స్, ధవల్‌కుమార్ నొరోటమ్(వికెట్ కీపర్), జోర్డాన్ నెట్టో, కార్లోస్ నున్స్, సెబాస్టియన్ డి ఒలివీరా, ఉపెన్ షంటు, కామెరూన్ షెకిల్టన్.

## మహిళ
# ఆర్థిక స్వాతంత్ర్యమే కీలకం



దశాబ్దాలుగా మహిళల ఆర్థిక సాధికారత అంటే కేవలం సంపాదన, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం, వేతన వ్యత్యాసాన్ని తగ్గించడంగానే పరిగణించేవారు. ఇవన్నీ మహిళల అభ్యున్నతికి, అభివృద్ధికి ముఖ్యమే అయినప్పటికీ, డబ్బు సంపాదించడం వేరు, ఆర్థిక స్వాతంత్ర్యమనేది వేరు అనే అసలు సత్యాన్ని చాలా మంది విస్మరిస్తున్నారు. ఒక మహిళ ఉన్నత ఉద్యోగంలో ఉన్నప్పటికీ, తన ఆర్థిక నిర్ణయాలను వేరే వాళ్లపై ఆధారపడవచ్చు. ఉద్యోగ విరామం, కుటుంబ బాధ్యతలు, విడాకులు లేదా పదవీ విరమణ వంటి అనిశ్చిత సమయాల్లో ఈ ఆర్థిక పరిజ్ఞానం లేకపోవడం పెద్ద బలహీనతగా మారుతుంది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి బడ్జెట్ రూపకల్పన, అప్పుల నిర్వహణ, అత్యవసర నిధులు, బీమా, పన్నులు, వివిధ పెట్టుబడి మార్గాలపై మహిళలకు అవగాహన కల్పించడం అత్యవసరం.కేవలం సలహాలు లేదా ట్రెండ్స్ కాకుండా, నిపుణుల నేతృత్వంలో సాగే క్రమబద్ధమైన అభ్యాసం ద్వారా మహిళలు ఆత్మవిశ్వాసంతో ఆర్థిక నిర్ణయాలు తీసుకోగలరు. భవిష్యత్తులో మహిళల ఆర్థిక సాధికారత వారి సంపాదనపైనే కాకుండా, వారు తీసుకునే సరైన మరియు నమ్మకమైన నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, ఆర్థిక అక్షరాస్యతే మహిళలకు అసలైన శక్తి.

**మహిళల వేతనం లేని శ్రమను గుర్తించాలి**

ఎవరైనా చేసే పనికి గుర్తింపు, విలువ ఇవ్వాలి అన్నది బలమైన నైతిక సూత్రం. ఒక మనిషి గౌరవం అంటే అతను తన శారీరక, మానసిక సామర్థ్యాలను తన ఇష్టానుసారం వినియోగించుకునే హక్కు కలిగి ఉండటం, ఆ శ్రమ ఫలితాలను పొందే హక్కు కలిగి ఉండటంతో విడదీయలేనిది. బానిసత్వం మనకు ఎందుకు అమానుషంగా అనిపిస్తుందంటే, అది ఈ మౌలిక మానవ విలువలను ధ్వంసం చేస్తుంది. అయితే సమాజంలో ఒక పెద్ద వర్గానికి ఈ నైతిక ప్రమాణాలు వర్తించకుండా సాధారణ విషయంలా పక్కన పెట్టబడటం ఎలా సాధ్యమవుతో ంది? దానిపై ఎందుకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడం లేదు? ఈ పరిస్థితిని ఎలా మార్చాలి? ప్రభుత్వం నిర్వహించిన 2024–25 లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, 16 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల 7 కోట్ల మంది పని చేసే వర్గంలో ఉన్నారు. వీరిలో 1.3 కోట్ల మందిని కుటుంబ సహాయక కార్మికులుగా వర్గీకరించారు. వీరు మార్కెట్ కోసం గానీ, కుటుంబ వినియోగం కోసం గానీ వస్తువులు, సేవలు ఉత్పత్తి చేసే పనుల్లో పాల్గొంటారు. కానీ వారికి వ్యక్తిగతంగా జీతం లేదా లాభం రూపంలో ప్రతిఫలం ఉండదు. ఆ 1.3 కోట్ల మందిలో 80 లక్షల మంది మహిళలే. అయితే ఈ సంఖ్య కూడా మహిళల ఉత్పాదక శ్రమను తక్కువగానే అంచనా వేస్తోంది. ఎందుకంటే ఈ గణాంకాలు కుటుంబ స్థాయిలో అడిగిన ప్రశ్నలపై ఆధారపడుతున్నాయి. ఈ వ్యక్తి పని చేస్తున్నాడా? అనే ప్రశ్నకు కుటుంబాలు, కొన్ని సందర్భాల్లో మహిళలే కూడా 'లేదు' అని సమాధానం చెబుతుంటారు. కానీ అదే సర్వేలో కుటుంబ సభ్యులందరూ పంటలు, పశుపోషణ, కట్టెల సేకరణ వంటి నిర్దిష్ట ఉత్పాదక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారా? అని అడిగితే, మరో 2.4 కోట్ల మంది తమను కార్మికులుగా గుర్తిస్తారు. అందులో 2 కోట్ల మంది మహిళలే. అంటే 16 నుండి 60 ఏళ్ల మధ్య వయస్సు గల 2.8 కోట్ల మహిళలు వేతనం లేకుండా లేదా లాభం లేకుండా ఉత్పాదక ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్నారు. ఇది ఒక్కటే కాదు. లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, 16 ఏళ్లు దాటిన సుమారు 5.1 కోట్ల మహిళలు పిల్లలు, వృద్ధుల సంరక్షణ, వంట, శుభ్రత వంటి వేతనం లేని సంరక్షణ పనులు చేస్తున్నారు. మహిళలు వారానికి సగటున 16.1 గంటలు ఈ పనులపై ఖర్చు చేస్తుంటే, పురుషులు కేవలం 2.6 గంటలు మాత్రమే వెచ్చిస్తున్నారు. మహిళలు వ్యవసాయం, పశుపోషణ, అనధికార రంగాలలో చేసే వేతనం లేని పనికంటే కూడా సంరక్షణ పని మరి ంత కనిపించనిదిగా మిగిలిపోతుంది. ఈ పనులన్నింటికీ రెండు సాధారణ లక్షణాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు మహిళలు ప్రధానంగా నిర్వహిస్తున్న వేతనం లేని ఉత్పాదక, సంరక్షణ పనులను గుర్తించి వాటికి లెక్కలు వేయాలనే అభిప్రాయం పెరుగుతోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) పని అనే నిర్వచనంలో జీతం లేదా లాభం కోసం చేసే ఉపాధితో పాటు, కుటు ంబ వినియోగం కోసం జీతం లేకుండా వస్తువుల ఉత్పత్తినీ చేర్చింది. ఐక్యరాజ్య సమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ 5.4 ప్రకారం, ప్రభుత్వాలు ప్రజా సేవలు, మౌలిక సదుపాయాలు, సామాజిక రక్షణ విధానాల ద్వారా వేతనం లేని గృహ, సంరక్షణ పనులను గుర్తించి విలువ ఇవ్వాలి. అలాగే కుటుంబ బాధ్యతలను సమానంగా పంచుకునే విధానా zలను ప్రోత్సహించాలి. ఇంటిని నడిపే పని లేకపోతే ఆర్థిక వ్యవస్థ ఒక్క రోజు కూడా నిలబడదు. కానీ స్టాక్ మార్కెట్‌లో ఎవరో బటన్ నొక్కితే ఉత్పాదకత, ఇంట్లో ఒక మహిళ పది మందిని చూసుకుంటే సహజ బాధ్యత. నాగరికతకు పునాది వేసిన పనిని కనిపించనట్టుగా నటించడం కూడా ఒక సామూహిక కళే.

# అత్యంత వృద్ధురాలు తనాకా



కేన్ తనాకా ప్రపంచంలో అత్యంత ఎక్కువ కాలం బతికిన మహిళగా రికార్డు సృష్టించింది. 1903 జనవరి 2న జపాన్‌లోని ఫుకుయోకాలో జన్మించిన ఆమె, 2019లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరును నమోదు చేసుకోగలిగింది. 2022 ఏప్రిల్ 19న ఆమె తన 119 ఏళ్ల, 107 రోజుల వయసులో మరణించింది. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైన 1914లో ఆమెకు 11 ఏళ్లు, రెండో ప్రపంచ యుద్ధం మొదలైన 1939లో 36 ఏళ్లు. 1977లో 'స్టార్ వార్స్' విడుదలైనప్పుడు 74 ఏళ్లు, 2020లో కొవిడ్ మహమ్మారి ప్రారంభమైనప్పుడు 117 ఏళ్లు. ప్రపంచం ఎదుర్కొన్న మూడు భయానకమైన అనుభవాలను ప్రత్యక్షంగా చూసిన ఘనత తనాకాకు దక్కుతుంది. సానుకూల దృక్పథం, సరళ జీవన విధానం ఆమె దీర్ఘాయుష్షుకు దోహదపడిందని అంటారు. అంతేగాక, జన్యువులు, ఆహారం, ఆరోగ్య సంరక్షణ, జీవన పరిస్థితులు వంటి అనేక అంశాలు కూడా ఆమె దీర్ఘాయుష్షను నిర్ణయించి ఉండవచ్చు. ఏదిఏమైనా ఆమె జీవితం ప్రేరణాత్మకం.

# 'అగధ' ఓ మిస్టిక్ డివైన్ థ్రిల్లర్

## చిత్రాన్ని మెచ్చుకున్న మహేష్ ,ప్రభాస్ :దర్శకుడు ఎం.ఎస్. రాజు



శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కెఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్ కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని 14న భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు దర్శకుడు ఎం.ఎస్. రాజు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. 'అగధ' అని టైటిల్ పెట్టగానే చాలా మంది నెట్‌లో సర్చ్ చేశారు. 'అగధ' అంటే లోతైన అంశం, ఓ శూన్యం అని చెప్పుకోవచ్చు. మనం దేవుడిని, దెయ్యాలను కంటితో చూడలేదు. అలాంటి ఫోర్స్‌లకు మధ్య జరిగే కథ 'అగధ'. ప్రస్తుతం సినిమాకి ఓపెనింగ్స్ తీసుకు వచ్చేది యూత్, మాస్ ఆడియెన్స్. ఆ తర్వాత మౌత్ టాక్‌తో ఫ్యామిలీ ఆడియెన్స్ బయటకు వస్తారు. అన్ని రకాల అంశాలు 'అగధ'లో ఉంటాయి. దేవుడికి వ్యతిరేకంగా పని చేసే ఓ దుష్ట శక్తిని 'అగధ' అన్నట్టుగా చూపించాను.'అగధ' కోసం చాలా రీసెర్చ్ చేశాను.. ప్రస్తుతం ఉన్న తరాన్ని అట్రాక్ట్ చేసేలా దుష్టశక్తి మీద ఓ సినిమాని తీయాలని అనుకుని 'అగధ' చేశాను. కేవలం సింగిల్ స్క్రీన్స్ కాదు మల్టీప్లెక్స్ ఆడియెన్స్‌ని కూడా ఆకట్టుకోవాలని అనుకున్నాను. ఈ చిత్రాన్ని నిజాయితీతో తెరకెక్కించాను. 'ఆట', 'మస్కా' మంచి చిత్రాలు. కమర్షియల్‌గా విజయాలు అందుకున్నాను. కానీ నా స్టాండర్డ్‌లో లేవు అని చాలా మంది అన్నారు. ఆ తర్వాత మా అబ్బాయి కెరీర్ మీద కూడా ఫోకస్ పెట్టాను. చాలా ఏళ్ల తర్వాత 'డర్టీ హరి'ని తీశాను.ఎం.ఎస్. రాజు ఎలాంటి జానర్‌లో అయినా కూడా సినిమా తీయగలడు అనే పేరు సంపాదించుకోవాలి. నాకు నచ్చిన ఆర్ట్ ఫిల్మ్ తీసే బదులు మంచి కమర్షియల్ సినిమాని తీయడానికే ఇష్టపడతాను.'అగధ'ని ముందు ఎవ్వరికీ ఇవ్వకూడదని అనుకున్నాం. ట్రైలర్ రిలీజ్ అయ్యాక చాలా మంది ఫోన్స్ చేశారు. కన్నడ నుంచి హోంబలే టీం సంప్రదించింది. గీతా ఆర్ట్స్, అన్నపూర్ణ స్టూడియో టీం నుంచి కొంత మంది వచ్చి సినిమాని చూశారు. ముందు ఇక్కడ సినిమాని రిలీజ్ చేసిన తర్వాత మిగతా భాషలలో విడుదల చేయాలని అనుకుంటున్నాను. అన్ని భాషల్లో డబ్బింగ్ పనులు పూర్తయ్యాయి. అరవై రోజుల తర్వాతే ఓటిటికి ఇస్తామని అన్నాను. నేను నా ఆర్టిస్టులందరితోనూ మంచి రిలేషన్ మెయింటైన్ చేస్తాను. 'అగధ' టీజర్, ట్రైలర్ చూసి మహేష్ బాబు నాకు వాయిస్ మెసెజ్ చేశారు. 'ఈ సారి కొడుతున్నారు సార్' అని మహేష్ అన్నారు. 'కొడుతున్నావ్ బావ' అని ప్రభాస్ అన్నారు. త్రివిక్రమ్ షూటింగ్‌లో ఉండగానే వెంకటేష్‌ని కలిశాను. ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. 'అగధ' రిలీజ్ అయిన తర్వాత ప్రీక్వెలా? సీక్వెలా? అన్నది చెప్తాను. ఈ మూవీకి ఆ స్కోప్ అయితే ఉంది. 'అగధ' ఓ మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ అని మాత్రం చెప్పగలను. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'అగధ' ఉంటుంది.

## రీల్

# 'సర్దార్ సర్వాయి పాపన్న' ట్రైలర్ ఆవిష్కరణ




బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన మూవీ 'సర్దార్ సర్వాయి పాపన్న'. ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్‌కె ఫిలింస్ ద్వారా 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తెలంగాణ ట్రాన్స్ పోర్ట్, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యం నెలకొల్పాలి, మన రాజ్యం మనమే పరిపాలించుకోవాలని పోరాటం సాగించిన ధీరుడు 'సర్దార్ సర్వాయి పాపన్న'. ఆయన కోటలను జయిస్తూ గోల్కొండ కోటదాకా వెళ్లిన ఆయన పోరాటం ఈ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. అలాంటి ధీరుడి చరిత్రతో వెంకటేష్ గౌడ్ సినిమా రూపొందించడం, ఆ సినిమాను రామకృష్ణ గౌడ్ రిలీజ్ చేస్తుండటం సంతోషకరం. 'సర్దార్ సర్వాయి పాపన్న' చరిత్రను పుస్తక రూపంలోనూ వెంకటేష్ గౌడ్ తీసుకొస్తుండటం అభినందనీయం. ఈ విధంగా చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. 'సర్వాయి పాపన్న' చరిత్ర భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలి. . ఈ నెల 18న ట్యాంక్ బండ్‌పై 'సర్దార్ సర్వాయి పాపన్న' విగ్రహం ఆవిష్కరిస్తున్నాం అన్నారు.డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఈ సినిమాను మా ఆర్కే ఫిలింస్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 21న 'సర్వాయి పాపన్న' 376వ జయంతి సందర్భంగా గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నాం అన్నారు. దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి గోల్కొండను ఏడు నెలలు పరిపాలించి, వాళ్ల కుయుక్తులకు ఆత్మబలిదానం చేసుకున్నట్లు చరిత్ర వెల్లడిస్తోంది. ఈ విరుడి చరిత్రను మా విజి మూవి మేకర్ బ్యానర్‌పై నా స్వీయ దర్శకత్వంలో రూపొందించాను. మా సినిమాను డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తన ఆర్కే ఫిలింస్ ద్వారా రిలీజ్ చేస్తుండటం సంతోషంగా ఉంది. ఈ నెల 21న తప్పకుండా థియేటర్స్‌లో చూడండి అన్నారు. డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ మాట్లాడుతూ 'సర్దార్ సర్వాయి పాపన్న' బహుజనుల కోసం పోరాడిన వీరుడు. ఆయన జీవిత చరిత్రతో సినిమా రూపొందడం సంతోషంగా ఉంది. ఆర్‌కె ఫిలింస్ డిస్ట్రిబ్యూషన్‌లో ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాలలో ఘనంగా విడుదల చేయబోతున్నాం అన్నారు.నిర్మాణ పర్యవేక్షకులు దీపక్ న్యాతి మాట్లాడుతూ ప్రజలకు పన్నుల భారం లేకుండా చేశాడు.ఆ ధీరుడిని చరిత్రను ఎంతో శ్రమకోర్చి వెంకటేష్ గౌడ్ తెరకెక్కించారు అన్నారు.

# 'శివగాడి జిందగీ' పాట రిలీజ్



ఐశ్వర్య సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై సింధు సూర్య నిర్మిస్తున్న నూతన చిత్రం 'శివగాడి జిందగీ'. సచిన్ రామ్ ప్రతాప్, హాసిని దేవరకొండ హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న ఈ చిత్రానికి వినయ్ రెడ్డి చందుపట్ల దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను నిర్మాత సురేష్‌బాబు లాంచ్ చేశారు. కామెడీ, ఎమోషన్, డ్రామా, ఫ్రెండ్‌షిప్, లవ్ వంటి అన్ని రకాల వినోద అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఒక సామాన్య మనిషి తన జీవితంలో ఎదుర్కొన్న రకరకాల పరిస్థితులు, సంఘటనలు, భావోద్వేగాల సమాహారంగా ఈ చిత్రం సాగనుంది. ప్రతీ సన్నివేశానికి ఒక బలమైన కారణం, ప్రతీ పాత్రకు ఒక ప్రాధాన్యత, ప్రతీ ఎమోషన్‌కు ఒక అనుబంధం ఉండేలా దర్శకుడు ఈ కథను మలచడం విశేషం. ఈ కార్యక్రమంలోదర్శకుడు వినయ్ రెడ్డి చందుపట్ల, నిర్మాత సింధు సూర్య, సచిన్ రామ్ ప్రతాప్, హాసిని దేవరకొండ, రచన,దర్శకత్వం, సాహిత్యం: వినయ్ రెడ్డి చందుపట్ల, సంగీతం: సాయి , సినిమాటోగ్రఫీ: జెపి రెడ్డి, గాయని: పావని వాస పాల్గొన్నారు.

# సినిమా చూస్తున్నంతసేపూ మనసు బరువెక్కింది

## 'పళ్ళ బురుసు' ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున




అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. 'పళ్ళ బురుసు' ఆగస్టు 14న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకకు నాగర్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ అన్నపూర్ణ స్టూడియోస్‌కు ఇది 50వ సంవత్సరం. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో అద్భుతమైన చిత్రాలను నిర్మించాం. జాతీయ అవార్డులు అందుకున్న సినిమాలను కూడా రూపొందించాం. ఈ 50వ సంవత్సరం సందర్భంగా మా టీమ్ అంతా కలిసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. అందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్‌ను విస్తరించాం. మొన్ననే 'లెనిన్'ను రిలీజ్ చేశాం. ఇప్పుడు 'పళ్ళ బురుసు'ను విడుదల చేస్తున్నాం. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక' సినిమాను రిలీజ్ చేయబోతున్నాం. ఆ తర్వాత మరో రెండు సినిమాలు కూడా ఉన్నాయి. వీటితో పాటు నా 'కింగ్ 100' కూడా రాబోతోంది. కొత్త కథతో ఎవరైనా వస్తే అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించడానికి సిద్ధంగా ఉంది. మా టీమ్‌కు కథ నచ్చితే, నేను తప్పకుండా కథ వింటాను. పళ్ళ బురుసు నేపధ్యానికి సంబంధించిన చక్కని కథ.14 మా అమ్మగారి పుట్టినరోజు అందుకే రిలీజ్ చేస్తున్నాము అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో నిర్మాత వివేక్ కృష్ణాణి, నిర్మాత సుప్రియ యార్లగడ్డ, డైరెక్టర్ ఉదయ్ చౌహాన్ , మురళీధర్ గౌడ 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి , ప్రజ్వల్ , గోమతి , మ్యూజిక్ డైరెక్టర్ పవన్ సిహెచ్ , లిరిసిస్ట్ సురేష్ గంగుల పాల్గొన్నారు.

## నూతన నటీనటులతో
# 'ఆఫ్టర్ ఇంజనీరింగ్'



రాస్రా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం ఆఫ్టర్ ఇంజనీరింగ్. రాస్రా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నూతన నటీనటులను పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న రాజు బొనగాని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పాటలు రికార్డింగ్ జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. త్వరలోనే చిత్రానికి సంబంధించిన పూర్తి అప్డేట్ వెల్లడిస్తామని దర్శకుడు రాజు తెలిపారు. ఆఫ్టర్ ఇంజనీరింగ్( థిస్ ఈజింట్ జస్ట్ మై స్టోరీ, ఇట్స్ అవర్ స్టోరీ ) ఇది నా స్టోరీ మాత్రమే కాదు మన అందరి స్టోరీ అనే శీర్షికతో వస్తున్న ఈ చిత్రం యూత్ ని ఆకట్టుకుంటుందని డైరెక్టర్ రాజు బొనగాని తెలిపారు. రాస్రా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో ఈ చిత్రం రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని వివరాలను త్వరలోనే ఒక ప్రత్యేక ఈవెంట్ ను ఏర్పాటు చేసి తెలియజేస్తామని డైరెక్టర్ రాజు బోనగాని పేర్కొన్నారు.



## సైబర్‌మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సైబర్‌మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై కృషి చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. మంగళవారం సూర్యాపేట డివిజన్ స్థాయి పోలీస్ అధికారుల నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో నమోదైన కేసుల తీరుతెన్నులు, పోలీస్ దర్యాప్తు, కేసుల పురోగతి స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబటులో ఉండి పనిచేయాలని స్పష్టం చేశారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రణాళికతో పని చేస్తూ కృషి చేయాలన్నారు. మహిళల భద్రతలో ప్రాధాన్యంతో పనిచేసి బాధితులకు త్వరగా సేవలు అందించాలని కోరారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, కేసులు ఏమాత్రం పెండింగ్‌లో ఉండవద్దని అధికారులకు అదేశించారు. డిఎస్‌పిలు, సిఐలు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్ పనితీరుపై, సిబ్బంది విధి నిర్వహణపై నిరంతర క్షేత్ర స్థాయి పర్యవేక్షణ ఉంచాలని, సిబ్బందిని ఎప్పటికప్పుడు మోటివేషన్ చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐ లు వెంకటయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్‌రావు, రాజశేఖర్, డివిజన్ ఎస్‌ఐలు, టెక్నికల్ టీం ఎస్‌ఐ రాజశేఖర్, డిఎస్‌ఆర్‌బి ఎస్‌ఐ ఝాన్సీరాణి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సునంద రైస్‌మిల్లుపై కేసు నమోదు

బాధ్యులపైనా కేసు... రిమాండ్‌కు తరలింపు




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల కేంద్రంలోని సునందరైస్‌మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 8వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వల్లో తేడాలు గుర్తించినట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ.22 కోట్ల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. టాస్క్‌పోర్స్ అధికారులు శుక్రవారం మిల్లులపై దాడులు నిర్వహించారు. అనంతరం శనివారం సివిల్ సప్లై అధికారులు మిల్లుల్లో తనిఖీలు చేపట్టి వివరాలను పరిశీలించారు. తనిఖీల ఆధారంగా కేసు నమోదు చేసిన అధికారులు తదుపరి చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో మిల్లు పార్ట్‌నర్లుగా ఉన్న కస్తూరిసునంద, అవినాష్, ఆకాష్, అలాగే అకౌంటెంట్ ఇంజమూరి గౌతమ్ లపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. సోమవారం వారిని రిమాండ్‌కు తరలించి జైలుకు పంపినట్లు తెలిసింది. కాగా కేసు నమోదు కాకుండా ఉండేందుకు మిల్లుకు సంబంధించిన వ్యక్తులు పెద్ద ఎత్తున పైరవీలు చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతుంది. అయితే పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

## నేడు చింతపల్లిలో సిపిఐ పాదయాత్ర



**ప్రజాపక్షం/చింతపల్లి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 9న నియోజకవర్గంలో ప్రారంభమైన సిపిఐ పాదయాత్ర నేడు చింతపల్లి మండలంలో పర్యటించునట్లు మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదిగిరిరావు తెలిపారు. మంగళవారం యాదగిరిరావు విలేకరులతో మాట్లాడుతూ నేడు పెరుగుతున్న నిరుద్యోగం, భరించలేని ద్రవ్యోల్బణం, విస్తరిస్తున్న అసమానతలు, బలహీనపడిన గ్రామీణ వ్యవస్థ, కుంచుంచుకుపోతున్న ప్రజాస్వామ్యం పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తలను ఎదుర్కొంటుందని మోడీ ప్రభుత్వం వైపల్యాలను దాచడానికి ద్వేశాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.. సెప్టెంబర్ 1న న్యూఢీలిలోని రాంలీల మైదానంలో జరిగే బద్లావ్ జరూరీ హై మార్పు అవసరం ర్యాలీతో ఈ నెల 9 నుండి 14 వరకు దేశ వ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రలు ముగుస్తాయని, మార్పు కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, వేముల బుచ్చయ్య, వింజమూరు నరసింహ, గుండ్లపల్లి ఇద్దిరాములు, యాచారం శ్రీశైలం, మల్లోజు శేఖరాచారి, జోగు శ్రీరాములు, ఇస్లావత్ పాప, కొణిదల వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

## నందనం ఎంపియుపిఎస్ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి మండలం నందనం ఎంపియూపిఎస్ స్కూల్ లో టీచర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ మొలుగు లక్ష్మయ్య అన్నారు. పాఠశాలకు ఉపాధ్యాయులును కేటాయించాలని కోరుతూ సోమవారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డిఇవోకి గ్రామ ఉపసర్పంచ్ మొలుగు లక్ష్మయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల గురించి గత విద్యా సంవత్సరంలో మా యొక్క నందనం స్కూల్లో ఆరుగురు టీచర్లు ఉండేది ఒక టీచరు హార్ట్ ఎటాక్ తో చనిపోవడం ఇద్దరు టీచర్లు ట్రాన్స్ఫర్ కావడం ఒక టీచర్ రిటైర్మెంట్ కావడంతో మిగిలింది ఇద్దరూ టీచర్స్ ఉండడంతో విద్యార్థులకు ఇబ్బంది కాకూడదని విద్యా సంవత్సరం 2025/26నుండి ఒక వాలంటరీ టీచర్ను గ్రామపంచాయతీ ఇచ్చినది ఒక వాలంటరీ టీచర్ను గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ మొలుగు లక్ష్మయ్య ఏర్పాటు చెప్పారు. కానీ 2026/27 విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తికావస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వ టీచర్లను ఏర్పాటు చేయలేదు నాటి నుండి గ్రామపంచాయతీ వాలంటరీ టీచర్ను ఏర్పాటు చేసింది. కానీ మా స్కూల్1 నుండి ఏడవ తరగతి వరకు ఉన్నది కాబట్టి టీచర్లు లేక నానా అవస్థలు విద్యార్థులు పడుతున్నారు. మొత్తం విద్యార్థుల సంఖ్య 60 మంది ఉంటారు. కానీ ఇద్దరే ప్రభుత్వ టీచర్లు ఉండడంతో మ్యాస్ మరికొన్ని సబ్జెకట్స్ సంబంధించి టీచర్ లేకపోవడంతో విద్యార్థులకు ఇద్దరు టీచర్లకు విద్యా వ్యవస్థను నడపడానికి ఇబ్బందిగా ఉన్నది కాబట్టి నందనం స్కూల్‌కు ఇద్దరు టీచర్లను ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మట్ట శంకర్ బాబు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగ ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటమే సిపిఐ లక్ష్యం

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/గుండాల:** బిజెపి అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి సూచించారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాత మంగళవారం గుండాల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరుగుతుందని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి ప్రజా సమస్యల పరిష్కారానికై ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదని, ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మాయ చేశారని, కార్మిక సమస్యలు, రైతు సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం గాలికివదిలేసిందని ఎద్దేవా చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర మాట్లాడుతూ రైతులకు 18 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, నవాబ్ పేట రిజర్వాయర్ నుండి ప్రతి చెరువు, కుంటలను నింపాలని, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శి రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు దయాకర్‌రెడ్డి, బక్కయ్య, శ్రీను, ఆంజనేయులు, స్వామి, శ్రీశైలం, వెంకటయ్య, చంద్రయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన బిజెపి : పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ఘనత బిజెపి ప్రభుత్వం దని సిపిఐ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాత మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రామ భక్తులమని చెప్పుకునే మోడీ, అమీత్ షాలు తమ బిజెపి పాలనలో రామునికి రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, మండల కార్యదర్శి జి. వెంకటేశ్వర రెడ్డి, సహాయ కార్యదర్శి శేఖరాచారి, సోమ్లానాయక్, మైనోద్దిన్, వెంకటరమణ, సుదర్శన్ రెడ్డి, కనకాచారి, శైలేష్, నూనె రామస్వామి, చరణ్‌రెడ్డి, రంగారెడ్డి, జయరాములు, వీర స్వామి పాల్గొన్నారు.






## తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలో మహమ్మదాబాద్ గ్రామంలో మల్లేపల్లి ప్రముఖరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిమ్మల రామ చంద్రయ్య మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తేనెటీగల పెంపకాన్ని వ్యవసాయ శాఖ అధికారి P.వెంకట రమణా రెడ్డి సందర్శించి రాష్ట్ర స్థాయి కార్యక్రమం రైతు నేస్తం కార్యక్రమంలో తేనెటీగల పెంపకం పై వివరించారు. తేనెటీగల పెంపకం రైతులకు వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయాన్ని అందించే మంచి అనుబంధ ఉపాధి అని తెలిపారు. తేనె ఉత్పత్తితో ఆదాయం పొందడమే కాకుండా, తేనెటీగల ద్వారా పంటల్లో పరాగసంపర్కం మెరుగై పంట దిగుబడి, నాణ్యత పెరగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. మిత్ర ఫౌండేషన్ రైతులకు తేనెటీగల పెంపకంపై అవగాహన, నిర్వహణ పద్ధతులు మరియు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ ప్రోత్సహిస్తోంది. రైతులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంతో పాటు తేనెటీగల పెంపకాన్ని చేపట్టి అదనపు ఆదాయం పొందాలని సూచించారు. వ్యవసాయ అధికారినీ బి.పూజ, వ్యవసాయ విస్తరణ అధికారి కె.రాజేష్, పుట్టపాక మాజీ సర్పంచ్ మాధవ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తాం

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/గట్టుప్పల/చండూరు :** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించి యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.మంగళవారం గట్టుప్పల మండల ఏఐవైఎఫ్ మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దేశంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల ఉపాధి అవకాశాలు మరింత తగ్గుతున్నాయని ఆరోపించారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని,నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ నెల13న మునుగోడులో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ జిల్లా 15వ మహాసభలను నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యువత సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను మహాసభలో రూపొందిస్తామని తెలిపారు.మహాసభకు ఎస్‌కె షరీఫ్ అధ్యక్షత వహించగా సిపిఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్,మాజీ ఎంపీటీసీ కంపె దుర్గయ్య,ఏఐవైఎఫ్ నాయకులు కందాల నాగరాజు,పెరమళ్ల నరేష్, చింతకాయల వెంకటేష్,దోటి రాజు,శివరాత్రి సామేలు,గుత్తి నిఖిల్,రావుల రాకేష్,లక్ష్మయ్య, ముత్యం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు సాగు చేయండి

పొలాల్లోకి దిగిన కలెక్టర్

రైతులతో మాట- పంట మార్పిడిపై రైతులకు దిశానిర్దేశం



**ప్రజాపక్షం/ఆత్మకూర్‌ఎస్/నూతన్‌కల్/ మద్దిరాల:** వాతవరణం మారుతుంది. నీళ్ల తగ్గుతున్నాయి, అందుకే తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే ఆరుతడి పంటల వైపు మళ్లండని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ రైతులకు సూచించారు. మంగళవారం జిల్లాలో నిర్వహిస్తున్న రైతులతో మాటపంట మార్పిడికి బాట కార్యక్రమంలో భాగంగా ఆయన ఆత్మకూర్ ఎస్, మద్దిరాల, నూతన్‌కల్ మండలాల్లో పర్యటించారు. స్వయంగా వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి రైతులతో ముచ్చటించారు.

**జర్బరా సాగు బాగుంది**

ఆత్మకూర్ ఎస్ మండలంలోని వీరారెడ్డి, సందీప్‌రెడ్డి పొలాల్లో సాగవుతున్న పెసర, బంతి తోటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తుమ్మలపల్లి గ్రామంలో రైతు సౌనయ్య సాగు చేస్తున్న జర్బరా పూల 'పాలీహౌస్'ను చూసి అభినందించారు. వరికి బదులు ఇలాంటి కొత్త రకం పంటలు వేయడం వల్ల ఆర్థికంగా మంచి లాభాలు ఉంటాయని చెప్పారు. కంది, బొబ్బెర్లు, వేరుశనగ, మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, కూరగాయలు పండిస్తే తక్కువ కాలంలోనే చేతికి డబ్బులొస్తాయని వివరించారు.

**అంతర పంటలతో అదనపు ఆదాయం**

మద్దిరాల మండలం పొల్లుమల్లలో రైతు ఎల్లు వెంకటరెడ్డి ఆయిల్ ఫామ్ తోటలో అంతర పంటగా పెసర వేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు. మిగిలిన భూముల్లో మిర్చిసాగు చేసుకోవాలని సూచించారు. నూతన్‌కల్ మండలంలో కొంద్ర వెంకటరెడ్డి, వినోద పొలాల్లో పత్తి, కంది, అంతర పంటలను చూసి సలహాలు ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగును తగ్గించుకోవాలని కోరారు.

**ఆయిల్‌పామ్ పెంపకమే లక్ష్యం**

జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగును ఒక ఉద్యమంలా చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులకు కలెక్టర్ అదేశించారు. కొత్తగా ఆయిల్‌ఫామ్ వేసే రైతులకు పూర్తి సమాచారం అందిచాలని, మండలంలో సక్సెస్ అయిన రైతుల విజయగాధలను ఇతరులకు వివరించాలని సూచించారు. పదిరోజుల పాటు నిర్వహించే రైతులతో మాట ప్రోగ్రామ్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న భూములను గుర్తించి ఆ రైతులను పంట మార్పిడి వైపు మళ్లించాలని అదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, విస్తరణ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



## కంటిచూపు పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజా పక్షం/నకిరేకల్ :** కంటి చూపుపై నిర్లక్ష్యం వద్దని 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు.మంగళవారం ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన, నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది నియోజకవర్గంలో వెయ్యి మందికి ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు చేయించినట్లు తెలిపారు. ఈ ఏడాది నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉచిత కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు అందిస్తామన్నారు.హైదరాబాద్ పుష్పగిరి ఆసుపత్రుల సౌజన్యంతో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉద్దీపన ఫౌండేషన్ అందిస్తున్న సేవలను పున్న కైలాష్ నేత కొనియాడారు.ప్రజలకు ఉపయోగపడేలా ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చామల శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,మున్సిపల్ మాజీ చైర్మన్ రజిత శ్రీనివాస్,లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి, గాజుల సుకన్య, గాధగోని కొండయ్య,మురారి శెట్టి కృష్ణమూర్తి,ఎడ్ల ప్రవీణ్,ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారాణి,ఉద్దీపన ఫౌండేషన్ కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో పరిశుభ్రతకే అధిక ప్రాధాన్యం

పంతంగి గ్రామాన్ని సందర్శించిన జెడ్‌పి సిఇఒ



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** గ్రామాల్లో పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని యాదాద్రిభువనగిరి జిల్లా పరిషత్ సిఈఓ శోభా రాణీ అన్నారు. మంగళవారం మండలంలోని పంతంగి గ్రామాన్ని సందర్శించారు.గ్రామంలో నిర్మాణం జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు.గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించి,ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనమహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించడానికి గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.గ్రామాల్లో ప్రజలు చెత్తను వీధుల్లో వేయకుండా చెత్త సేకరణ ట్రాక్టర్లలో వేయాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరిగతిన పూర్తి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని ఎఈ ని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీలత,గ్రామ సర్పంచ్ కాకి శ్రీలతసుందర్,కార్యదర్శి పద్మజ, హౌసింగ్ ఎఈ పవన్ కళ్యాణ్,ప్రధానోపాధ్యాయులు సత్యనారయణ తదితరులు పాల్గోన్నారు.

## సాగునీటిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వర్షాభావం వల్ల రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, ఖరీఫ్ సాగుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి రైతాంగాన్ని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న జరిగే కృష్ణా నది యాజమాన్య బోర్డు కేఆర్‌ఎంబీ సమావేశంలో రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులు, నికర జలాల గురించి స్పష్టంగా చర్చించాలని కోరారు. ఆల్మట్టి ప్రాజెక్టు 129 టీఎంసీల సామర్థ్యానికి గాను 124 టీఎంసీల నీరు చేరడంతో 90 వేల క్యూసెక్కుల నీటిని నారాయణపూర్ ప్రాజెక్టుకు వదులుతున్నారని తెలిపారు. 37 టీఎంసీల సామర్థ్యం గల నారాయణపూర్ నిండటంతో జూరాలకు 35 వేల క్యూసెక్కులు, అక్కడి నుండి 217 టీఎంసీల సామర్థ్యం కలిగిన శ్రీశైలం ప్రాజెక్టుకు 23 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని వివరించారు. శ్రీశైలంలో 182 టీఎంసీల నీరు చేరిందని, విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జునసాగర్‌కు 25 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారని తెలిపారు. శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు ద్వారా 30 వేల క్యూసెక్కుల నీటిని రాయలసీమకు పంపుతుండగా, డ్యాములన్నీ నిండిన తర్వాతనే సాగర్‌కు నీటిని విడుదల చేస్తామనడం అన్యాయమని మండిపడ్డారు. మిర్యాలగూడ ప్రాంతంలో వందలాది రైస్ మిల్లులు ఉన్నాయని, మిల్లులు నడవకపోతే వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోవడంతో పాటు బియ్యం ధరలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డబ్బీకార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, మంగారెడ్డి, పరశురాములు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో భార్యమృతి, భర్తపై కేసు నమోదు



**ప్రజాపక్షం/పెన్‌పహడ్:** కుటుంబ కలహాలు ఓ మహిళ ప్రాణాలను బలితీసుకున్నాయి. అనుమానంతో భర్తే ఆమెను దాడిచేసి మృతికి కారణమయ్యాడనే ఆరోపణలతో పెన్‌పహడ్ మండలంలో ఒక విషాద ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెన్‌పహడ్ మం డల పరిధిలోని నూర్జహన్‌పేట గ్రామానికి చెందిన బాణోతు రవి, అతని భార్య సునీత (36) మధ్య గత కొంతకాలంగా కుటుంబ విషయాలపై తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. భార్యపై అనుమానంతో రవి ఆమెను పలుమార్లు వేధించడమే కాకుండా బెదిరింపులకు గురిచేసేవాడని ఆరోపణలు న్నాయి. ఈ దారుణ ఘటనకు సంబంధించి స్థానికంగా మరో కిలక కోణం వెలుగులోకి వచ్చింది. గాజుల మల్కాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల ప్రమేయం వల్లే రవి, సునిత దంపతుల మధ్య వివాదాలు మరింత ముదిరాయని కొంతమంది గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆ ఇద్దరి పాత్రపై కూడా పూర్తి ఆధారాలతో నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు జరపాలని స్థానికులు కోరుతున్నారు. సోమవారం రాత్రి వీరి మధ్య వివాదం పెద్దదైంది. రాత్రి 7 గంటల సమయంలో భర్త తనతో గొడవ పడుతున్నాడని తనకు ప్రాణభయంగా ఉందంటూ సునిత సూర్యాపేటలో చదువుకుంటున్న తన కుమారుడు శ్రీశాంత్‌కు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేసింది. ఆ తర్వాత రాత్రి 9 గంటల ప్రాంతంలో గ్రామంలోని సిసిరోడ్డుపై రవి తన భార్యతో మళ్లీ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో ఆమెను కిందపడేసి మెడ, చాతి భాగాలపై బలంగా తొక్కడంతో సునిత అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయింది. గమనించిన పోరుగువారు వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తల్లి మరణవార్త విన్న కుమారుడు శ్రీశాంత్ ఆసుపత్రికిచేరుకుని తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాడు. అనంతరం తన తల్లి మృతికి కారణమైన తండ్రి బాణోతు రవిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పెన్‌పహడ్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సిఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో అన్ని కోణాల్లో నిశితంగా దర్యాప్తు జరుపుతున్నారు.

## ఎల్లమ్మతల్లి పుస్తెలు అపహరణ

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండల కేంద్రంలోని ఎల్లమ్మతల్లి దేవాలయంలో సోమవారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు విలువైన నగలు దోచుకెళ్లిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డం వీరయ్య, ఎనుమాముల మార్కెట్ కమిటీ డైరెక్టర్ కత్తి సంపత్ మరియు గ్రామస్తుల వివరాల ప్రకారం గత రెండు రోజుల క్రితం కొందరు గుర్తుతెలియని దుండగులు పథకం ప్రకారమే ఎల్లమ్మతల్లి దేవాలయంలో విద్యుత్ వైరును తీసివేయగా ఇదివరకు గమనించక పోవడంతో ఇదే అదునుగా గమనించిన దుండగులు సోమవారం రాత్రి సమయంలో ఎల్లమ్మ తల్లి గేట్‌ను పగుల కొట్టడమే కాకుండా తాళం పగులకొట్టి ఎల్లమ్మ తల్లి మెడలోని పుస్తెలను అపహరించుకెళ్లారు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.సురేష్ తెలిపారు. సంఘటనా స్థలంలో గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డం వీరయ్య మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి మెడలోని పుస్తెలు అపహరించిన దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కొండాపూర్ గ్రామంలో చోరీ

### మూడు తులాల బంగారం అపహరణ

**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండలంలోని కొండాపూర్ గ్రామంలో చోరీ జరిగింది. దానం సమ్మయ్య ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి సుమారు మూడు తులాల బంగారం ఆభరణాలను అపహరించారు. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీనితో గణపురం ఎస్ఐ బొరగల అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా చైతన్య ప్రచారయాత్రకు పిలుపు

**ప్రజాపక్షం/దేవరుప్పుల :** సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య ప్రచార యాత్ర మంగళవారం మండలంలో కొనసాగింది. మండల కార్యదర్శి ఎల్లయ్య ఆధ్వర్యంలో సింగరాజుపల్లి, సీతారాంపురం, కడవెండి, కామారెడ్డిగూడెం మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ప్రజా సమస్యలపై ప్రసంగించి, యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, జనగామ టౌన్ కార్యదర్శి చొప్పరి సోమయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, ఎల్లయ్య, ఎడ్ల సోమనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సభకు పటిష్ట ఏర్పాట్లు



హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ప్రజాపక్షం/పరకాల:** పరకాలలో ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం పరకాలలో సిఎం పర్యటన నేపథ్యంలో ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రతిపాదిత హెలిప్యాడ్ కోసం లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలాన్ని, సభా వేదిక, వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాలను పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రణాళికపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఏసీపీ సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్, కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిఎంహెచ్‌ఓ తనిఖీ



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ డిఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రాజారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో జరిగింది. మంగళవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఐ.ప్రకాష్‌తో కలిసి సందర్శించి రికార్డులను పరిశీలించిన అనంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారి అచార్యకు సూచించారు. సబ్ సెంటర్‌లో ఎఎన్‌ఎంలు అందుబాటులో ఉండి వ్యాక్సినేషన్ సరియైన సమయంలో అందే విధంగా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్యం అందించాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ,ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగే విధంగా పని చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## యాత్రను జయప్రదం చేయండి

### మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** కేంద్రంలోని బీజేపి మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ చేపట్టే ప్రజా చైతన్య ప్రచార యాత్రను జయప్రదం చయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే ప్రజా చైతన్య ప్రచార యాత్ర మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుండి 14 వరకు చేపట్టే ప్రజా చైతన్య ప్రచార యాత్రను జయప్రదం చేయాలని కోరారు. నిత్యావసర ధరలను పెంచుతూ పాలన కొనసాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, శ్రీనివాస్, రాష్ట్ర సమితి సభ్యులు సుగుణమ్మ, జిల్లా నాయకులు సోమయ్య, సక్రు, మధు, తదితులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలను పంపింగ్ చేయాలి

### 45 రోజుల పాటు 9 మోటార్లను నిరంతరాయంగా నడపాలి

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండ :** దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రానున్న 45రోజుల పాటు పూర్తి స్థాయి మోటార్ల ద్వారా గోదావరి జలాలను నిరంతరాయంగా లిఫ్ట్ చేసి రైతుల పంటలను కాపాడేందుకు సాగు నీరు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ చింతగట్టులోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఈ.ఎన్.సి రమేష్ ఆధ్వర్యంలో నీటి పారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సెప్టెంబర్‌లో వర్షాలు కురవకపోతే గోదావరిలో నీటి ప్రవాహం తగ్గే ప్రమాదం ఉందని కావున సమ్మక్క సారాలమ్మ బ్యారేజిని పూర్తి స్థాయిలో నింపి పెట్టుకోవాలని తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నుండి 20 టీఎంసిల నీటిని వాడుకునే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటి వరకు 5టీఎంసిలు మాత్రమే లిఫ్ట్ చేశామని ఇంకా 15టీఎంసిలు లిఫ్ట్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ చివరి వరకు పూర్తి స్థాయిలో 9మోటార్ల ద్వారా పంపింగ్ చేయడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. మొత్తం 9మోటార్లను నిరంతరాయంగా నడుపగలిగితే రోజుకు 2వేల క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేయగలమని దీంతో రానున్న 45రోజులలో 15టీఎంసిల నీటిని వాడుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు.ధర్మసాగర్ నుండి ఘనపూర్ వరకు టన్నెల్ పనులు పూర్తి అయినప్పటికీ ఇప్పటి వరకు టన్నెల్ వాడుకలోకి రాలేదని టన్నెల్ ను వెంటనే వాడుకలోకి తీసుకురావాలని అన్నారు.అలాగే అన్ని రిజర్వాయర్లలో వాటర్ లేవల్స్ మెయింటేన్ చేసేందుకు వర్కింగ్ మాన్యూవల్ రూపొందించాలని సూచించారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో రామప్ప, ధర్మసాగర్, ఘనపూర్ రిజర్వాయర్లు చాలా కీలకం అయినవి అని ఈ రిజర్వాయర్లలో లేవల్స్ మెయింటేన్ చేయడం చాలా ముఖ్యమని అన్నారు. దేవాదుల ఫేజ్ 3 ప్యాకేజీ 6 పనులు నత్త నడకన నడుస్తున్నాయని అన్నారు. ప్యాకేజీ6 ద్వారా 4నియోజకవర్గాలలో 78వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. వచ్చే యాసంగి వరకు పాలకుర్తి వరకు నీరు అందించే విధంగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. గండి రామారం ఎత్తిపోతల పథకంలో లిఫ్ట్ 2పనులు పూర్తి అయ్యాయని లిఫ్ట్ 1పనులు కొనసాగుతున్నాయని కానీ అనుకున్న విధంగా పనులు ముందుకు సాగడం లేదని అన్నారు. లిఫ్ట్ 1పనులు పూర్తి చేసి లిఫ్ట్ 3పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్టోబర్ చివరి నాటికి లిఫ్ట్ 1పనులు పూర్తి చేసి యాసంగికి రైతులకు సాగు నీరు అందించాలని తెలిపారు. ఆ దిశగా అధికారులు, కాంట్రాక్టర్లు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, సిఈ సుధీర్, ఎస్ఈలు సీతారాం, దర్శన్, డిఈలు, ఈఈలు, ఇతర నీటి పారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండలంలోని సీతారాంపురం గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారికి తదుపరి విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో పేకాటకు ఉపయోగించిన సెల్‌ఫోన్లు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని పోలీసులు కోరారు.

## కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరు

### వరంగల్ ఎంపి కడియం కావ్య విజ్ఞప్తి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (సిఏఎంపీఏ) నిధులు మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ వి. క్లెమెంట్ బెన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు.హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్కులో సింహాల ఎన్‌క్లోజర్, నైట్ షెల్టర్, హైనా, జాకల్, వైల్డ్‌డాగ్ ఎన్‌క్లోజర్లు, నైట్ షెల్టర్లు, సరీసృపాల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ అటవీ శాఖ ఇప్పటికే కేంద్ర జూ అథారిటీకి సమర్పించిందని ఎంపీ తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు సవరణలు చేసి డిజైన్లు, డ్రాయింగ్‌లు సమర్పించినందున వాటికి త్వరగా ఆమోదం ఇవ్వాలని కోరారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జూలాజికల్ పార్కులో జంతువుల సంరక్షణతో పాటు మొక్కల పెంపకం, పచ్చదనం అభివృద్ధి, పార్కు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఆధునిక పర్యవేక్షణ సదుపాయాలతో జంతువుల సంరక్షణ మరింత సమర్థంగా చేపట్టవచ్చని తెలిపారు. కాకతీయ జూలాజికల్ పార్కును వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ విద్య, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తే వరంగల్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయని ఎంపీ పేర్కొన్నారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేసిన విజ్ఞప్తులపై కేంద్ర జూ అథారిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ వి. క్లెమెంట్ బెన్ సానుకూలంగా స్పందించారు. కాకతీయ జూలాజికల్ పార్కు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వెల్లడించారు.

# సింగిల్ టీచర్ పాఠశాల ఉండకూడదు



విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

**ప్రజాపక్షం/జనగామ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి సందీప్‌కుమార్ ఝా ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ప్రవేశాలు, పెరిగిన పాఠశాలలో ఉపాధ్యాయులు సర్దుబాటు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పాఠశాలల తనిఖీలు తదితర అంశాలపై క్షుణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ విద్యార్థి సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు ఉండేలా వర్క్ అడ్జస్ట్‌మెంట్ పకడ్బందిగా చేపట్టాలన్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య అవసరానికి మించి ఉండగా మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొతర ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు. 'మిషన్ శిఖరం' కార్యక్రమం కింద జిల్లాలోని ప్రతి పాఠశాల పరిస్థితిపై స్పష్టమైన నివేదిక వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా పకడ్బందిగా రూపొందించాలని ఆదేశించారు. తరగతి గదులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతులు మరమ్మత్తులపై దృష్టి సారించాలన్నారు. ఈ సమీక్షలో విద్యాశాఖ ఏడి శ్రీనివాస్, జిసిడిఓ గౌసియాబేగంతో పాటు ఎంఇఓలు పాల్గొన్నారు.

**కలెక్టర్ ఆదేశాలతో మూడు రోజుల్లోనే గ్రామ సభలు పూర్తి**

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో మూడు రోజుల్లోనే గ్రామ సభలు నిర్వయించి వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన శాఖల సమన్వయంతో రైతులకు ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై వివరించడం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని తెలిపారు. గ్రామ సభల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై వివరించడం జరిగిందన్నారు. ఈ నెల 20వ తేదీ ఫ్రేం వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ అనే యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతాయన్నారు.



## సోలార్ పలకలు.. శిలాఫలకలయ్యాయి!

**ప్రజాపక్షం/నెక్కొండ :** ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ విద్యుత్ పథకం క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నెక్కొండ మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో గతంలో ఏర్పాటు చేసిన సోలార్ పలకలు ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి చేయాల్సింది పోయి శిథిలావస్థలో పడి ప్రభుత్వ పథకాల వైఫల్యానికి సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. పనికర గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ పలకల దుస్థితి ఇందుకు అద్దం పడుతోంది. ఒకప్పుడు పంచాయతీ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ అందించడంతో పాటు మహిళా సంఘాలకు మినీ బ్యాంకింగ్ సేవలు, మీ సేవ ద్వారా ధృవపత్రాల జారీ, ఇంటర్నెట్, వైఫై వంటి సేవలను గ్రామస్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు, కాంట్రాక్టర్లు చెప్పిన మాటలు ఇప్పుడు గత కాలపు హామీలుగానే మిగిలిపోయాయని స్థానికులు అంటున్నారు. గత పాలక వర్గాల కాలంలో చేపట్టిన పనుల్లో కొందరు కాంట్రాక్టర్లు, సంబంధిత సిబ్బంది మధ్య సమన్వయం లోపించిందని, పనుల నాణ్యత కంటే బిల్లుల చెల్లించుల పైనే దృష్టి పెట్టాలనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. నెక్కొండ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సోలార్ పరికరాలపై ప్రత్యేక సాంకేతిక పరిశీలన నిర్వహించి, పనిచేస్తున్నవి ఎన్ని.. మూలనపడ్డవి ఎన్ని.. వాటి కోసం ఎంత ప్రజాధనం ఖర్చయింది. నిర్వహణకు ఎంత నిధులు వెచ్చించారు. అనే వివరాలను బహిర్గతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 'సర్'లో ములుగు నియోజకవర్గం నెంబర్ 1

### 2.36 లక్షల మంది ఓటర్ల వివరాల పరిశీలన పూర్తి

### 2.09 లక్షల మంది వివరాల డిజిటలైజేషన్



**ప్రజాపక్షం/ములుగు :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయ్యిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు మంగళవారం తెలిపారు. జూన్ 25న ప్రారంభమైన ప్రక్రియలో భాగంగా తొలుత ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. జులై 1 నుండి ఆగస్టు 10 వరకు బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్ళి ఫారాలను సేకరించి, ఓటర్ల వివరాలను పరిశీలించి డిజిటలైజేషన్ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,36,970 మంది ఓటర్లు ఉండగా 2,09,128 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేశారు. ఇది మొత్తం ఓటర్లలో 88.25 శాతం, మరో 27,842 మంది మృతి చెందినవారు, 4,015 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 14,207 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళినవారు, 1,219 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారు. డిజిటలైజేషన్ పూర్తయిన 88.25 శాతం, అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన 11.75 శాతం కలిపి ఎన్యూమరేషన్ ప్రక్రియ నూరు శాతం పూర్తయినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బిఎల్ఓలను కలెక్టర్ అభినందించారు.

## నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం



ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**ప్రజాపక్షం/రాయపర్తి :** ప్రజలకు 24గంటల నిరంతర విద్యుత్ అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మైలారం గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో రూ.9లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ లైన్‌ను విద్యుత్ శాఖ అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ యశస్విని రెడ్డి మాట్లాడుతూ మైలారం గ్రామంలోని విద్యుత్ ఉప కేంద్రం నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ విద్యుత్ లైన్ ద్వారా గ్రామానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందుతుందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌళిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మైలారం గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని మౌళిక వసతులను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, సర్పంచ్ చిర్ర వేణు, తదితరులు పాల్గొన్నారు.

# విజయ పాల డెయిరీని తరలించొద్దు



సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ విజయ పాలడెయిరీ శిథిలావస్థకు చేరినందున కొత్త భవనం వెంటనే నిర్మించాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో గల ప్రభుత్వ విజయ పాల డెయిరీ తరలించే చర్యలు మానుకోవాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ మహబూబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విజయ పాల డెయిరీని తరలించే చర్యలను మానుకొని తక్షణమే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ భవనం నిర్మించి 25 సంవత్సరాలు అవుతున్నందున శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో వెంటనే నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేయాలని తెలిపారు. 10 టెస్టింగ్ మిల్క్ అనలైజర్ (మిషిన్)లను తక్షణమే డైరీలో ఏర్పాటు చేయాలని, 2 వేల లీటర్ కెపాసిటీతో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ కేవలం నేడు 300 లీటర్ల పరిమితమైందని అధికారులు తగు చర్యలు తీసుకొని గ్రామాల్లో పాల సేకరణ సెంటర్లను ఏర్పాటు చేయాలని, పాల రైతులను పాడి రైతులకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి పాల ఉత్పత్తిని పెంచాలని అన్నారు. 100 స్టెయిన్లెస్ స్టీల్ క్యాన్‌లను తక్షణమే డెయిరీలో ఏర్పాటు చేసి పాల ఉత్పత్తికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కలెక్టర్ తగు చర్యలు చేపట్టి నిధులు కేటాయించి విజయ డెయిరీని అభివృద్ధి చేయాలని అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వీరన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, పాల రైతు మారినేని మోహన్ రావు, కూరాకుల పాల్, మంద శంకర్, అల్లి వేణుగోపాల్ రెడ్డి, గార రవిచంద్రబోస్, తండ శ్రీనాథ్, నక్క నాగార్జున, డొనికేని రమేష్, నూకల సాయి, గుంటోజూ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నీళ్లు ఇచ్చే వరకూ పోరాటం

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ :** చలి వాగు ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేసి నియోజకవర్గ రైతులను, పంట పొలాలను ఆదుకోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి డిమాండ్ చేశారు. చలివాగు ప్రాజెక్ట్ నుండి నీటిని విడుదల చేయాలని కోరుతూ, రేగొండ మండలం పరకాల భూపాలపల్లి జాతీయ రహదారిపై చెన్నాపురం ఎక్స్ రోడ్ వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలం, జోగంపల్లి గ్రామంలోని చలివాగు ప్రాజెక్ట్, పంపుహౌస్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివాగు ప్రాజెక్ట్ తూములు లేపి నీళ్లు వదిలి, ఆయకట్టు ప్రాంత పంట పొలాలకు నీళ్లు ఇయ్యాలని చెప్పి, దాదాపుగా మేము 15, 20 రోజుల నుంచి అడుగుతున్న ఈ ప్రభుత్వానికి చలనం లేదని, చీమ కుట్టినట్టు కూడా కావడం లేదని అన్నారు. ఇక్కడి నుంచి మోటార్ల వేసి పైకి నీళ్లు తీసుకుపోతున్నారు, మా పంట పొలాలకు నీళ్లు ఇస్తలేరు కాబట్టి మా రైతులందరూ కూడా ఈరోజు తీవ్రమైనటువంటి మనోవేదనలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష

### ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక దృష్టి : ఎస్పి సిరిశెట్టి సంకీర్త్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉండి నిష్పక్షపాతంగా సేవలు అందించాలని జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వార్షిక తనిఖీల్లో భాగంగా కొయ్యూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ కి పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్క నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ వార్షిక తనిఖీల్లో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
12-08-2026
www.prajapaksham.in

‘ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ధరల పెరుగుదల, పెరిగిన అవినీతి మొదలైన విషయాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేసి సమాజంలో మార్పు తెచ్చేందుకే ప్రజాచైతన్య యాత్రలు చేపట్టినట్టు సిపిఐ నాయకులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరో రోజు ప్రజాచైతన్యయాత్రలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ’


వరంగల్ జిల్లా నర్సంపేటలో...


సికిందరాబాద్‌లో...


ఖమ్మం జిల్లా కొణిజర్లలో..

# ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు మోదీ ప్రాధాన్యత

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి

ప్రజాపక్షం / విలేకరుల బృందం

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు ప్రాధాన్యత ఇస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు విమర్శించారు. వరంగల్ జిల్లాలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాషామియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్ర మూడో రోజు మంగళవారం వరంగల్ జిల్లా నర్సంపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా వరంగల్ రోడ్డు సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో తక్కళ్లపల్లి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రి, నాయకులు దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, గుండె బద్రి, మియాపురం గోవర్ధన్, ఆక్కపెల్లి రమేష్, కందిక చెన్నకేశవులు, గుంపెల్లి మునీశ్వర్, తాళ్లపల్లి రాహేలా, ఓర్స్ రాజు, అక్బర్, వీరు నాయక్, పత్తి అనంతరెడ్డి, శరత్ , పాషా, సాంబమూర్తి . శ్వేత చిట్యాల సువర్ణ, మున్ని, చిరంజీవి, శంషాద్దీన్ పాల్గొన్నారు.

### మోదీ సర్కార్‌కు కాలం చెల్లింది : ఇటి. నరసింహ

దేశంలో ప్రజా వ్యతిరేక మోదీ సర్కార్‌కు కాలం చెల్లిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ అన్నారు. సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో చిలకలగూడ నుంచి వారాసిగూడ వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, కొమురెల్లి బాబు, ఉమర్‌ఖాన్, సోమయ్య, నరసయ్య, సయ్యద్ గౌస్, యాకయ్య, బిక్షపతి, నాగమణి, పద్మ, లక్ష్మి , చారి, లెనిన్, జోసెఫ్ భాను, అనిల్, కళ్యాణ్, అరుణ్, అంబాల శ్రీనివాస్, రషీద్, వంశీ, రాజు, కుమార్, రవి, యాదగిరి పాల్గొన్నారు.

### మార్పుకోసమే జనచైతన్య యాత్ర : బాగం

ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేసి సమాజంలో మార్పు తెచ్చేందుకే ప్రజాచైతన్య యాత్రలు చేపట్టినట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతురావు తెలిపారు. ఆరవ రోజు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో సాగింది. రామనర్సయ్యనగర్‌లో ప్రారంభమైన యాత్ర అన్నవరం, తుమ్మలపల్లి, తనికెళ్ల, అమ్మపాలెం, రెడ్డిగూడెం, కొండవనమాల, కాచవరం, చిన్నమునగాల, పెద్దమునగాల గ్రామాల్లో సాగింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, గడల భాస్కర్‌రవు, యామాల గోపాల్ రావు, యాసా వెంకటేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు, సింగు నరసింహారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, లతాదేవి, పోటు కళావతి, సీతామహాలక్ష్మి , ఏదులాపురం కౌన్సిలర్ శ్రీజ పాల్గొన్నారు.

### పంటకు కనీస మద్దతు ధర కల్పించాలి : పశ్య పద్మ

పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. సిపిఐ ప్రజా చైతన్యయాత్రలో భాగంగా కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం కేంద్రంలో బస్టాండ్ ఎదుట సిపిఐ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్. సహాయ కార్యదర్శి. పి.బాలరాజ్. నాయకులు. ఎస్‌డి. హైదర్, రాజమణి, దేవయ్య, ప్రవీణ్, రఫీక్, శ్రీనివాస్, మౌలాన్, బి. శుక్రు,రాజ్ మహమ్మద్, శ్యామల, లక్ష్మి , శివప్రసాద్ పాల్గొన్నారు

### మోదీని గద్దె దించడానికే ప్రజాచైతన్య యాత్ర : కలవేణ

మోదీని గద్దె దించడానికే సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. పెద్దపల్లి, పోత్కపల్లిలో జరిగిన చైతన్య యాత్రకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, కె.కనకరాజ్, కార్పొరేటర్ మార్కాపూర్ సూర్య, కోడెమ్ స్వామి, తాళ్లపల్లి మల్లయ్య, లక్ష్మినారాయణ, ఎం. ఎల్లయ్య, ఎజ్జ రాజయ్య, ప్రీతం, శనిగరపు చంద్రశేఖర్, తోడేటి లావణ్య, రచన, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, గట్టయ్య, ఆజాద్, ఆరేపల్లి మానస్ కుమార్, కల్లేపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిందే : బోస్

ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే విధంగా ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్ బోస్ అన్నారు. పాదయాత్రల్లో భాగంగా మంగళవారం మేడ్చల్ జిల్లా ఉప్పల్ డివిజన్‌లో కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఎండి బషీర్ అలీ, పి.రాంనారాయణ్, పరమేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐటియుసి టూరిజం శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, ఆదినారాయణ, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

### విద్యార్థుల పోరాటం స్ఫూర్తి : నెల్లికంటి సత్యం

ఢిల్లీ విద్యార్థుల పోరాట స్ఫూర్తితో కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వంపై ఉద్యమించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్రకు హాజరై దేవరకొండ పట్టణంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ్, బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, సుదర్శన్‌రెడ్డి, కనకాచారి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, రామాంజనేయులు, శైలేష్, రామస్వామి, వెంకటరమణ, రంగారెడ్డి, విజేందర్‌రెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, నవీన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




### ప్రజాసమస్యలు పట్టించుకోని పాలకులు : ఫయాజ్

కేంద్రంలో, రాష్ట్రంలో పాలకులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ విమర్శించారు. సిపిఐ పాదయాత్ర 6వ రోజు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటం గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ చౌరస్తాలో కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు అధ్యక్షత సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఆరి ఇంద్ర, సిపిఐ కోడేరు మండల కార్యదర్శి టి.కిరణ్‌కుమార్, గుర్రపు కుర్మయ్య, కృష్ణయ్య, అలియాస్ లాలి, సాయిలు, బాలపీర్, పరుశురాం, జమీల్, మల్లేష్, హమాలి కురుమయ్య, స్వామి, జంగం శివుడు , కృష్ణయ్య పాల్గొన్నారు.

### ప్రజావ్యతిరేక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి : యానాల

ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణతో కలిసి 'ప్రజా చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. ఆరెగూడెం, మోటకొండూర్, వర్టూరు, చందేపల్లి, చాడ, ముత్తిరెడ్డి గూడెంలలో యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో చెక్క వెంకటేశ్, బండి జంగమ్మ, గాదెగాని మాణిక్యం, కల్లెపల్లి మహేందర్, ముసుకు పెంటరెడ్డి, బొల్ల శ్రీను, బీరకాయలు మల్లేష్, మంచాల రాధమ్మ, పశుల నరసింహ, బొడిగే సుదర్శన్, రాంరెడ్డి, పద్మ, ఉమ, ఏనుగు వెంకట్‌రెడ్డి, సుదాగానీ వెంకన్న పాల్గొన్నారు.

### దేశ సంపద దోచుకుంటున్న పాలకులు : రాజారెడ్డి

దేశ సంపదను పాలకులు దోచుకుంటున్నారని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి ఆరోపించారు. సిపిఐ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రం నుంచి ప్రజా చైతన్య ప్రచార యాత్ర మండలంలోని నెల్లుట్ల గ్రామం వరకు చేరుకుంది. సిపిఐ మండల కార్యదర్శి రావుల సదానందం, జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న ఆకుల శ్రీనివాస్, పోతురు సుగుణమ్మ, సఖి, చొప్పరి సోమయ్య, మాచర్ల కుమార్, చీటూరి ఎల్లయ్య, డికొండ ఆంజనేయులు పాల్గొన్నారు.

### డిజిటలైజేషన్ పేరుతో పన్నుల భారం : పంజాల

డిజిటలైజేషన్ పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నాదని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. సిపిఐ ప్రచార జాతా 6వ రోజు మానకొండూర్ మండలం లో పర్యటించింది. మానకొండూర్, ముంజంపల్లి, చెంజర్ల, కొండపల్కల, దేవంపల్లి, ఊటూర్ గ్రామాల్లో సిపిఐ మండల కార్యదర్శి బండ రాజిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, అందె స్వామి, బండ రాజిరెడ్డి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి , నాగెల్లి లక్ష్మారెడ్డి, సమ్మయ్య, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బామండ్లపెల్లి యుగేందర్ పాల్గొన్నారు.

### జిల్లాకు సాగు జలాలు ఇవ్వాలి : సాబీర్ పాషా

గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించే ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూములకు సాగునీరు అందించాలని సిపిఐ భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాచంద్రుగొండకు చేరుకుంది. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, సారెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్ర కుమార్, డి.వెంకన్న, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమాలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య దసురు, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి.వీరస్వామి, ఎస్‌కె.షమీం, గార్లపాటి రామనాథం, బోర్ర కేశవులు, జడ శ్రీను, రామ లక్ష్మ య్య, భూక్యా శ్రీనివాస్, వరక అజిత్ పాల్గొన్నారు.

### ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టాలి : చెన్న

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కథలపూర్, రుద్రంగి మండలాల్లో పాదయాత్ర నిర్వహించారు. భూషణ్ రావుపేట, పెగ్గర్ల, గంభీర్ పూర్, తంద్రయాల, మానాల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, నాయకులు లక్ష్మి రాజాం, రాజన్న, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

### హామీల అమలులో పాలకులు విఫలం : మంద

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందాయని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ విమర్శించారు. సిపిఐ సిరిసిల్ల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బివైనగర్ జెండా చౌరస్తా నుండి పట్టణ కార్యదర్శి పంతం రవి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య పాదయాత్రను ప్రారంభించారు. ప్రజా చైతన్య యాత్రలో గుంటి వేణు, ఎఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

### ‘ఉపాధికి’ బడ్జెట్ తగ్గించొద్దు : సుధాకర్

ఉపాధిహామీ పథకానికి కేంద్ర బడ్జెట్ తగ్గించొద్దని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న పేద, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై ప్రచార జాతాలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం కూలీలతో దుబాస్ రాములు కలిసి సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమం నాయకులు నల్ల గంగాధర్, నీలి శంకర్, సాయిలు, కొట్టే ప్రసాద్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.




కామారెడ్డి జిల్లాలో...


పెద్దపల్లి జిల్లా పోత్కపల్లిలో...


మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో...



నల్లగొండ జిల్లా దేవరకొండలో...


నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో...


యాదాద్రి జిల్లా మోటకొండూరులో...


కరీంనగర్ జిల్లా మానకొండూరులో...


భద్రాద్రి జిల్లా చంద్రుగొండలో...


జనగాం జిల్లా నెల్లుట్లలో...


జగిత్యాల జిల్లాలో...



నిజామాబాద్ జిల్లాలో...

# తగిన ప్రతిఫలం లేదు

(మొదటి పేజీ తరువాయి)

కర్షకులకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6వ రోజు చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా యాత్ర బృందానికి అడుగడుగునా స్వాగతం పలుకుతూ హారతులు పట్టారు. దారి పొడవునా నిర్వహించిన భారీ మోటార్ సైకిల్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చుంచుపల్లి మండల కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎండి రజబ్ అలీ స్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండల కేంద్రాల్లో జరిగిన చైతన్య యాత్రల బహిరంగ సభల్లో కూనంనేని మాట్లాడారు. సమాజ పరిణామాలపై అవగాహన పెంచి ప్రజలను చైతన్యపరిచే శక్తి ఒక్క కమ్యూనిస్టులకే ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తూ కార్మిక చట్టాలను నరేంద్రమోదీ సర్కార్ నీరుగారుస్తున్నదని మండిపడ్డారు. నింగినంటిన నిత్యావసరాల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగ మరిందని, పంటలకు సరైన మద్దతు ధర లేక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చలి చీమలన్నీ ఐక్యమైతే విప్లవ సైన్యంగా మారినట్లే, బాధితులంతా ఏకమైతే ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని స్పష్టం చేశారు. సుజాతనగర్ మండల కేంద్రంలో కూనంనేనిని గజమాలతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని సహజ వనరులను ఇతర ప్రాంతాలకు దోచుకుపోతున్నారని, సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని భూములకు ఇచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు తరలించుకుకోవాలన్నారు. జిల్లాలో ఇంకా 70 వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టానికి వ్యతిరేకంగా ఫారెస్ట్ అధికారులు పోడు సాగుదారులపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. యాత్ర ప్రారంభంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య సంఘీభావం ప్రకటించా రు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పోరాట ఫలితంగానే కొత్త బొగ్గు గనులు వస్తున్నాయన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్ పాల్గొన్నారు.

### ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి : కూనంనేని

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా సామాన్య పేద, మద్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం రోజురోజుకు పెరుగుతుందని కూనంనేని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, మేకల శ్రీనివాసరావు, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చెనగాని సైదులు, యరసాని రవికుమార్, డేగ వీరన్న, సర్పంచ్ వాడకొప్పుల ఉమా, ఉపసర్పంచ్ స్వాతి, లాలు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com